
సోమవారం 1 జూన్ 2026
https://www.telugudesam.org




# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



ఉత్తరాంధ్ర అభివృద్ధికి దిక్సూచి


**దక్షిణ కోస్తా రైల్వేజోన్**

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

- వివరాలు 3 లో..

# నేటి నుంచే దక్షిణ కోస్తా రైల్వేజోన్

## విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభం



- దశాబ్దాల మన కల నెరవేరుతోంది
- చారిత్రాత్మక మైలురాయి
- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందన




అమరావతి(చైతన్యరథం): ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ కార్యకలాపాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పొందుపరిచిన హామీని కార్యరూపంలోకి తీసుకురావ డంలో సీఎం చంద్రబాబు పట్టుదల ఫలించింది. ఇప్పటివరకు రైల్వేకు సంబంధించి సమస్యల పరిష్కారం కోసం కూడా భువనేశ్వర్‌పై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు విశాఖలోనే జోనల్ కార్యాలయం ఉండటంతో వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకా శం ఉంటుంది. ఈ నేపథ్యంలో తన ఎక్స్ ఖాతా వేదికగా సీఎం చంద్రబాబు నాయుడు ఆదివారం స్పందించారు. జూన్ 1వ తేదీ నుంచి విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ అధికా రికంగా ప్రారంభం కావడం చారిత్రాత్మక మైలురాయి. దశాబ్దాల మన కల నెరవేరుతోంది. నూతన రైల్వేజోన్ ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తుంది. కొత్త ఉపాధి అవకాశా లకు, పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేస్తుంది. మన రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ హబ్‌గా మార్చేందుకు ఇది ఒక కీలక మైలురాయి. ఏపీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కి రాష్ట్ర ప్రజల తరపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# నేడు పేదల సేవలో..

**కాకినాడ జిల్లాలో సీఎం పర్యటన**

**చామవరంలో పింఛన్ల పంపిణీ**



ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో పర్యటించనున్నారు. చామవరంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో పాల్గొంటారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తారు.

# రష్యా పర్యటనకు లోకేష్

- రేపటి నుంచి ఆరురోజులు అక్కడే
- పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం
- ఎస్పీఐ ఎకనామిక్ ఫోరమ్‌కు హాజరు



పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రష్యా పర్యటనకు వెళ్లనున్నారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు రష్యాలో పర్యటించనున్నారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్ సమావేశంలో పాల్గొనాల్సిందిగా మంత్రి లోకేష్‌కు ఆహ్వానం అందింది. రష్యా పర్యటనలో భాగంగా పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలతో లోకేష్ సమావేశం కానున్నారు.

# సింగపూర్ ఓపెన్‌లో స్వర్ణ చరిత్ర

- కోనసీమ కుర్రాడు సాత్విక్ అద్భుతం
- డబుల్స్‌లో చిరాగ్‌తో కలిసి స్వర్ణ పతకం
- యువ క్రీడాకారులకు స్ఫూర్తి సాత్విక్-చిరాగ్
- ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు






సింగపూర్ బ్యాడ్మింటన్ ఓపెన్ 2026 పురుషుల డబుల్స్‌లో కోనసీమ కుర్రాడు చరిత్ర సృష్టించాడు. అమలాపురానికి చెందిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ స్టార్ రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టితో కలిసి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. ఇండోనేషియా జోడీ ఫజర్ ఆల్ఫియన్, మహమ్మద్ ఫిక్రిపై మూడుసెట్లలో ఒక గంట 13 నిమిషాల్లో జరిగిన పోరులో 18- 21, 21-17, 21-16తో గెలుపొందారు. ఈ విజయంతో సింగపూర్ వేదికపై భారత బ్యాడ్మింటన్‌కు అరుదైన గౌరవాన్ని తీసుకువచ్చారు. డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్న భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి - చిరాగ్ శెట్టిలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఏపీకి చెందిన సాత్విక్ విజయంపై ప్రత్యేకంగా గర్విస్తున్నామని వ్యాఖ్యానించారు.

2

# గొడ్డలి పార్టీ డ్రామా!

- వైఎస్ విగ్రహ ధ్వంసం వైసీపీ కార్యకర్తే పనే
- సీసీ ఫుటేజీలో బట్టబయలైన నాటకం
- ఎన్నిసార్లు దొరికినా కుట్రలు మానరా?
- సైకో బ్యాచ్‌కి లోకేష్ కౌంటర్

2



నంద్యాల జిల్లాలో వైఎస్ విగ్రహం ధ్వంసం ఘటనలో గొడ్డలి పార్టీ డ్రామాలు బట్టబయలయ్యాయి. వైసీపీ కుట్రలు వెలుగులోకి వచ్చాయి. సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా వైసీపీ డ్రామా బట్టబయ లైంది. ఈ ఘటనకు పాల్పడింది వైసీపీ కార్యకర్త జమలయ్యగా పోలీసులు తేల్చారు. దీనిపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. బాబాయి గుండెపోటు, కోడి కత్తి, గులకరాయి నాటకాల రాయు డైన జగన్.. మరో కొత్త డ్రామా సృష్టించాడని ధ్వజమెత్తారు. ఎన్ని సార్లు దొరికిపోయినా.. కుట్ర, క్షుద్ర రాజకీయాలు మానరా? అని ప్రశ్నించారు.




చైతన్యరథం

# యువ క్రీడాకారులకు స్ఫూర్తి సాత్విక్-చిరాగ్

# ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు

అమరావతి(చైతన్యరథం): సింగపూర్ బ్యాడ్మింటన్ ఓపెన్ 2026 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్న భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి – చిరాగ్ శెట్టిలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. భారత బ్యాడ్మింటన్‌కు మరో చారిత్రాత్మక విజయా న్ని అందించిన ఈ స్టార్ జంట దేశానికి గర్వకారణంగా నిలిచింద ని వ్యాఖ్యానించారు. సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ ప్రపంచ వేదికపై భారతకు మరోసారి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారయని.. వారి అద్భుత ప్రతిభ, అచంచల పట్టుదల, నిరంతర కృషికి ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి విజయంపై ప్రత్యేకంగా గర్విస్తున్నా మని సీఎం వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయిలో ఆయన



సాధిస్తున్న విజయాలు రాష్ట్ర యువతకు, క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని కొనియాడారు. భారత బ్యాడ్మింటన్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళుతున్న ఈ జోడీ భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. దేశం కోసం మరిన్ని పతకాలు, టైటిళ్లు సాధించి భారత క్రీడా చరిత్రలో కొత్త అధ్యాయాలు సృష్టించాలని శుభాకాంక్షలు తెలిపారు.

**సాత్విక్ విజయం గర్వకారణం: ఎంపీ సానా సతీశ్**

సింగపూర్‌లో జరిగిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెం ట్‌లో సాత్విక్ సాయిరాజ్ విజయంపై తెలుగుదేశం ఎంపీ సానా సతీశ్ హర్షం వ్యక్తం చేశారు. పురుషుల డబుల్స్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన తెలుగు క్రీడాకారుడు, అమలాపురానికి చెందిన సాత్విక్ విజయం గర్వకారణమని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి భారత దేశానికి స్వర్ణ పతకాన్ని అందించడం సంతోషకరమని పేర్కొ న్నారు. సాత్విక్ విజయం దేశ యువతకు స్ఫూర్తిదాయకమని అభినందించారు. క్రీడల పట్ల అంకితభావం, కఠోర శ్రమ ఉంటే ప్రపంచస్థాయిలో విజయాలు సాధించవచ్చని మరోసారి నిరూపించడం గొప్ప విషయమని తెలిపారు.

# సింగపూర్ ఓపెన్‌లో స్వర్ణ చరిత్ర




- **కోనసీమ కుర్రాడు సాత్విక్ అద్భుతం**
- **డబుల్స్‌లో చిరాగ్‌తో కలిసి స్వర్ణ పతకం**

అమరావతి(చైతన్యరథం): సింగపూర్ బ్యాడ్మింటన్ ఓపెన్ 2026 పురుషుల డబుల్స్‌లో కోనసీమ కుర్రాడు చరిత్ర సృష్టించాడు. అమలా పురానికి చెందిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ స్టార్ రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ భారత క్రీడా చరిత్రలో తన పేరును సువర్ణాక్ష రాలతో లిఖించుకున్నాడు. సింగపూర్ బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ విభా గంలో చిరాగ్ శెట్టితో కలిసి అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇండోనేషియా జోడీ ఫజర్ అల్ఫియన్, మహమ్మద్ ఫిక్రిపై మూడుసెట్లలో ఒక గంట 13 నిమిషాల్లో జరిగిన పోరులో 18–21, 21–17, 21–16తో గెలుపొందారు. ఈ విజయంతో సింగపూర్ వేదికపై భారత బ్యాడ్మింటన్‌కు అరుదైన గౌరవాన్ని తీసుకువచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు తీసుకువచ్చారు. ప్రపంచ స్థాయి ఆటగాళ్ల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో వేగవంతమైన స్మాష్‌లు, అద్భుత సమన్వయం, వ్యూహాత్మక ఆటతో ప్రత్యర్థులను నిలువరించి ఫైనల్‌లో విజయం సాధించారు. ఈ స్వర్ణ పతకం భారత బ్యాడ్మింటన్ చరిత్రలో ఒక ప్రత్యేక మైలురాయిగా నిలిచింది. అమలాపురం వంటి ప్రాంతం నుంచి ఎదిగి ప్రపంచ బ్యాడ్మిం టన్‌లో అగ్రస్థానానికి చేరుకున్న సాత్విక్ సాయిరాజ్ యువ క్రీడా కారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన సాధించిన ఈ ఘన తపై కోనసీమ జిల్లా ప్రజలు, క్రీడాభిమానులు, బ్యాడ్మింటన్ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

**ఎన్నిసార్లు దొరికినా**

# కుట్రలు మానరా?

**గొడ్డలి పార్టీకి లోకేష్ కౌంటర్**



అమరావతి(చైతన్యరథం): నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసమైన ఘటనపై వైకాపా శ్రేణులు ఆందోళనకు దిగిన విష యం తెలిసిందే. దీనిపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం చేసిన జమ్ములయ్య.. వైకాపా నేతల అనుచరుడేనని పోలీసులు తేల్చినట్లు చెప్పారు. బాబాయి గుండెపోటు, కోడి కత్తి, గులకరాయి నాటకాల రాయుడైన జగన్.. మరో కొత్త డ్రామా సృష్టించాడని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు తన గొడ్డలి పార్టీ కార్యకర్తలను సైకో జగన్ రంగంలోకి దింపారని మండిపడ్డారు. జగన్నాటకాలు చూసి జనం ఛీకొట్టినా.. డ్రామాలు మానట్లేదని అన్నారు. ఎన్ని సార్లు దొరికిపోయినా.. కుట్ర, క్షుద్ర రాజకీయాలు మానరా? అని ప్రశ్నించారు.

**అజిత్ కుటుంబానికి**

## పవన్ ప్రగాఢ సానుభూతి

అమరావతి (చైతన్య రథం): ప్రముఖ నటుడు అజిత్ మాతృమూర్తి మోహిని మణి కన్నుమూశారని తెలిసి చింతిస్తున్నానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్కొన్నారు. ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "మోహిని మణి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. మాతృ వియోగపు బాధ నుంచి అజిత్ త్వరగా కోలుకోవాలి. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి" అని పేర్కొన్నారు.

# సూపర్‌స్టార్ కృష్ణకు సీఎం చంద్రబాబు నివాళి

అమరావతి(చైతన్యరథం): పద్మభూషణ్ కృష్ణ జయంతి సంద ర్భంగా సీఎం చంద్రబాబు ఎక్స్‌వేదికగా నివాళులర్పించారు. తెలుగు సినీ పరిశ్రమకు నటుడిగా, దర్శకుడిగా, సాహసోపేత నిర్మాతగా విశిష్ట సేవలందించిన ఆయనను స్మరించు కున్నారు. నూతన సాంకేతికతలను తెలుగు సినిమాకు పరిచయం చేస్తూ సినీ రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయం. అభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించిన ఆ మహానటుడికి



ఘన నివాళులు అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# "పేదల సేవలో"

# పండుగలా చేద్దాం

- **టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**
- **పెన్షన్ల పంపిణీపై పార్టీ శ్రేణులతో టెలీకాన్ఫరెన్స్**

అమరావతి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "పేదల సేవలో" కార్యక్రమాన్ని పండుగలా చేద్దామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. జూన్ 1న ఏపీ వ్యాప్తంగా జరగనున్న "ఎన్టీఆర్ భరోసా" పెన్షన్ పంపిణీ కార్యక్రమం, క్యాలెండర్ మీటింగ్స్‌పై ఆదివారం పార్టీ శ్రేణులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 24 నెలల్లోనే రూ.66 వేల కోట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజల సంక్షేమం కోసం ఒక్క పెన్షన్ పథకానికే అందజే శాం. ప్రతినెలా పెన్షన్ పథకానికి రూ.2,728 కోట్లతో 62, 76,325 మందికి 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లను అందజేస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా పేదల సంక్షేమం కోసం ఇంత మొత్తంలో అందజేయడం లేదు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక కార్యక్ర మంలో రాష్ట్ర మంత్రుల నుంచి క్షేత్ర స్థాయి నాయకుల వరకు సచివాలయ ఉద్యోగులతో కలిసి ప్రతి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్‌ను అందించే



కార్యక్రమంలో పాల్గొందా మని పిలుపునిచ్చారు. అలాగే పార్టీ యంత్రాంగాన్ని సంస్థాగతంగా బలో పేతం చేసేం దుకు ప్రతి బుధవారం నాలుగు స్థాయిలలో "క్యాలెండర్ మీటింగ్స్" సమావేశాలు జరగనున్నా యి. 1వ బుధవారం యూనిట్ స్థాయి, 2వ బుధవారం మండల స్థాయి, 3వ బుధవారం నియోజకవర్గ స్థాయి, 4వ బుధవారం పార్లమెంట్ స్థాయిలో కింది స్థాయి సమస్యలను పై స్థాయి సమా వేశాల్లో చర్చిస్తూ 3 నెలల కొకసారి స్టేట్ జనరల్ బాడీలో తీర్మానిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అంది స్తున్న సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని ప్రజ ల్లోకి బలంగా తీసుకెళుతూ రేపటి పెన్షన్ల పంపిణీని విజయవంతం చేద్దామని కోరారు.

# ఐహెచ్‌డీపీ కింద

# ఉమ్మడి ప్రకాశానికి నిధులు

- **రాబోయే మూడేళ్లలో గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.920 కోట్లు**
- **రోడ్లతోపాటు వెలిగొండ పేజ్-2, కొరిశపాడు, పాలేరు రిజర్వాయర్ పనులకు ప్రాధాన్యత**
- **ఉమ్మడి ప్రకాశం తరపున సీఎంకు మంత్రి స్వామి కృతజ్ఞతలు**



ప్రకాశం /ఊర్పు నాయుడుపాలెం చైతన్య రథం): ఇంటిగ్రేటెడ్ హార్టికల్చరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఐహెచ్‌డీపీ) కింద ఉమ్మడి ప్రకాశం జిల్లాకు పెద్ద మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సీఎం, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మంత్రి డా.స్వామి ప్రకటన విడుదల చేస్తూ.. "ఇంటిగ్రేటెడ్ హార్టికల్చరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో రాయలసీమ జిల్లాతోపాటు ఉమ్మడి ప్రకాశం (ప్రకాశం, మార్కాపురం) జిల్లాను కలిపి పెద్ద మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఐహెచ్‌డీపీతో నీటి పారుదల అభివృద్ధి, రహదారుల అనుసంధానం, ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఇందులో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు రాబోయే మూడేళ్లలో గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.920 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రోడ్లతోపాటు వెలిగొండ పేజ్–2 , కొరిశపాడు, పాలేరు రిజర్వాయర్ పనులకు ప్రాధాన్యతనిచ్చింది. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... ఇంటిగ్రేటెడ్ హార్టికల్చరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుతో ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రామీణ రోడ్ల రూపురేఖలు మారిపోతాయి. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉద్యాన పంటల సాగు పెరిగి హార్టికల్చర్ హబ్‌గా మారుతుంది. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న సీఎం, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు.

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి దిక్సూచి
# దక్షిణ కోస్తా రైల్వేజోన్

- చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే రోజు
- 30 ఏళ్ల టీడీపీ పోరాట ఫలితం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం(చైతన్యరథం): జూన్ 1 తెలుగు ప్రజల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే రోజని, ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, తరాల పోరాటం, లక్షలాది మంది ఆకాంక్షలకు ప్రతిరూపంగా విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆవిర్భ విస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ విజయం ఒక్క నాయకుడిదో కాద ని..ఉత్తరాంధ్ర నేలపై జన్మించిన ప్రతి తెలుగు బిడ్డదని పేర్కొన్నారు. రైల్వేజోన్ కోసం జరిగిన ఉద్యమాలు, పోరాటాలను తలుచుకుంటే గర్వంగా ఉంది. విద్యార్థులు, యువకులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చి పోరాడిన ఉద్యమ ఫలితమే నేడు దక్షిణ కోస్తా రైల్వేజోన్ అని చెప్పారు.

**ఒక తరం పోరాటం..**

**మరో తరం సాధించిన విజయం**

రైల్వే జోన్ కోసం ఎంతో మంది నాయకులు తమ జీవితాలను అంకితం చేశారని పల్లా గుర్తు చేశారు. కీర్తిశేషులు ఎర్రన్నాయుడు ప్రారంభించిన ఉద్యమం నేడు ఆయన కుమారుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హయాంలో ఫలితాన్నివ్వడం విశేషమన్నారు. ఎం.ఎస్.మూర్తి చేసిన పోరాటానికి నేడు ఆయన మనవడు విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రజాప్రతినిధిగా ఉన్న సమ యంలో న్యాయం జరిగిందని పేర్కొన్నారు. అలాగే ప్రతిమశెట్టి అప్పల నరసింహం, అనేక మంది ఉద్యమకారులు, ప్రజా ప్రతి నిధులు చేసిన కృషి కూడా ఈ విజయానికి పునాది అని వివరిం చారు. ఒక తరం ఉద్యమం చేస్తే... మరో తరం దాన్ని సాకారం చేసుకున్న అరుదైన చారిత్రక ఘట్టమని వ్యాఖ్యానించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు తెలుగుదేశం పార్టీ మూడు దశాబ్దాలుగా సాగించిన నిరంతర పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు.

**చంద్రబాబు సంకల్పం..**

**మోదీ సహకారంతో సాకారం**

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పొందుపరిచిన హామీని కార్య రూపంలోకి తీసుకురావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు దల కీలక పాత్ర పోషించింది. రైల్వే జోన్ అంశాన్ని ఎప్పటికప్పు డు కేంద్రం దృష్టికి తీసుకెళ్తూ నిరంతర ఒత్తిడి తీసుకు వచ్చారని చెప్పారు. ప్రధాని మోదీ, పవన్‌కళ్యాణ్, ఎమ్మెసాని చంద్రశేఖర్, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ తదితరుల కృషి కూడా ఈ విజయానికి కారణమైందన్నారు. రైల్వే జోన్ ఏర్పాటుకు పూర్తి సహకారం అందించి ప్రక్రియను వేగవంతం చేసిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఉత్తరాంధ్ర ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



**ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిక్సూచి**

ఇప్పటి వరకు రైల్వేకు సంబంధించిన చిన్నచిన్న సమస్యల పరి ష్కారం కోసం కూడా భువనేశ్వర్‌పై ఆధారపడాల్సి వచ్చేదని పల్లా గుర్తు చేశారు. ఉద్యోగా లు, నియామకాలు, అభివృద్ధి పనులు, రైల్వే ప్రాజె క్టుల కోసం ఉత్తరాంధ్ర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఇప్పుడు విశాఖలోనే జోనల్ కార్యాల యం ఉండటంతో స్థానిక అవసరా లకు అనుగుణంగా వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలు, కొత్త రైళ్లు, ట్రాక్ విస్తరణ, స్టేషన్ అభివృద్ధి వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తుందని పేర్కొన్నారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటుకు అవకాశాలు పెరగడంతో యువతకు ఉద్యోగావకాశాలు మరింత విస్తరించ నున్నాయని తెలిపారు.

**పోర్టులు, పరిశ్రమలకు బలమైన అండ**

విశాఖపట్నం, గంగవరం పోర్టులు, ఉక్కు కర్మాగారం, పారిశ్రా మిక కారిడార్లు, తయారీ రంగాలకు రైల్వే జోన్ ఎంతో ఉపయో గపడుతుందని వివరించారు. సరుకు రవాణా వ్యయం తగ్గడంతో పరిశ్రమలకు పోటీ సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ఎగుమ తులు, దిగుమతులు వేగవంత మవడంతో ఉత్తరాంధ్ర ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉందన్నారు. గాజువాక, అచ్యుతాపురం, నక్కపల్లి, విశాఖ పారిశ్రామిక ప్రాంతా లతో పాటు పోర్టు ఆధారిత పరిశ్రమలకు రైల్వేజోన్ గొప్ప ఊతమివ్వ బోతోందన్నారు. స్థానిక స్థాయిలో తీసుకునే నిర్ణయాలు పరిశ్రమల విస్తరణకు దోహదపడతాయని తెలిపారు.

**ప్రతి తెలుగు వాడి విజయోత్సవం**

దేశంలో 18వ రైల్వే జోన్‌గా, సుమారు 4 వేల కిలోమీటర్ల పరిధితో, ఆంధ్రప్రదేశ్‌లో 99 శాతం రైల్వే నెట్‌వర్క్‌ను కవర్ చేసే జోన్‌గా దక్షిణ కోస్తా రైల్వే అవతరించడం గర్వకారణమని పేర్కొ న్నారు. ఇది కేవలం ఒక రైల్వే జోన్ కాదు... ఉత్తరాంధ్ర ఆత్మ గౌరవానికి లభించిన గౌరవం. ప్రజల ఆకాంక్ష లు, ఉద్యమాల విజయానికి ప్రతీక. అందుకే జూన్ 1ను ప్రతి నియోజకవర్గంలో, ప్రతి గ్రామంలో, ప్రతి రైల్వేస్టేషన్ వద్ద సంబరంగా జరుపుకోవాలి. మిఠాయిలు పంచుకుని ప్రజల విజయంగా చాటాలని పిలుపునిచ్చారు.

## ఉత్తరాంధ్ర చిరకాల స్వప్నం నెరవేరింది

**దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభంపై మంత్రి సత్యకుమార్**

అమరావతి (చైతన్య రథం): దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు సోమవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయని వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైల్వే రంగ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ పెడుతోందని మంత్రి తెలిపారు. రూ.85 వేల కోట్లతో రైల్వే రంగంలో అభివృద్ధి పనులు జరుగు తున్నాయని వెల్లడించారు. "ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు సోమవారం నుంచి ప్రారంభం కాబోతుండడం ద్వారా ఉత్తరాంధ్రవాసుల నిరీక్షణ ఫలించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో ఇప్పటికే ఉత్తరాంధ్ర, ముఖ్యం గా వైజాగ్ ఐటీ హబ్‌గా మారింది. ఇదే సమయంలో రైల్వే జోన్ కొత్తగా రావడం ద్వారా ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయి" అని మంత్రి అన్నారు.

కొత్త జోన్‌వల్ల విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, భోగాపురం ఎయిర్‌పోర్టుకు అనుసంధానం పెరగనుందని మంత్రి పేర్కొన్నారు.



విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడ్డాయని తెలిపారు. 2014 రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకుందని, ఇది ఉత్తరాంధ్ర ప్రజల విజయమని మంత్రి అభివర్ణించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.10,135 కోట్లు కేంద్రం కేటాయించిందని, ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం పెట్టే శ్రద్ధకు నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. రైల్వే జోన్ కల నెరవేర్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలనుంచి అర్జీలు స్వీకరించిన మంత్రి బీసీ

బనగానపల్లె (చైతన్య రథం): ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రోడ్లు భవనాల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సూచించారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం అభివృద్ధితో కూడిన సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అన్నారు. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఈ అర్జీలు



స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితుల నుంచి ఆనందం వ్యక్తం అవుతుంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.



### శాప్ సమ్మర్ క్యాంప్‌తో
## విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి

**ముగింపు వేడుకలో మంత్రి మండిపల్లి**

విజయవాడ, చైతన్య రథం: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ ముగింపు క్యాంప్-2026 కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు. క్రీడల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముచ్చటించిన మంత్రి, యువత క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు.

# బాబొస్తే జాబు... జగనొస్తే చావే

- రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత సెటైర్
- మెగా డీఎస్సీలో అక్రమాలకు తావే లేదు
- వైసీపీ నేతల బిడ్డలూ డీఎస్సీతో టీచర్లయ్యారు
- 2 లక్షలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ సీఎం ఘనత
- ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా ఇవ్వని జగన్
- టీడీపీ మహిళ రిజర్వేషన్ల ప్రకటనతో జగన్ మైండ్ బ్లాంక్
- మెగా డీఎస్సీలో అక్రమాలంటూ డైవర్షన్ పాలిటిక్స్
- జగన్ వైఖరిపై మంత్రి సవిత మండిపాటు
- అనంతలో ప్రతిభ పురస్కారాల పంపిణీ
- 750మందికి నగదు ప్రోత్సాహకాలు, మెమోంటోలు అందజేత



అనంతపురం (చైతన్య రథం): 'ఒక్క ఛాన్స్ ఇవ్వండి... సీపీఎస్ రద్దు చేస్తాను... ఏటా డీఎస్సీ నిర్వహిస్తాను... జాబ్ క్యాలెండర్ ఇస్తాను...అని చెప్పారు. నేనొస్తే జాబులు వస్తాయన్నారు..కాని వైసీపీ హయాంలో డగ్స్, గంజాయి వచ్చింది... ఆయనొస్తే చావు గ్యారంటీ'అని జగన్‌పై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత తీవ్రంగా విమర్శించారు. 2025 మెగా డీఎస్సీలో అక్రమాలకు తావేలేదని, అవకతవతకలు జరిగాయని ఆరోపిస్తున్న జగన్ రుజువులు చూపాలని మంత్రి సవిత సవాల్ విసిరారు. వైసీపీ పార్టీ నాయకుల బిడ్డలు సైతం మెగా డీఎస్సీలో ఎంపికై ఉపాధ్యాయు లుగా పాఠాలు చెబుతున్నారన్నారు. ముఖ్యమంత్రిగా సీఎం చంద్రబాబు నేటి వరకూ రెండు లక్షల పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారన్నారు. నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు టీచర్ల అపాయింట్ మెంట్ లెటర్లు ఇచ్చారన్నారు. కాని, జగన్... అయిదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయకపోగా, గురువులను వైన్ షాపుల దగ్గర కాపలా పెట్టాడని మండిపడ్డారు. ఆయనకు సీబీఐ అన్నా, ఆ సంస్థ చట్టాలన్నా గౌరవం లేదన్నారు. అనంతపురంలో కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఆ సామాజిక వర్గానికి చెందిన 750 విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను మంత్రి సవిత చేతుల మీదుగా అందజేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల జరిగిన టీడీపీ హైబ్రీడ్ మహానాడులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి తమ పార్టీ సిద్ధమవ్వడంతో జగన్ కు మైండ్ పనిచేయడం లేదన్నారు. పార్లమెంట్ లో మహిళా బిల్లు పాస్ కాకపోయినా, ఏపీ చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్లను టీడీపీ అమలుచేయ నుందని మంత్రి నారా లోకేశ్ ప్రకటించడంపై మహిళలను విపరీతమైన స్పందన వస్తోందన్నారు. దీన్నిచూసి ఓర్వలేకపోతున్న జగన్ డైవర్షన్ పొలిటిక్స్ కు తెరతీశాడని మంత్రి సవిత మండిపడ్డారు.

**జగన్ వస్తే చావే...**

2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను జగన్ అమలు చేయడంలో తీవ్రంగా విఫలమయ్యారని మంత్రి సవిత విమర్శించారు. సంపూర్ణ మద్యనిషేధం అమలు చేయలేదన్నారు. ఏటా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఇస్తామని మాట తప్పారన్నారు. సీపీఎస్ రద్దు చేస్తామని ఉపాధ్యాయులను మోసగించాడన్నారు. అయిదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయకపోగా, చివరికి గురువులను మద్యం షాపుల దగ్గర కాపలాపెట్టిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకూ సీఎం చంద్రబాబు రెండు లక్షలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ చేశారన్నారు. బాబు వస్తే జాబు గ్యారంటీ అని, జగన్ వస్తే జాబులు రాలేదని చావులు మాత్రం వచ్చాయని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో విచ్చలవిడిగా దొరికిన డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకున్నారన్నారు.

**పాదర్శకంగా మెగా డీఎస్సీ**

ఎప్పుడో ఏడాది కిందట జరిగిన మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగియంటూ జగన్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని, ఎటువంటి రుజువులున్నా చూపించాలని సవాల్ విసిరారు. వైసీపీ హయాంలో ఉద్యోగాల్లేక యువత మనోవేదనకు గురయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, మెగా డీఎస్సీ నిర్వహణ ఫైల్ పై సీఎం చంద్రబాబు సంతకం చేసి, నిరుద్యోగులకు బాసటగా నిలిచారన్నారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించి, 16 వేల టీచర్ పోస్టులు చేసిందన్నారు. వైసీపీ నాయకుల పిల్లలు సైతం డీఎస్సీలో క్వాలిఫై అయి పిల్లలకు పాఠాలు చెబుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సానుకూల దృక్పథాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారన్నారు. సీబీఐ అన్నా, ఆ సంస్థ చట్టాలన్నా జగన్ కు గౌరవమే లేదని మంత్రి సవిత విరుచుకుపడ్డారు.

**విద్యతోనే అందలం**

అంతకుముందు కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేయడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ద్వారా కూడా పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నామన్నారు. ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో 550కి పైగా మార్కులు సాధించిన 24 మంది పేద విద్యార్థులకు రూ.25 వేలు చొప్పున, ఇంటర్ లో 950 మార్కులు సాధించిన 72 మంది విద్యార్థులకు రూ.50 వేలతో పాటు ల్యాప్ టాప్ అందజేయనున్నట్లు తెలిపారు. విద్యతోనే అందలం సాధ్యమవుతుందన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను ఉన్నత విద్యలు చదివించేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు సైతం తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తూ, సమాజాభివృద్ధి భాగస్వాములవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ మార్కులు సాధించిన 750 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, మెమోంటోలను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఆ సామాజిక వర్గీయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జగన్ ఆరోపణలు అర్థరహితం

- ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ వేయలేదు
- డీఎస్సీతో ఉద్యోగాలు భర్తీ చేస్తే.. కూటమిపై నీచ రాజకీయాలా?
- యువత, ఉద్యోగులను రోడ్డున పడేయడమే లక్ష్యంగా జగన్ కుట్రలు
- మహానాడు విజయాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నాడు...
- ఎక్సైజ్, గనుల మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్



ఒంగోలు (చైతన్య రథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పాలన, అభివృద్ధి, మహానాడు విజయవంతం చూసి ఓర్వలేక జగన్ రెడ్డి డీఎస్సీపై దిక్కుమాలిన ఆరోపణలు చేస్తున్నాడని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. తాజాగా విడుదలైన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి.. ఒంగోలు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు కనీ వినీ ఎరుగని రీతిలో జరిగింది. సుమారు 24 లక్షల మంది కార్యకర్తలు, నాయకులు హైబ్రిడ్ మోడ్‌లో పాల్గొన్నారు. పార్టీ అధినాయకత్వం ప్రకటించిన 21 తీర్మానాలకు మద్దతు పలికారు. ఈ కార్యక్రమాన్ని చూసి ఓర్వలేక క్రిమినల్ జగన్ రెడ్డి.. మహానాడుపై విమర్శలు చేస్తున్నాడు. రాష్ట్ర ప్రగతి కోసం నాడు అన్న ఎన్టీఆర్ మహానాడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలుగు జాతికి, తెలుగు ప్రజలకు దశ దిశ నిర్దేశించేలా మహానాడు నిర్వహిస్తూ వచ్చారు. మహానాడు కార్యక్రమానికి ప్రజల నుండి వస్తున్న ఆదరణ, రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమాభివృద్ధిని చూసి తట్టుకోలేక మెగా డీఎస్సీ అంటూ దిక్కుమాలిన విమర్శలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క డీఎస్సీ కూడా అమలు చేయని జగన్ రెడ్డి.. ఇప్పుడు ఏదో జరిగిపోయిందంటూ విమర్శలు చేయడం సిగ్గుచేటు. ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేకపోయారు. కానీ కూటమి అధికారంలోకి రాగానే హామీ మేరకు 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుండి డీఎస్సీని అడ్డుకోవడానికి 200కి పైగా కోర్టు కేసులు వేసి ఇబ్బందులకు గురి చేశారు. అయినా వాటన్నింటినీ ఎదుర్కొని డీఎస్సీ పూర్తి చేసి ఉద్యోగాలు భర్తీ చేశాం. వారంతా ఉద్యోగాలు చేసుకుంటుంటే ఇప్పుడు ఏదో జరిగిపోయిందంటున్నాడు. జగన్ రెడ్డి కుంభకోణాలు బయట పడుతున్నప్పుడల్లా.. రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందంటూ ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా రాద్ధాంతం చేయడం అలవాటుగా మారిపోయింది. అమరావతి బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలిపినపుడు మావిగన్ అన్నాడు. ఇప్పుడు జగన్ రెడ్డి పీఏ బాగోతం బయట పడుతుండడంతో డీఎస్సీని బూచిగా చూపుతున్నాడు. జగన్‌రెడ్డి పీఏ వందల కోట్లు సంపాదించాడని తేలింది. పీఏ ఆ స్థాయిలో సంపాదించాడంటే.. జగన్‌రెడ్డి ఏస్థాయి అరాచకాలకు పాల్పడ్డాడో ప్రజలు ఆలోచించాలి. గతంలో తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని లక్షల కోట్లు దోచుకున్నాడు. వందల కొద్దీ షెల్ కంపెనీలు పెట్టి మనీలాండరింగ్ కేసులో జైలుకు కూడా వెళ్లాడు. అవినీతి పార్టీ, దోపిడీ పార్టీ, క్రిమినల్ నైజం ఉన్న వ్యక్తి జగన్ రెడ్డి చివరికి తల్లిని చెల్లిని ఇంటి నుండి గెంటేశాడని మంత్రి కొల్లు ఎద్దేవా చేశారు.

"మహిళలకు టీడీపీ 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీర్మానం చేస్తే కనీసం హర్షం వ్యక్తం చేయలేకపోయాడు. తల్లికి చెల్లికి అన్నం పెట్టనోడు రాష్ట్రంలోని మహిళల గురించి ఆలోచిస్తాడనుకోవడం పిచ్చితనం. గతంలో పొగాకు రైతులకు ఇక్కడ అండగా నిలిచాం. ఇప్పుడు కూడా పొగాకు రైతులకు అండగా నిలుస్తామని సీఎం హామీ ఇచ్చారు. తమిళ నాడు పడవలు ఏపీ మత్స్యకారుల్ని పెడుతుండడంతో తక్షణమే పరిష్కరించాం. వేట నిషేధ సమయంలో 1.30 లక్షల మందికి ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున రూ.260 కోట్లు అందించాం. ఒకటోతేదీన పెన్షన్లు అందిస్తున్నాం. తల్లికి వందనం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ లాంటి సూపర్ సిక్స్ పథకాలన్నీ పక్కాగా అమలు చేస్తున్నాం. కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలుస్తుండడాన్ని చూసి ఓర్వలేక జగన్‌రెడ్డి నీచ రాజకీయాలకు తెరలేపుతున్నాడు" అంటూ జగన్‌పై కొల్లు ఫైర్ అయ్యారు.

"అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులతో ఆక్వా కాస్త కష్టకాలం ఎదుర్కొంటోంది. పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తి చేయడం ద్వారా నష్టాలపాలవ్వకుండా చూసుకోగలుతాం. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ తగ్గుతోంది. ముడి సరుకుల ధరలు పెరుగుతున్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. తగిన చర్యలు తీసుకుని ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నాం" అని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, పొడపాటి తేజశ్విని తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హోంగార్డుపై దాడి దురదృష్టకరం: హోంమంత్రి



విశాఖపట్నం (చైతన్య రథం) విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు వెంకటరమణపై కత్తితో దాడి జరగడం అత్యంత దురదృష్టకరమని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. లంకెలపాలెం వద్ద విధులు నిర్వర్తిస్తున్న సమయంలో దుండగులు దాడికి గురై గాయపడిన హోంగార్డు వెంకటరమణ ప్రస్తుతం షీలా నగర్ కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఆసుపత్రికి వెళ్లిన హోంమంత్రి అనిత, వెంకటరమణను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు వెంకటరమణపై కత్తితో దాడి చేయడం తీవ్రంగా ఖండించదగిన చర్య అని అన్నారు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు అయినప్పటికీ, పోలీసులు వెంటనే స్పందించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారని తెలిపారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో వెంకటరమణ చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఘటనకు పాల్పడిన నిందితులను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారని, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తుందని, అవసరమైన పటిష్ట చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పోలీసులు ప్రజల భద్రత కోసం అనునిత్యం కష్టపడి విధులు నిర్వహిస్తున్నారని, వారి విధుల నిర్వహణకు ప్రజలు కూడా సహకరించాలని హోం మంత్రి విజ్ఞప్తి చేశారు. చట్టాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని మంత్రి అనిత స్పష్టం చేశారు.

# హింసాత్మక ఘటనలను సహించం

- అక్రమ మైనింగ్, అసత్య ప్రచారాలపై అప్రమత్తం
- రాజకీయ ప్రయోజనాలకై వ్యక్తిగత దాడులు తగదు
- సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలి
- దాడి ఘటనపై కఠిన చర్యలకు పోలీసులకు ఆదేశాలు
- సమాచార, పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి



విజయవాడ (చైతన్య రథం): ఆగిరిపల్లి మండలం శోభనాపురానికి చెందిన నక్కనబోయిన సాంబశివరావు యాదవ్‌పై ఇటీవల జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని సమాచార, పౌర సంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక కొత్త ప్రభుత్వవద్ద ఆదివారం పరామర్శ అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఘటన గురించి సమాచారం అందిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులను అప్రమత్తం చేసి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలుతీసుకోవాలని పోలీసుశాఖకు సూచించినట్లు వెల్లడించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్న మంత్రి, రాజకీయ నేతలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎలాంటి హింసాత్మక చర్యలను ప్రోత్సహించరాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విభేదాలను చర్చలు, చట్టబద్ధ మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి, వాస్తవాలను ప్రజలకు చేరవేయడానికి ఉపయోగపడాలని, వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారాలు, అభాండాలు వేయడానికి కాదని మంత్రి సూచించారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణంలో గ్రేవల్‌తోపాటు ఇతర ఖనిజ వనరులు కీలకమని, మైనింగ్ కార్యకలాపాలు పూర్తిగా చట్టబద్ధంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పక్కనపెట్టి ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు చేయడం బాధాకరమని పేర్కొన్న మంత్రి, అధికారులను, వ్యాపార వర్గాలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత దాడులు చేయడం, శాంతిభద్రతలకు భంగం కలిగించడం సమంజసం కాదని స్పష్టం చేస్తూ.. సమాజ శ్రేయస్సుకు అందరూ సంయమనం పాటిస్తూ, బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వేరే వార్డుల్లోని పేషెంట్లనూ మంత్రి పార్థసారథి పరామర్శించారు.

## మెగా డీఎస్సీపై వైసీపీ కుట్రలు విఫలం

**మంత్రి సత్యప్రసాద్**



అమరావతి (చైతన్య రథం): మెగా డీఎస్సీ 2025పై వైసీపీ అడ్డుకోవడానికి 32 కేసులు దాఖలు చేసినప్పటికీ అన్నీ విఫలమయ్యాయని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయని జగన్‌రెడ్డి, ఇప్పుడు మెగా డీఎస్సీపై అడ్డంకులు కల్పించడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. ప్రశ్నాపత్రం లీక్ అయిందనీ, డేటా డిలీట్ చేశారనీ వైసీపీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని మంత్రి స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ 2025ను పూర్తి నిబంధనలు పాటిస్తూ, అవినీతికి, మానవ జోక్యానికి ఏమాత్రం తావు లేకుండా రికార్డు సమయంలో పారదర్శకంగా నిర్వహించిన మంత్రి నారా లోకేష్‌ను ఆయన అభినందించారు. ప్రశ్నాపత్రాలు దొంగలించి లీక్ చేయడం ఏ పార్టీ నాయకుడికి అలవాటో ప్రజలకు తెలుసని, జగన్‌రెడ్డి హైదరాబాద్‌లో పదో తరగతి చదివే రోజుల్లో ప్రశ్నాపత్రం దొంగతనం చేసిన విషయం అందరికీ తెలిసిందేనని మంత్రి గుర్తు చేశారు.

# బస్సు ప్రమాద బాధితులకు మంత్రి మండిపల్లి పరామర్శ

- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలకు మంత్రి ఆదేశం



విశాఖపట్నం (చైతన్యరథం): గాజువాకలో చోటుచేసుకున్న ఆర్టీసీ బస్సు ప్రమాదంలో క్షతగాత్రులను రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం ఆసుపత్రిలో పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుని, వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు ప్రకటించారు. మంత్రివెంట ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ అభిషేక్ తదితర అధికారులు పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం, ఆర్టీసీ అండగా ఉంటాయని మంత్రి భరోసా ఇచ్చారు.

### కేజీహెచ్‌లో క్షతగాత్రులకు వైద్యం

గాజువాక ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడ్డ వారి తాజా ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్యంపై విశాఖ కేజీహెచ్, జిల్లా అధికారులతో వైద్యారోగ్య మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడారు. గాయపడిన 9మందిలో 8మందికి కేజీహెచ్‌లో వైద్యాన్ని అందిస్తున్నట్టు అధికారుల వెల్లడించారు. ఒకరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు.

క్షతగాత్రుల్లో ఒకరిద్దరికి శస్త్ర చికిత్సలు చేయాల్సిన అవసరం రావచ్చునని, ట్రీట్మెంట్ కొనసాగుతుందని, మిగిలినవారి ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని మంత్రికి అధికారులు వివరించారు. పోస్టుమార్టం అనంతరం ఘటనా స్థలంలో మరణించిన ముగ్గురి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యాన్ని కొనసాగించాలని, అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వ సిద్ధంగా ఉందని, క్షతగాత్రులకు అండగా ఉండాలని అధికారులకు మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం వైసీపీ కార్యకర్త అరెస్టు

నంద్యాల (చైతన్య రథం): నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం తల ధ్వంసం చేసిన ఘటనలో పోలీసులు కీలక పురోగతి సాధించారు. సీసీ కెమెరా ఫుటేజీని విశ్లేషించిన పోలీసులు, ఘటనకు పాల్పడింది వైసీపీ కార్యకర్త జమలయ్యగా గుర్తించారు. 2018 నుండి మాజీ ఎమ్మెల్యే శిల్పా రవికిషోర్ రెడ్డి, నంద్యాల వార్డు కౌన్సిలర్ వైసీపీ నేత పున్నా శేషయ్య అనుచరుడిగా ఉన్న జమలయ్య, వైసీపీ రాజకీయ కార్యకలాపాల్లో సుదీర్ఘకాలంగా చురుగ్గా పాల్గొంటున్నాడు. 2022లో అప్పటి పాలకుల సిఫార్సుతో జమలయ్య భార్యకు కమ్యూనిటీ రిసోర్సు పర్సన్ పదవి కల్పించబడింది. ఈ ఘటనలో ఇతర పార్టీల ప్రమేయం లేదని, నేరుగా జమలయ్య మాత్రమే పాల్గొన్నాడని పోలీసులు స్పష్టం చేశారు. ఇది ముందుగా పన్నిన కుట్రా



అన్న కోణంతోపాటు, ఇతరుల భాగస్వామ్యంపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే ప్రయత్నాలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించే వారిపై చట్టపరంగా వ్యవహరిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# గోదావరి డెల్టాకు సాగునీటి విడుదల

- రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందస్తు నీటి విడుదల
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో బ్యారేజీ మరమ్మతులకు రూ.148 కోట్లు
- మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి



రాజమహేంద్రవరం (చైతన్య రథం): స్థానిక సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద ఆదివారం ఖరీఫ్ సీజన్ సాగునీటి విడుదల కార్యక్రమం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొని గోదావరి జలాలను కాలువలకు విడుదల చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే గోదావరి డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. తూర్పు డెల్టా కాలువ ద్వారా సుమారు 85 వేల ఎకరాలకు, నిడదవోలు, కొవ్వూరు కాలువల ద్వారా మరో 41 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నదని చెప్పారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు నాట్లు ముందుగానే వేసుకొని పంటలను రక్షించుకోవాలని సూచించారు. ముందస్తు నీటి విడుదల వల్ల పంట త్వరగా చేతికొచ్చి రైతులు నష్టాల నుంచి బయటపడతారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం గోదావరి డెల్టాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్ల మరమ్మతులకు నిధులు కేటాయించలేదని మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బ్యారేజ్ గేట్ల మరమ్మతుల కోసం రూ.148 కోట్లు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. కాలువల మరమ్మతుల కోసం మరో రూ.13 కోట్లు విడుదల చేసి, సాగునీటి సంఘాల ద్వారా 80 శాతం పనులు చేపట్టినట్లు వెల్లడించారు.

రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి, 24 గంటల్లోనే వారి ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు నెలల తరబడి చెల్లింపుల కోసం ఎదురుచూడాల్సి వచ్చేదని, ప్రస్తుతం రైతు కేంద్రిత పాలన సాగుతోందన్నారు.

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ మాట్లాడుతూ రైతు బాగుంటే గ్రామం, రాష్ట్రం, దేశం బాగుంటుందనే సిద్ధాంతంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు ముందస్తుగా సాగునీరు అందించడం ప్రభుత్వం రైతుల పట్ల కలిగిన నిబద్ధతకు నిదర్శనమన్నారు.

కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యారేజ్ మరమ్మతులు, కాలువల పునరుద్ధరణ పనులు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ నీటి విడుదల ద్వారా కాకినాడ జిల్లా పరిధిలో 1,37,838 ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి రానుందని తెలిపారు.

అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌లో 117 గేట్లను కొత్తవిగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తగ్గించి రైతులకు మేలు చేకూర్చే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు.

ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి విడుదలకు వార్షిక ప్రణాళిక రూపొందించిన ముఖ్యమంత్రి నిర్ణయాల ఫలితంగానే నేడు ధవళేశ్వరం నుంచి నీటి విడుదల జరుగుతోందన్నారు. 1847లో గోదావరి ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టిన సర్ ఆర్థర్ కాటన్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాల పరిరక్షణ కోసం పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో రూ.100 కోట్ల నిధుల కేటాయింపుకు హామీ లభించిందన్నారు. గోదావరి కాలుష్య నివారణ, బ్యారేజ్ పరిరక్షణ, సాగునీటి సదుపాయాల మెరుగుదలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.

గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మూరలశెట్టి సునీల్ కుమార్ మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి ఈస్టర్న్ డెల్టాకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరిగిందని, రైతుల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సాగునీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంత పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు పాల్గొనడం పట్ల ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

వెస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మురళీకృష్ణరాజు మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే సాగునీటిని విడుదల చేయడం అభినందనీయమన్నారు. గోదావరి డెల్టా పరిధిలోని రైతులు నీటిని పొదుపుగా వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. సాగునీటి వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం చేపడుతున్న బ్యారేజ్, కాలువల మరమ్మతు పనులు రైతాంగానికి దీర్ఘకాలికంగా మేలు చేస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మూరలశెట్టి సునీల్ కుమార్, వెస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మురళీకృష్ణరాజు, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు చీఫ్ ఇంజనీర్ చినబాబు, ధవళేశ్వరం ఎస్ఈ జి. శ్రీనివాస్‌రావు, హెడ్ వర్క్స్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ రామకృష్ణ, విజ్జేశ్వరం ఈఈ రమేష్‌బాబు, రైతులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం విజ్జేశ్వరం గ్రామంలో నిర్వహించిన ఖరీఫ్ సాగునీటి విడుదల కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వ్యవసాయ పనుల్లో మంత్రి నిమ్మల



పాలకొల్లు (చైతన్య రథం): రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం సెలవు రోజున స్వగ్రామం అగర్తిపాలెంలో వ్యవసాయ పనుల్లో పాల్గొని కార్మికులతో కలిసి చెమటోడ్చారు. పాలకొల్లునుంచి సుమారు ఏడు కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ స్వగ్రామానికి చేరుకున్న మంత్రి నిమ్మల, దారిపొడవునా ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చేరుకున్న తర్వాత సొంత రొయ్యల చెరువులో మేత వేసి రొయ్యల ఎదుగుదలను స్వయంగా పరిశీలించారు. అనంతరం సొంత పొలంలో కూలీలతో కలిసి ట్రాక్టర్‌పై దుక్కు దున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం నేడు గోదావరి డెల్టాకు సాగునీరు విడుదల చేశామని తెలిపారు. రైతులందరూ ముందస్తుగా వరి నాటులు వేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎల్‌నినో నేపథ్యంలో సాగునీటిని సక్రమంగా వినియోగించుకుంటూ జల సంరక్షణ చేపట్టాలని రైతులకు సూచించారు. సొంత వ్యవసాయ పనుల్లో కార్మికులతో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగాను, సంతృప్తిగాను ఉంటుందని మంత్రి నిమ్మల హృదయపూర్వకంగా పేర్కొన్నారు.



## పేదల పాలిట కల్పతరువు సీఎంఆర్ఎఫ్

**మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ**



బనగానపల్లె (చైతన్య రథం): నేడు బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) కింద 28మంది లబ్ధిదారులకు దాదాపు రూ.14,20,195 విలువైన చెక్కులను స్వయంగా అందజేశారు. చెక్కుల పంపిణీ అనంతరం మంత్రి జనార్దన్‌రెడ్డి వైద్య సహాయం పొందిన రోగుల ప్రస్తుతఆరోగ్య పరిస్థితిని, వారి యోగక్షేమాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కూటమి పాలనలో క్షేత్ర స్థాయిలో అభివృద్ధి,సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేదల పాలిట నిజమైన కల్పతరువన్నారు. రాష్ట్రంలో ఆర్థిక కష్టాలున్నప్పటికీ సీఎంఆర్ఎఫ్ ద్వారా నిరుపేదలను ఆదుకుంటున్నామని తెలిపారు. ఇది సాధ్యమవడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుణ్యమేనని కొనియాడారు. కుల, మత, ప్రాంత, పార్టీలతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. నిరుపేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని, కనీవినీ ఎరుగని రీతిలో వైద్య సహాయం అందుతోందని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడు తున్న నిరుపేదల పాలిట సీఎంఆర్ఎఫ్ వరంగా మారిందని మంత్రి జనార్దన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# ఒత్తిడి లేని చదువులతోనే ఉన్నత ఫలితాలు సాధ్యం

- ప్రోత్సాహంతోనే విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు
- స్కిల్‌ను డెవలప్ చేసుకుంటే జాబులు వెతుక్కుంటూ వస్తాయి
- ఉన్నత చదువులతో బడుగుల జీవితాల్లో మార్పులు
- ఒంగోలులో మత్స్యకార విద్యార్థుల అభినందన సభలో మంత్రి కొల్లు



ఒంగోలు (చైతన్య రథం): బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు రావాలంటే కేవలం విద్యతో మాత్రమే సాధ్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదో తరగతిలో ఉన్నత ఫలితాలు సాధించిన మత్స్యకార విద్యార్థులకు అభినందన ప్రతిభా పురస్కారాల వేడుకలో పాల్గొన్నారు. ఉన్నత ఫలితాలు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులతో మాట్లాడి వారు పరీక్షలకు ఎలా సన్నద్ధమయ్యారో అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల వెనుకబాటుతనానికి చదువుకోకపోవడమే ప్రధాన కారణమన్నారు. దశాబ్దాలుగా ఏదోక పని చేసుకుందాం అనే మనస్తత్వంతో ఉండిపోతున్న కారణంగానే వెనుకబాటుతనంలో ఉండిపోతున్నాం. కానీ నేడు బడుగు బలహీన వర్గాల ప్రజలను అభ్యున్నతి మార్గంలో నడిపించే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిత్యం పని చేస్తున్నారు. గతంలో నడకుదిటి నరసింహారావు నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఒప్పించి మత్స్యకారుల కోసం తొలిసారిగా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేశారు.

మహాత్మా పూలేను ఇప్పటికీ మనం తలచుకోవడానికి కారణం నాడు బీసీల అభ్యున్నతికి చేసిన కృషి. సమాజ శ్రేయస్సు కోసం పిల్లల్ని కూడా వద్దు అనుకున్నారు. సావిత్రి బాయి పూలేను కూడా చదివించి వెనుకబాటుతనానికి గురవుతున్న మహిళలకు చదువు నేర్పించారు. నాడు పూలే పోరాటం కారణంగానే నేడు బీసీలకు విద్యాబుద్ధులు దక్కుతున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం నుండి అన్ని రకాల సహాయసహకారాలు అందుతున్నాయి. బీసీలు కూడా ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలి. పదితో చాలు, ఇంటర్‌తో చాలు అనే ఆలోచన వద్దు. ప్రతి బిడ్డ ఉన్నత స్థానానికి వెళ్లాలని ప్రతి తల్లిదండ్రులు కోరుకుంటారు. వారి ఆశయాలను అందుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపైనా ఉంది. మరీ ముఖ్యంగా మన బడుగు బలహీన వర్గాల వారు చదువుకోవడం ద్వారానే ఉన్నత జీవనం సాధ్యమవుతుంది.

ప్రభుత్వం కూడా విద్యా వ్యవస్థ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తోంది. 2024లో మన ప్రభుత్వం వచ్చే నాటికి 65 శాతం ఉత్తీర్ణత శాతం ఉంటే, ఈ సంవత్సరం ఏకంగా 85 శాతానికి చేరుకున్నాం. గతంలో ఉపాధ్యాయులకు సరైన శిక్షణ లేకపోవడం, పరిశీలన లేకపోవడంతో చదువులు అంతంత మాత్రంగా ఉండేవి. కానీ నేడు విద్యార్థుల అభిరుచులు, వారు ఎందులో వెనుకబడ్డారో తెలుసుకోవడం, అందుకు తగ్గట్లుగా శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా వన్ టీచర్ వన్ క్లాస్ విధానం తీసుకొచ్చాం. పేరెంట్-టీచర్ మీటింగ్స్ నిర్వహిస్తున్నాం.

విద్యార్థులకు ప్రోత్సాహం ద్వారామరింత మెరుగైన ఫలితాలు సాధించగలమని నిరూపించాం. గతంలో ఉపాధ్యాయుల్ని మద్యం షాపుల ముందు కాపలా పెడితే, నేడు ఉపాధ్యాయుల్ని సింగపూర్ పంపించి అక్కడి విద్యా వ్యవస్థను అధ్యయనం చేసే అవకాశం కల్పించాం. ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించడం ద్వారా విద్యా వ్యవస్థలో అద్భుతాలు సృష్టించగలుగుతున్నాం. రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తోంది. మన యువత తలచు కుంటే ఏదైనా సాధించగలమని ప్రభుత్వం నమ్ముతోంది. గతంలో ఐటీని తీసుకొచ్చినపుడు కంప్యూటర్లు కూడు పెడతాయా? అని ఎద్దేవా చేశారు. కానీ చంద్రబాబునాయుడు కృషి ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా మన తెలుగువారు ఐటీ రంగంలో కీలక స్థానాల్లో ఉన్నారు. చంద్రబాబు నాయుడిని అరెస్టు చేసినపుడు సుమారు 70దేశాల్లో ఐటీ ఉద్యోగులు సంతాపం తెలిపారంటే, ఆయన ఏస్థాయిలో ప్రభావితం చేశారో ఆలోచించాలి.

ప్రభుత్వంకల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోండి. కెరీర్ గైడెన్స్ తీసుకోండి. వెనుకబడిన వర్గాల నుండి ఉన్నత చదువులు చదువుకోవాలనే ఆలోచన చాలా తక్కువ. మనకేం తక్కువ? మనం ఎందుకు ఆ స్థాయికి చేరకూడదు. మనం ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్తే అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఉంది. అమెరికా తర్వాత ఏపీలోని విశాఖలో ప్రపంచంలోనే రెండో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేశాం. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటవుతోంది.రాష్ట్రంలో పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. మనం మన స్కిల్స్ డెవలప్ చేసుకుంటే అవకాశాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. ఏదో ఉద్యోగం చేయాలని చదవడం కాదు, ఉన్నతస్థానాల్లో నిలవాలి. మరింత మంది జీవితాల్లో వెలుగులు నింపే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో పని చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు.

కార్యక్రమంలో డా. వంశీ, డా. శాంతి, మాజీ ఎంపీ మోపిదేవి వెంకట రమణ, జిల్లా అధ్యక్షులు ఉక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పొడపాటి తేజస్వి, చిలకలపూడి పాపారావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెర్ప్‌తో మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

- అర్హులైన ప్రతి స్వయం సహాయక సంఘ మహిళకు జీవనోపాధి
- జూలై నెలాఖరుకు ప్రతి జిల్లాలో 200మంది మహిళా పారిశ్రామికవేత్తలుండాలి
- ఉత్తరాంధ్ర జిల్లాల జీవనోపాధి కార్యక్రమ సమీక్షలో మంత్రి కొండపల్లి



విశాఖపట్నం (చైతన్య రథం): ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త అన్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి విజన్‌కు అనుగుణంగా ప్రతి స్వయం సహాయక సంఘాన్ని ఒక పారిశ్రామికవేత్త కుటుంబంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మంత్రి పెందుర్తిలోని టిటిడిసి ప్రాంగణంలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, డీపీఎంలు, జిల్లా సమాఖ్య సభ్యులతో నిర్వహించిన జీవనోపాధి కార్యక్రమాల సమీక్షలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సెర్ప్‌తో స్వయం సహాయక సంఘాలలో ఉన్న మహిళల ఆర్థిక సాధికారతే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షలమంది సంఘం మహిళలు, 4584 మంది నిపుణులు, 27 వేలమంది వీఓఏలు, 1.5 లక్షలమంది ఈనారీలతో సెర్ప్ చాలా బలంగా ఉందని... దీని ద్వారా ఉపాధి కల్పన మరింత విస్తృతం చేస్తామని మంత్రి తెలిపారు. మోడ్రన్ లాండ్రీ యూనిట్లు, హెయిర్ సెలూన్లు, కార్పెంట్రీ, బొటిక్ మేనేజ్‌మెంట్ రంగాల్లో శిక్షణ కోసం పైలెట్ ప్రాజెక్టులు చేపడతామని వెల్లడించారు. సంఘం మహిళలకు సాంకేతిక సాయం, మార్కెట్ సౌకర్యాలు కల్పించడంతోపాటు పీఎం సూర్యఘర్ యోజన ద్వారా సోలార్ పవర్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి కల్పనలో బ్యాంకుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్న మంత్రి, అర్హులైన మహిళలకు రుణ సదుపాయాలు కల్పించి, 2026 జూన్ నెలాఖరు నాటికి ఒక్కొక్క జిల్లాలో కనీసం 200 మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు సమగ్ర బిజినెస్ ప్లాన్ రూపొందించుకోవాలని, కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా రైతులకు యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పాడి రైతుల కోసం నాణ్యమైన పశుగ్రాసం, సైలేజ్ మేకింగ్ యూనిట్లు మరియు పాలు, పాల ఉత్పత్తుల బ్రాండింగ్, మార్కెటింగ్‌పై శిక్షణ ఇస్తామన్నారు. అలాగే పీఎంజెజెబివై, పీఎంఎస్‌బివై పథకాల కింద అర్హులైన మహిళలందరికీ బీమా కల్పించాలని సూచించారు.

### 5లక్షల మంది మహిళా వ్యాపారవేత్తలే లక్ష్యం:

గతంలో డిజిటలైజేషన్ ఇబ్బందులు ఉండేవని...ఇప్పుడు డ్వాక్రా మహిళలకు అందుబాటులో ఉండేలా డిజిటలైజేషన్ తీసుకువచ్చామని.. గ్రామీణ మహిళల పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి ఎన్నోపథకాలు ప్రవేశ పెడుతున్నారని మంత్రి తెలిపారు.త్వరలోనే మనడబ్బులు... మన లెక్కలు అనే ఫోన్ యాప్ డ్వాక్రా మహిళల కోసం తీసుకువస్తున్నామని..దీనిద్వారా 85లక్షల మంది సభ్యులు డ్వాక్రాలో చేసుకున్న అప్పులు, పొదుపు గురించి తెలుసు కోవచ్చన్నారు. అలాగే 5లక్షలమంది మహిళలను వ్యాపారస్తులుగా చేయాలన్న సంకల్పంతో ముఖ్య మంత్రి ఉన్నారని.. అందుకు అనుగుణంగానే మన ప్రణాళికలు ఉండాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈసందర్భంగా మంత్రి ఆయా జిల్లాల జిల్లా సమాఖ్య పాలకవర్గ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమైవారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. అలాగే గాటోస్ కేఫే, నేటివ్ అరకు కేఫే తదితరజీవనోపాధి భాగస్వామ్యసంస్థల ప్రతినిధులతో కూడా ముఖా ముఖి సమావేశమై వారి అనుభవాలు,వ్యాపార విస్తరణ అవకాశాలపై చర్చించారు. అలాగే రాష్ట్రంలోని పీడీ, డీపీఎం, ఏపీఎంలకు 912 ల్యాప్‌ట్యాప్‌లు అందజేసే కార్యక్రమానికి మంత్రి శ్రీకారం చుట్టారు.

సెర్ప్ సీఈఓ కరుణ వాకాటి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో జీవనోపాధి అవకాశాలను స్థానిక వనరులకు అనుగుణంగా విస్తరించాలని, మహిళలకు రుణాలు, మార్కెటింగ్, నైపుణ్యాభివృద్ధి మరియు వ్యాపార నిర్వహణలో పూర్తిస్థాయి సహకారం అందించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో లైవ్లీహుడ్స్ డైరెక్టర్ శివశంకర్ ప్రసాద్, హెచ్‌ఆర్ డైరెక్టర్ కల్యాణ్ చక్రవర్తి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తరాల కల.. నెరవేరుతోంది!

**దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు నేటినుంచి అధికారికంగా ప్రారంభం**

**మంత్రి జనార్దన్ రెడ్డి హర్షం**

అమరావతి (చైతన్య రథం): విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు నేటినుంచి అధికారికంగా అమల్లోకి రావడంపై రోడ్లు, భవనాల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హర్షాతిరేకం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ -ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సానుకూల నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు కావడం ఏపీ ప్రజల చిరకాల స్వప్నమని, కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నిరంతర కృషితోనే ఆ కల సాకారమైందని మంత్రి స్పష్టం చేశారు. జూన్ 1నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభం కావడం రాష్ట్ర చరిత్రలో ఒక కీలక మైలురాయని, రాష్ట్ర రవాణా రంగంలో కొత్త జోన్ ఏర్పాటు నవశకానికి నాంది పలకనుందన్నారు. ఎన్నో ఏళ్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల కల నెరవేరుస్తూ విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు కావడం చారిత్రాత్మక నిర్ణయమని మంత్రి జనార్దన్ రెడ్డి అభివర్ణించారు.

కొత్త జోన్ ఏర్పాటుతో రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలు, కొత్త రైళ్ల రాక, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన జోన్ ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో రైల్వే ట్రాక్‌ల విస్తరణ, స్టేషన్ల ఆధునీకరణవంటి మౌలిక సదుపాయాలు వేగంగా పెరుగుతాయన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రానికి మరిన్ని కొత్త రైళ్లు, మెరుగైన కనెక్టివిటీ అందుబాటులోకి వస్తాయన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు ఒకే జోన్ కిందకు రావడంతో ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల రైల్వే లైన్లు సమాంతరంగా అభివృద్ధి చెందుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల రైల్వే ప్రాజెక్టులకు బడ్జెట్ నిధుల కేటాయింపులో సమ ప్రాధాన్యత దక్కనుందని, అన్ని ప్రాంతాలకు రైళ్లు, కనెక్టివిటీ పెంచడం మరింత సులభతరం అవుతుందని వెల్లడించారు. అంతేకాక, ఈ కొత్త జోన్ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడటంతోపాటు, ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దడానికి కూడా ఉపయోగపడనుందని మంత్రి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

చైతన్యరథం

### గుంటూరు ఛానల్ భూ సేకరణ రైతులకు

## రెండో విడత పరిహారంగా రూ.17.58 కోట్లు

గుంటూరు (చైతన్య రథం): గుంటూరు ఛానల్ ఎక్స్‌టెన్షన్ పనుల కోసం భూ సేకరణకు సహకరించిన ఏడు గ్రామాల రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రెండోదఫా పరిహారపు నిధులు విడుదల చేసింది. ఎనమదల, ప్రత్తిపాడు, గారపాడు, కొండేపాడు, మల్లాయపాలెం, జీజీ పాలెం, రావిపాడు గ్రామాల రైతుల బ్యాంకు ఖాతాలకు మరో రూ.17.58 కోట్ల పరిహారం జమ అయిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రకటించారు. గతంలో విడుదల చేసిన రూ.10.54 కోట్లతో కలిపి ఆ రైతులకు ఇప్పటివరకు మొత్తం రూ.28.12 కోట్ల పరిహారం అందించడంపై హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు ఛానల్ అభివృద్ధి పనులోని వివిధ దశలను, సమస్యలను పెమ్మసాని ఒక్కోటిగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఛానల్ ఆధునికీకరణ, విస్తరణ పనులకు రాష్ట్ర నిధుల కేటాయింపు, రైతులను సమన్వయపరచడం, భూముల సేకరణ, పరిహారం చెల్లింపులను వేగవంతం చేయడంలో ఆయన ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. రైతుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పెమ్మసాని హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రైతు సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యత ఇస్తూ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు.



# ఈ-డిపోగా గాజువాక!

### 100 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయింపు - ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు వెల్లడి

గాజువాక (చైతన్య రథం): పర్యావరణ హితమైన రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలకమైన అడుగు పడింది. గాజువాక ఆర్టీసీ డిపోను అత్యాధునిక విద్యుత్ బస్సు డిపో (ఈ-డిపో)గా అభివృద్ధి చేయనున్న నేపథ్యంలో ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. రవాణా మంత్రి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో గాజువాక శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు రాష్ట్రం హరిత గమనంవైపు సాగుతున్న ప్రయాణంలో ఒక మైలురాయిగా అభివర్ణించారు. కాలుష్యరహిత, సురక్షితమైన, సమర్థవంతమైన రవాణా సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం రాష్ట్ర విధానంలో భాగమేనని



పేర్కొన్నారు. రాష్ట్రానికి మంజూరైన 750 ఎలక్ట్రిక్ బస్సుల్లో 100 బస్సులు గాజువాక డిపోకు కేటాయించినట్టు శ్రీనివాస రావు వెల్లడించారు. ఈ కేటాయింపు ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన, కాలుష్య రహిత సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డిపో సిబ్బంది నిబద్ధతను కొనియాడిన పల్లా, అధికారులు, ఉద్యోగులు మరియు సాంకేతిక నిపుణుల అంకితభావం గాజువాక డిపోకు విశిష్ట గుర్తింపు తెచ్చిందన్నారు. ఈ డిపోనుంచి రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న మెకానిక్ వెలుపలికి రావడం సిబ్బంది నైపుణ్యానికి నిదర్శనమని ప్రశంసించారు. ఈ-డిపో అభివృద్ధి గాజువాక పట్టణ వృద్ధిలో మహత్తరమైన మైలురాయిగా నిలుస్తుందని, ప్రజా రవాణా నెట్‌వర్క్‌ను గణనీయంగా మెరుగుపరచడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పల్లా విశ్వాసం వ్యక్తం చేశారు. పరిశుభ్రమైన, హరిత భవిష్యత్తువైపు రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న సమున్నత అడుగులకు ఈ ప్రాజెక్టు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# విశాఖ జోన్ వెలిగింది ఉత్తరాంధ్రకు వెలుగునిస్తోంది!

దశాబ్దాల నాటి ఆంధ్రుల ఆకాంక్షకు అడుగులు పడ్డాయి. ఉత్తరాంధ్ర సిగలో మరో మణిహారం నేటి నుంచి మెరవబోతోంది. ఇప్పటికే విశాఖ స్టీల్ ప్లాంట్, భోగాపురం ఎయిర్‌పోర్ట్, గూగుల్ వంటివి ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎంతో కీలకం. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ, ఆంధ్రుల ఆకాంక్షల ప్రతీక అయిన "విశాఖ దక్షిణ తీర రైల్వే జోన్" ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారిక గెజిట్ విడుదల చేయడంతో దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. 2026 మే 4న కేంద్రం జారీ చేసిన ఈ చారిత్రాత్మక గెజిట్ నోటిఫికేషన్‌తో ఆంధ్రప్రదేశ్ సొంత రైల్వే జోన్ కల సాకారమైంది. 2026 జూన్ 1 నుండి విశాఖపట్నం కేంద్రంగా నూతన రైల్వే జోన్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించబోతోంది. ఇది కేవలం ఒక కార్యాలయం ఏర్పాటు మాత్రమే కాదు... దశాబ్దాలుగా వెనుకబాటుతనంతో, వలసలతో అల్లాడిన ఉత్తరాంధ్ర ప్రాంతానికి లభించిన ఒక 'మరో కలికితురాయి'.

### ఉత్తరాంధ్రుల దశాబ్దాల నిరీక్షణ

భౌగోళికంగా, సహజ వనరులపరంగా ఎంతో ప్రాధాన్యం ఉన్నప్పటికీ, రైల్వే పరిపాలనపరంగా ఉత్తరాంధ్ర దశాబ్దాలుగా తీవ్ర వివక్షకు గురైంది. విశాఖపట్నం ప్రాంతం ఒడిశాలోని భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో ఉండటం వల్ల, ఇక్కడి నుండి వచ్చే వేల కోట్ల ఆదాయం పొరుగు రాష్ట్రానికి తరలిపోయేదే తప్ప, స్థానిక ప్రాజెక్టులకు పైసా మేలు జరిగేది కాదు. కొత్త రైళ్లు కావాలన్నా, స్టేషన్ల ఆధునీకరణ జరగాలన్నా భువనేశ్వర్ వైపు దీనంగా చూడాల్సిన పరిస్థితి ఉండేది. స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల్లోనూ తీవ్ర అన్యాయం జరిగేది. ఈ నేపథ్యంలోనే "విశాఖ రైల్వే జోన్ ఆంధ్రుల హక్కు" అనే నినాదం ఉత్తరాంధ్ర ప్రజల గుండెల్లోంచి పుట్టుకొచ్చింది. ఎందరో విద్యార్థులు, ప్రజాసంఘాలు, కార్మికులు జోన్ కోసం దశాబ్దాలుగా శాంతియుత పోరాటాలు చేశారు.

### 2014 విభజన చట్టం... కేంద్రంపై ఒత్తిడి

2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో విశాఖ రైల్వే జోన్ కీలకమైన హామీగా చేర్చడం వెనుక తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడి ముందస్తు వ్యూహం, చొరవ ఉన్నాయి. విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ ప్రకారం రైల్వే జోన్ సాధ్యాసాధ్యాలను పరిశీలించేలా నాడే పట్టుబట్టి నిబంధనలు పెట్టించారు. 2014-2019 మధ్య కాలంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం కేంద్రంపై నిరంతరం ఒత్తిడి తెచ్చింది. టీడీపీ పార్లమెంటరీ పార్టీ సభ్యులు పార్లమెంటు లోపల, బయట విశాఖ జోన్ కోసం గళమెత్తారు. చంద్రబాబు రాజకీయ చతురత, టీడీపీ ఎంపీల అలుపెరగని పోరాటం ఫలితంగానే 2019 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం కేంద్రంగా "దక్షిణ తీర రైల్వే జోన్" ఏర్పాటును అధికారికంగా ప్రకటించింది.

### గొడ్డలి పార్టీ నిర్లక్ష్యం... ఉత్తరాంధ్రకు శాపం

2019లో జోన్ ప్రకటన వచ్చినప్పటికీ, ఆ తర్వాత రాష్ట్రంలో గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు మూలనపడింది. 2019లో అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ ప్రభుత్వం రైల్వే జోన్ సాధనను, ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలను పూర్తిగా పక్కన పెట్టింది. పార్లమెంటులో 22మంది ఎంపీల బలం ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి గెజిట్ సాధించడంలో జగన్‌రెడ్డి విఫలమయ్యాడు. రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి అవసరమైన భూమిని రైల్వే శాఖకు అప్పగించడం కూడా చేతకాని ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగించింది. ఉత్తరాంధ్రను అన్ని రంగాల్లో నిర్వీర్యం చేసిన జగన్‌రెడ్డి... రైల్వే జోన్ సాధనలోనూ ఉత్తరాంధ్రకు ద్రోహం చేశాడు. కేంద్రం కేటాయించిన నామమాత్రపు నిధులను కూడా సద్వినియోగం చేసుకోలేని దుస్థితి నాడు నెలకొంది. స్వార్థ రాజకీయాల కోసం ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను ఐదేళ్లపాటు కాలరాశారు. ఉత్తరాంధ్ర పర్యాటక రంగంలో కీలకమైన రుషికొండను బోడి గుండు చేశాడు. రూ.500 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేసి రాజభవనాలను నిర్మించుకున్నారు. పోలవరాన్ని నిర్లక్ష్యం చేసి... ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పట్టించుకోలేదు. 2021నాటికి పోలవరం పూర్తి చేసి ఉంటే ఉత్తరాంధ్రకు 40 టీఎంసీ గోదావరి జలాల తరలింపుతో అటు రైతులకు, ఇటు పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌పై తప్పుడు కేసులు వేసి పనులను నిర్లక్ష్యం చేశాడు. ఉత్తరాంధ్రలో ఎన్నడూ చూడని విధంగా గొడ్డలి పార్టీ నాయకులతో భూ దోపిడీలకు తెర తీశారు. విశాఖ రైల్వే జోన్‌కు భూమి కేటాయించలేదు. విశాఖ స్టీల్ ప్లాంట్ సాధనకు 22మంది ఎంపీలతో ఎటువంటి పోరాటం చేయలేదు. కానీ కేంద్రం తెచ్చిన ప్రతి బిల్లుకు ఎలాంటి బేషజాలు లేకుండా మద్దతిచ్చి స్వార్థ ప్రయోజనాల కోసం ఉత్తరాంధ్ర ప్రయోజనాలను జగన్‌రెడ్డి నిర్లక్ష్యం చేసి ఉత్తరాంధ్ర ప్రజల ముందు ద్రోహిగా మిగిలాడు.

### కూటమి రాకతో కదలిక

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైల్వే జోన్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌తో ప్రత్యేకంగా సమావేశమై జోన్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన భూసేకరణ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, రైల్వేశాఖకు మార్గం సుగమం చేశారు. చంద్రబాబు విజ్ఞప్తి, రాజకీయ పరపతి కారణంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో భారీగా నిధులు కేటాయించడమే కాకుండా, పరిపాలనాపరమైన అనుమతులను వేగవంతం చేసింది. కేవలం 23 నెలల కాలంలోనే దాదాపు రూ.19,500 కోట్లను రాష్ట్ర రైల్వే ప్రాజెక్టుల కోసం కేంద్రం నుండి సాధించడం చంద్రబాబు దౌత్యనీతికి నిదర్శనం. ఫలితంగానే 2026 మే 4న అధికారిక గెజిట్ విడుదలై... దేశంలో 18వ రైల్వే జోన్‌గా నేటినుంచి కార్యకలాపాలు కొనసాగనున్నాయి.

### సొంత జోన్‌తో భారీ ఆదాయం

దక్షిణ కోస్తా రైల్వే జోన్ విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, కొత్తగా ఏర్పాటైన విశాఖపట్నంతో కలిపి 4 డివిజన్లు, అలాగే 385 స్టేషన్లతో, 3,532 రూట్ కిలోమీటర్ల మేర (డబుల్, ట్రిపుల్ లైన్లు కలిపి 6,454 కి.మీ. ట్రాక్) విస్తరించి ఉండనుంది. ఈ జోన్ పరిధిలో నాలుగు డివిజన్లు కలిపి మొత్తం 62 వేలమంది ఉద్యోగులు పనిచేస్తుండగా, విశాఖలోని ప్రధాన కార్యాలయంలో 128మంది గెజిటెడ్, 1,100 మంది నాన్-గెజిటెడ్ అధికారులు ఉంటారు. సరుకు రవాణా అలాగే ప్రయాణికుల ద్వారా ఏటా దాదాపు రూ.15,500 కోట్ల ఆదాయం, అలాగే ఏటా 100 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరుగుతుందని అంచనా. జూన్ ఒకటి నుండి ఈ నాలుగు డివిజన్ల రైల్వే మేనేజర్లు (డీఆర్ఎంలు) సికింద్రాబాద్, భువనేశ్వర్ జీఎంలకు కాకుండా నేరుగా విశాఖలోని దక్షిణ కోస్తా జీఎంకు నిత్యం రిపోర్ట్ చేయనున్నారు, అలాగే భద్రతాపరమైన పనులు, రైళ్ల రాకపోకల నిర్ణయాలన్నీ కొత్త జీఎం ఆదేశానుసారమే అమలు కానున్నాయి.

### ఉత్తరాంధ్ర సమగ్ర ప్రగతికి రాజమార్గం

విశాఖ రైల్వే జోన్ కేవలం రైళ్లను నడపడానికే పరిమితం కాదు, ఇది ఉత్తరాంధ్రతోపాటు యావత్ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రూపురేఖలను మార్చబోతోంది. రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం విశాఖలో ఏర్పాటు కావడం వల్ల వేలాది మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా స్థానిక నిరుద్యోగులకు ప్రాధాన్యత దక్కుతుంది. గూగుల్, కాగ్నిజెంట్, టీసీఎస్‌వంటి ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలను ఇప్పటికే ఉత్తరాంధ్రకు తీసుకొచ్చి విశాఖకు ప్రపంచపటంలో చంద్రబాబు ప్రముఖ స్థానం కల్పించారు. ఇప్పుడు రైల్వే హబ్ కూడా తోడవడంతో పారిశ్రామిక రవాణా సులువై, మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు మార్గం సుగమమైంది. ఉత్తరాంధ్రకు మరో కీలకమైన విశాఖ స్టీల్ ప్లాంట్ సంక్షోభంలో ఉన్న తరుణంలో, చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రూ.22 వేల కోట్ల నిధులను సాధించి స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాట పట్టించారు. ఇప్పుడు రైల్వే జోన్ ఏర్పాటుతో స్టీల్ ప్లాంట్ ఉత్పత్తుల రవాణా వ్యయం తగ్గి, మరింత లాభాల్లోకి దూసుకువెళ్లే అవకాశం ఉంది. రైల్వే తయారీ యూనిట్లు, కోచ్ రిపేర్ వర్క్‌షాపులు, వ్యాగన్ కాంపోనెంట్ పరిశ్రమలు విశాఖ పరిసర ప్రాంతాల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఇది స్థానిక చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పెద్ద ఊతాన్నిస్తుంది. కూటమి ప్రభుత్వ సంకల్పంతో ఉత్తరాంధ్ర ఇక వెనుకబడిన ప్రాంతం కాదు... దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సరికొత్త పారిశ్రామిక, రవాణా, ఐటీ హబ్‌గా మారబోతోంది.

**- ప్రవీణ్ బోయ,**
**అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్**

# విశాఖ రైల్వే జోన్ ప్రారంభం..

# చారిత్రాత్మక ఘట్టం

## జూన్ 1నుంచి విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ప్రారంభం సందర్భంగా..

ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల నిరీక్షణకు, సుదీర్ఘ పోరాటానికి ఎట్టకేలకు ఒక సార్థకత చేకూరింది. జూన్ ఒకటవ తేదీ నుంచి విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానుండడం రాష్ట్ర ప్రగతి ప్రయాణంలో ఒక మైలురాయి. విభజన చట్టం హామీల్లో అత్యంత కీలకమైన ఈ ప్రాజెక్టు పట్టాలెక్కడం కేవలం ఒక కార్యాలయం ఏర్పాటు మాత్రమే కాదు కోట్లాది మంది ఆంధ్రుల ఆత్మగౌరవానికి, హక్కుకు దక్కిన విజయం అని చెప్పాలి. విశాఖకు రైల్వే జోన్ రావడం వల్ల కేవలం రైళ్ల సంఖ్య పెరగడమే కాకుండా, ఈ ప్రాంత ఆర్థిక ముఖచిత్రమే మారిపోనున్నది. కొత్త లైన్ల నిర్మాణం, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ వేగవంతం అవుతాయి. జోనల్ హెడ్‌క్వార్టర్స్ రాకతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. విశాఖ పోర్టు, గంగవరం పోర్టులతో పాటు స్థానిక పరిశ్రమల నుంచి సరకు రవాణా మరింత సులువుగా మారి, వాణిజ్యం అభివృద్ధి చెందుతుంది. విశాఖ రైల్వే జోన్ కేవలం రైళ్ల రాకపోకలను శాసించే కేంద్రం కాదు, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును సరికొత్త పట్టాలపై నడిపించే ప్రగతి రథం కూడా. జూన్ 1 నుంచి ప్రారంభం కాబోతున్న రైల్వే జోన్ రాష్ట్రానికి సరికొత్త వెలుగులు తీసుకురానున్నది.

రైల్వే జోన్ సాధన అనేది ఒక్కరోజులో జరిగిన విజయం కాదు. విశాఖలో రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి పోరాడుతున్న ఏపీ ప్రజలకు చిరకాల స్వప్నం. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటుతో రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రావడమే కాకుండా, పారిశ్రామికంగా రాష్ట్రం కొత్త పుంతలు తొక్కుతుంది. మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల పెంపుతో రాష్ట్ర భవిష్యత్తు సరికొత్త దిశగా పయనిస్తుంది. రైల్వే జోన్ రాక రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చబోతోంది. కొత్త రైళ్లు, మెరుగైన కనెక్టివిటీ మరియు వేగవంతమైన వస్తు రవాణా ద్వారా వ్యాపార వాణిజ్యాలు విస్తరిస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రాజెక్టులు సకాలంలో పూర్తయితే, రాష్ట్రం దేశంలోనే కీలకమైన రవాణా కేంద్రంగా అవతరిస్తుంది. ఈ జోన్‌లో విజయవాడ, గుంటూరు, మరియు గుంతకల్ డివిజన్లు ఉంటాయి. అలాగే వాల్తేరు డివిజన్‌లోని కొంత భాగాన్ని ఇందులో విలీనం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధితో పాటు పొరుగు రాష్ట్రాలలోని కొన్ని కీలక ప్రాంతాలు కూడా ఈ జోన్ కిందికి రానున్నాయి. ఈ జోన్ కేంద్రంగా ఉన్న నగరాల్లో రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, కొత్త ప్లాట్‌ఫారమ్‌లు, మరియు కోచింగ్ టెర్మినల్స్ వేగంగా అభివృద్ధి చెందుతాయి. అంతేకాదు కొత్త రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఏర్పాటయ్యే అవకాశం ఉంటుంది. దీనివల్ల స్థానిక యువతకు రైల్వే ఉద్యోగాల్లో మెరుగైన అవకాశాలు లభించనున్నాయి. స్థానిక ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా కొత్త రైళ్లు ప్రారంభించడం, రైళ్ల వేగం పెంచడం మరియు స్టాపేజీల కేటాయింపులో స్వయం ప్రతిపత్తి లభిస్తుంది. ఈ



జోన్ కేవలం రైళ్లు తిరిగే విభాగం మాత్రమే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టిస్తుంది.

### రైల్వే జోన్‌ను పట్టించుకోని జగన్‌రెడ్డి ప్రభుత్వం

రాష్ట్ర విభజన చట్టంలోని హామీ రాష్ట్రానికి రైల్వే జోన్ సాధించడంపై గత జగన్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వే జోన్ ఏర్పాటు వేగవంతం అయింది. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అత్యంత కీలకమని కేంద్రాన్ని ఒప్పించి ఏపీకి తీసుకువచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదే. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు ఒక్క ఎకరా భూమి కూడా జగన్‌రెడ్డి కేటాయించలేదు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన 3 నెలల్లోనే విశాఖకు రైల్వే జోన్ ఏర్పాటు కోసం మడసర్లోవలో 52 ఎకరాలు పూర్తి హక్కులతో కేటాయించింది. అందుకు అనుగుణంగా 2025 జనవరి 8వ తేదీన విశాఖకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. విశాఖలో దక్షిణకోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయాల నిర్మాణ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి రూ.8,762 కోట్ల విలువైన ప్రాజెక్టులను తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. విశాఖ ఎక్కువ ఆదాయం తెచ్చే డివిజన్ ఏడాదికి రూ.4,500 కోట్ల ఆదాయం వస్తోంది. భారతీయ రైల్వేలో అత్యధిక ఆదాయం తెచ్చే డివిజన్లలో విశాఖ రెండు లేదా మూడో స్థానంలో ఉంది. విశాఖలోని ముడసర్లోవలో 106.89 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో జోనల్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రైల్వే జోన్ అనేది భారతీయ రైల్వే వ్యవస్థలో ఒక పెద్ద పరిపాలనా యూనిట్. ప్రతి జోన్‌కు స్వంత జనరల్ మేనేజర్, ఆపరేషనల్ నియంత్రణ, బడ్జెట్ కేటాయింపులు ఉంటాయి. స్థానిక అవసరాలకు తగ్గట్టు రైల్వే అభివృద్ధి వేగవంతం అవుతుంది. రైల్వే జోన్ ఏర్పాటుతో కొత్త రైళ్లు, స్టేషన్లు, గూడ్స్ షెడ్లు, మెయింటెనెన్స్ యూనిట్లు ఏర్పడే అవకాశాలు పెరుగుతాయి. పరిశ్రమలు, వ్యాపారం వేగంగా అభివృద్ధి చెందుతాయి. జోన్ హెడ్‌క్వార్టర్స్‌తో పాటు అనుబంధ కార్యాలయాలు, వర్క్‌షాపులు ఏర్పడి వేలాది ఉద్యోగాలు సృష్టించబడతాయి. పోర్టులు, ఇండస్ట్రియల్ కారిడార్లు, వ్యవసాయ ఉత్పత్తులకు రైల్వే సౌకర్యాలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు తగ్గి, పోటీ సామర్థ్యం పెరుగుతుంది. కొత్త ట్రైన్లు, మెరుగైన టైమ్‌టేబుల్స్, స్టేషన్ అభివృద్ధి ప్రజల ప్రయాణ అనుభవం మెరుగవుతుంది. జోన్ ద్వారా రైల్వే ప్రాజెక్టులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, కొత్త లైన్లు మరియు డబ్లింగ్ ప్రాజెక్టులు వేగవంతం, గూడ్స్ ట్రాఫిక్ పెరుగుదల, రాష్ట్ర ఆదాయం పెరుగుదల, టూరిజం అభివృద్ధి (పుణ్యక్షేత్రాలు, తీర ప్రాంతాలు అభివృద్ధి చెందగలవు.

### అమరావతిని కలుపుతూ హై-స్పీడ్ రైలు

దేశంలో మొత్తం రైల్వే జోన్లు 18. ప్రతి జోన్ పరిధి సగటున 3,000 నుంచి 10,000 కి.మీ. ట్రాక్. వార్షిక టర్నోవర్ ఒక పెద్ద జోన్ రూ.10,000 కోట్లకు పైగా. ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే సామర్థ్యం, మొత్తం రైల్వే లైన్ పొడవు సుమారు 5,000 కి.మీ. ముఖ్య కారిడార్లు.. విశాఖపట్నం-విజయవాడ-గుంటూరు, కాకినాడ పోర్ట్ కనెక్టివిటీ, వాల్తేర్ డివిజన్-గోల్డెన్ గూస్, భారతదేశంలో టాప్ రెవెన్యూ డివిజన్లలో ఒకటి, వార్షిక ఆదాయం రూ.8,000-రూ.10,000 కోట్లు అంచనా. ఉద్యోగాలు ప్రత్యక్ష పరోక్షంగా: జోన్ హెడ్‌క్వార్టర్స్ 3,000-5,000 ఉద్యోగాలు, అనుబంధ యూనిట్లు, కాంట్రాక్టులు 10,000 వరకు అవకాశాలున్నాయి. గత రెండేళ్లలో రైల్వేల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం భారీగా నిధులు కేటాయించింది. 2026-27 బడ్జెట్‌లో రాష్ట్రానికి రికార్డు స్థాయిలో 10,134 కోట్ల రూపాయలు కేటాయించారు. నిడదవోలు - రాజమండ్రి - దువ్వాడ (విశాఖపట్నం) మధ్య 3వ మరియు 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు 9,889 కోట్ల రూపాయల వ్యయంతో 198 కి.మీ. మేర ఈ పనులు జరగనున్నాయి. దక్షిణ భారతదేశంలో హై-స్పీడ్ డైమండ్ నెట్‌వర్క్‌లో భాగంగా అమరావతిని కలుపుతూ హై-స్పీడ్ రైలు మార్గాలను ప్రతిపాదించారు. ఆంధ్రప్రదేశ్‌లో 100శాతం రైల్వే లైన్ల విద్యుదీకరణ పూర్తయింది. రాష్ట్ర రాజధాని అమరావతిని రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించడానికి కీలక ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. ఎర్రుపాలెం-నంబూరు లైన్ అమరావతి మీదుగా వెళ్లే ఈ 57 కి.మీ. కొత్త రైల్వే లైన్ కోసం 2,047 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. ఇది రాజధాని ప్రాంతాన్ని నేరుగా ప్రధాన రైల్వే లైన్లతో కలుపుతుంది. ఇందులో భాగంగా కృష్ణా నదిపై సుమారు 3 కి.మీ. పొడవైన రైల్వే బ్రిడ్జిని నిర్మించనున్నారు. 60 ఏళ్లుగా పేపర్‌కే పరిమితం అయిన కొవ్వూరు-భద్రాచలం రోడ్డు రైల్వే లైన్ పనులు పట్టాలెక్కబోతున్నది.

### గంటలోనే అమరావతి నుంచి హైదరాబాద్‌కు

ఈ రైల్వే లైన్ నిర్మాణంతో హైదరాబాద్-విశాఖ మధ్య 90 కి.మీ. దూరం తగ్గుతుంది. కొత్తగా చేపట్టనున్న బుల్లెట్ రైళ్ల ప్రాజెక్టులు ఏపీకి గేమ్ ఛేంజర్ కానున్నాయి. బుల్లెట్ రైళ్లతో హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా చెన్నైకి 2.55 గంటల్లో, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో, బెంగళూరు నుంచి చెన్నైకి 1.13 గంటల్లో చేరుకోవచ్చు. కోల్‌కత్తా నుంచి చెన్నై వరకు ఉన్న మార్గమంతా నాలుగు లైన్ల కారిడార్‌గా మారనుంది. ప్రస్తుతం ఏపీలో రూ.92,649 కోట్ల ప్రాజెక్టులకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. అమృత్ స్టేషన్ పథకం కింద ఏపీలో 73 స్టేషన్లలో పునర్నిర్మాణ పనులు జరుగుతుండగా వీటిలో సూళ్లూరుపేట, రాయనపాడు, కాకినాడ టౌన్, మంగళగిరి, తుని స్టేషన్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రస్తుతం ఏపీ మీదుగా 8 జతల వందే భారత్ రైళ్లు, మరో 8 జతల అమృత్ భారత్ రైళ్లు నడుస్తున్నాయి. హై-స్పీడ్ రైల్ కారిడార్లు సిద్ధమైతే కేవలం గంటలోనే అమరావతి నుంచి హైదరాబాద్ చేరుకోవచ్చు. కర్నూలు నుంచి హైదరాబాదు 45 నిమిషాల్లో చేరుకోవచ్చు. కర్నూలు నుంచి బెంగళూరుకు 80 నిమిషాల ప్రయాణమే. అనంతపురం నుంచి హైదరాబాద్‌కు 90 నిమిషాలు, అనంతపురం నుంచి బెంగళూరుకు కేవలం 45 నిమిషాల్లో చేరుకోవచ్చు. చెన్నై-బెంగళూరు కారిడార్‌లో చిత్తూరు నుంచి చెన్నైకు 30 నిమిషాలు, చిత్తూరు నుంచి బెంగళూరుకు 45 నిమిషాలు ప్రయాణిస్తే చేరుకోవచ్చు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్ర రైల్వే బడ్జెట్‌లో అత్యధికంగా వచ్చిన నిధులే నిదర్శనం. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే అమరావతి దక్షిణ భారతదేశంలోనే ఒక ప్రధాన రైల్వే హబ్‌గా మారనున్నది. రైల్వే జోన్ సాధన ఒక ఎత్తైతే, దాని ద్వారా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవడం మరొక ఎత్తు. మెరుగైన మౌలిక సదుపాయాలు, పెరగనున్న ఆదాయం, విస్తరించనున్న రైల్వే నెట్‌వర్క్ రాష్ట్రానికి సరికొత్త ఊపిరి పోయనున్నాయి. ఈ కొత్త దిశ రాష్ట్ర ప్రగతి ప్రయాణాన్ని మరింత వేగవంతం చేస్తుందని ఆశిద్దాం.

**- నీరుకొండ ప్రసాద్**

## వర్షాలతో పాటు..

## కొనసాగుతున్న ఎండ తీవ్రత

అమరావతి (చైతన్య రథం): ఏపీలో నేడు కూడా విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొననున్నాయి. ఒకవైపు పిడుగులతో కూడిన వర్షాలు, మరోవైపు మండుటెండల వాతావరణం ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.

విదర్భ మీదుగా ఉత్తరాంధ్ర వరకు, పశ్చిమ మధ్య బంగాళాఖాతం మరియు వాయువ్య బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం ద్రోణి విస్తరించి ఉంది. దీని ప్రభావంతో అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లోనూ చెదురుమదురుగా వర్షాలు పడే వీలుందని వెల్లడించారు.

### ఎండ ప్రభావం తీవ్రం

అదే సమయంలో పోలవరం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 42-44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, నంద్యాల, వైఎస్సార్ కడప, తిరుపతి జిల్లాల్లో 40-42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా వేశారు.

ఆదివారం పల్నాడు జిల్లా అచ్చంపేటలో అత్యధికంగా 44.3 డిగ్రీలు నమోదైంది. నెల్లూరు జిల్లా కావలి (43.9), ఉయ్యూరు-నందిగామ 43.7, ప్రకాశం జిల్లా కొప్పెరపాడు 43.6 డిగ్రీలు, అనేక ప్రాంతాల్లో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉరుములు వినిపించినప్పుడు చెట్లకింద, విద్యుత్ స్తంభాల వద్ద, హోర్డింగ్స్ కింద నిలబడవద్దు.

పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు అప్రమత్తంగా ఉండాలి. ఆకాశం మేఘావృతమైన వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. ఎండ తీవ్రత నేపథ్యంలో అవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచిస్తోంది.

చైతన్యరథం

# నిరుద్యోగ యువతపై గొడ్డలి పార్టీ పోటు

- నాడు తూతూ మంత్రంగా డీఎస్సీ నోటిఫికేషన్
- జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా మోసగించారు
- ఐదేళ్ల పాటు ఒక్క టీచర్ పోస్టు అయినా భర్తీ చేశారా?
- ఎన్నికల్లో ఓడించారన్న అక్కసుతోనే కక్షగడుతున్నారు
- నేడు మెగా డీఎస్సీపై సైకో బ్యాచ్ దగా కోరు ఆరోపణలు
- ఉద్యోగాలు సాధించిన వారిని అవమానిస్తున్నారు
- ఎంపికైన యువ టీచర్లు ఆవేదనకు గురవుతున్నారు
- విష ప్రచారంపై యువత తిరుగుబాటు చేయాలి
- స్పోర్ట్స్ కోటా అభ్యర్థులపైనా తప్పుడు ప్రచారమా?
- రాష్ట్ర చరిత్రలో తొలిసారి 3 శాతం రిజర్వేషన్ కల్పించాం
- సచివాలయాల్లో నాడు 2 వేల పోస్టులెలా ఇచ్చారు?
- అధ్యాపక పోస్టుల భర్తీని అడ్డుకునేందుకు కుట్రలు
- రౌండ్ టేబుల్ సమావేశంలో శాప్‌చైర్మన్ రవినాయుడు
- స్పోర్ట్స్ కోటాపై విచారణకు సిద్ధమని సవాల్
- జగన్‌రెడ్డిని తరిమికొట్టడం ఖాయం: ఎమ్మెల్సీ శ్రీకాంత్
- డ్రైవర్లతో గ్రూప్ 1 పేపర్లు దిద్దించిన అవినీతి చరిత్ర
- వైసీపీది: ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి
- పాల్గొన్న వెయ్యి మందికి పైగా ఎంపికైన యువ టీచర్లు





తిరుపతి(చైతన్యరథం): నాడు ఎన్నికలకు ముందు తూతూ మంత్రంగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు..కేసులు వేసి ఆపాలని చూశారు.. జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదు.. 20 లక్షల మంది నిరు ద్యోగ యువతను మోసగించిన దగా చరిత్ర జగన్‌రెడ్డిదని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలకు నిరసనగా తిరుపతి లక్ష్మీనారాయణ కళ్యాణ మండపంలో “నిరుద్యోగ యువతపై గొడ్డలివేటు” పేరిట నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి దాదాపు వెయ్యిమందికి పైగా కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన టీచర్లు హాజరయ్యారు. గత ఎన్నికల్లో గొడ్డలి పార్టీని నిరుద్యోగ యువత తమను ఓడించారన్న అక్కసుతో వారిపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గొడ్డలి పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారంపై డీఎస్సీలో ఎంపికైన టీచర్లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు బాధ కలిగిస్తున్నాయి. పేద కుటుంబాల నుంచి కష్టప డి చదివి టీచర్ పోస్టులు సాధించిన యువత వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారంపై కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. రాజకీయంగా కక్ష తీర్పు కోవాలంటే ప్రత్యర్థి పార్టీగా తమతో తలపడాలి.. యువత జీవితాలతో ఆడుకోవడం తగునా? అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే డీఎస్సీ ద్వారా నిరుద్యోగ టీచర్లకు ఉద్యోగాలిస్తానని చెప్పిన జగన్ ఐదేళ్ల పాటు ఒక్క టీచర్ పోస్టు అయినా భర్తీ చేశారా? 2024లో మరో రెండు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందనగా అసమగ్రంగా డీఎస్సీ ప్రకటించారు. దానివల్ల ఎటువంటి ఉపయోగం లేకుండా పోయిందని ధ్వజమెత్తారు.

## డీఎస్సీపై కోర్టుల్లోనూ కేసులు.. యువత జీవితాలతో చెలగాటం

యువగళం పాదయాత్రలో భాగంగా తిరుపతిలో హలో లోకేష్ కార్యక్ర మంలో యువత కోరిక మేరకు డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ ఇస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక అత్యంత పారదర్శకంగా 150 రోజుల్లో ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసి 15,941 మందికి ఉద్యోగాలిచ్చారు. డీఎస్సీని అడ్డుకునేందుకు వైసీపీ నేతలు సుప్రీంకోర్టు దాకా వెళ్లి 150 కేసులు వేయించారు. అటువంటి వైసీపీ నేతలు డీఎస్సీపై అబాండాలు వేయడం సిగ్గుచేటు. ఒక వ్యక్తి చేసిన నిరాధార ఆరోపణలు పట్టుకుని రాద్ధాంతం చేస్తున్నారు. అతనిపై ఆ రోజే కేసు నమోదు చేయడం జరిగింది. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు అమ్ముకున్నామని నిరాధారమైన ఆరోపణలు చేస్తూ క్రీడాకారుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు.

## స్పోర్ట్స్ కోటా అభ్యర్థులపై తప్పుడు ప్రచారమా?

క్రీడాకారులకు సర్టిఫికెట్లు ఇచ్చేది శాప్ చైర్మన్, మంత్రి లోకేష్, ప్రజా ప్రతినిధులు కాదు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు స్పోర్ట్స్ అసోసియేషన్లు, ఫెడరేషన్లు ఇస్తాయి. సంబంధిత సర్టిఫికెట్లు సరైనవా, కాదా అని అసోసియే షన్ల ద్వారా ధృవీకరించుకున్నాక స్పోర్ట్స్ కోటాలో 427 పోస్టులు భర్తీ చేయడం చేయడం జరిగింది. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర చరిత్రలో తొలి సారిగా 3 శాతం స్పోర్ట్స్ కోటాను అమలు చేస్తే దానిపై నిందలు వేయడం దారుణం. గ్రామ సచివాలయ రిక్రూట్‌మెంట్ సమయంలో స్పోర్ట్స్ కోటాలో ఇచ్చిన 2 వేల పోస్టులు ఎలా ఇచ్చారు? స్పోర్ట్స్ కోటా లిస్టు పబ్లిక్ డొమైన్‌లో ఉంది. వైసీపీ, కూటమి ప్రభుత్వంలో ఎలా ఇచ్చామనే అంశాలపై ఎటువంటి విచారణకైనా మేం సిద్ధమని సవాల్ విసిరారు.

## యువత ఆకాంక్షలపై గొడ్డలిపోటే..

ప్రతిభావంతులైన యువతపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారానికి గుండె మండుతోంది. ఇది కచ్చితంగా యువత ఆశలు, ఆకాంక్షలపై గొడ్డలిపోటే. బాబాయిని గొడ్డలితో వేసేసి చంద్రబాబు చేతిలో కత్తిపెట్టిన చందంగానే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. పింక్ డైమండ్ చంద్రబాబు ఇంట్లో ఉందని గోబెల్స్ ప్రచారం చేశారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో అది ఎక్కడ ఉందో తేల్చక పోగా అసలు పింక్ డైమండే లేదని చేతులెత్తులేశారు.

వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారం 16 వేల మంది డీఎస్సీ ప్రతిభావంతులు, లక్షలాది నిరుద్యోగ యువత కుటుంబాలపై దాడిగానే భావించాలి. తాజాగా యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల భర్తీ కోసం వెలువడిన నోటిఫికేషన్‌ను అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారు.

కోర్టులో కేసులు వేసి అడ్డుకోవాలనే ఉద్దేశంతో కొందరిని రెచ్చగొట్టి యూనివర్సిటీల్లో డబ్బు వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రకటించబోయే డీఎస్సీని అడ్డుకోవాలన్న కుట్రతో.. గత డీఎస్సీపై విషప్రచారం చేస్తున్నారు. వైసీపీ నేతల తప్పుడు ప్రచారం, కుట్రలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరు ద్యోగ యువత చైతన్యవంతం కావాలి. యువత జీవితాలపై వైసీపీ చేస్తున్న దాడిపై రాష్ట్రవ్యాప్తంగా యువత తిరగుబాటు చేయాలని పిలుపునిచ్చారు.

## జగన్‌ను యువత తరిమికొట్టడం ఖాయం: ఎమ్మెల్సీ శ్రీకాంత్

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ శాసన మండలి ఎన్నికల సమయంలో ఎంతోమంది నిరుద్యోగులను కలిసి వారి బాధలను ప్రత్యక్షంగా తెలుసుకున్నాం. ఒక్కపూట తిని కోచింగ్‌కు ప్రిపేరైన పిల్లలను చూశాం. అటువంటి బిడ్డలపై తప్పుడు ఆరోపణలు చేయడానికి జగన్‌కు ఎలా మనసు వస్తుందో అర్థంకావడం లేదు. లక్షలాది యువత ఆశలపై విషం చిమ్ముతున్న జగన్ నరరూప రాక్షసుడు అనేపదానికి ప్రత్యక్ష నిదర్శనం. వారు ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ఉద్యోగాలకు ఎటువంటి డోకా ఉండదు. కూటమి ప్రభుత్వం అండగా అంటుంది. యువత భవిష్యత్తును కాపాడ టానికి ఏస్థాయికి వెళ్లడానికైనా మేం సిద్ధమని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు జగన్ నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీలు ఇచ్చారు. యువత రక్తాన్ని చెమటగా మార్చి ఉద్యోగాలు పొందిన నిరుద్యోగ యువతపై అనవసరమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జగన్‌రెడ్డి అవినీతి చరిత్ర, ఆయన గత జీవితమేంటో రాయలసీమలో ఎవరిని అడి గినా చెబుతారు. అటువంటి వ్యక్తి పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదం. రాష్ట్రంలోని నిరు ద్యోగ యువత ఏకమై జగన్‌ను తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. ఎన్నికల సమయంలో యువతకు 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని చంద్రబాబు, యువనేత లోకేష్ ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని స్పష్టం చేశారు.

## యువత ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారు: భూమిరెడ్డి

ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నోటిఫికేషన్ నుంచి సెలక్షన్ వరకు విద్యాశాఖ అత్యంత పారదర్శకంగా విజయవంతంగా డీఎస్సీ ఎంపిక ప్రక్రియ పూర్తిచేసింది. అభ్యంతరాలకు అవకాశం ఇచ్చిన తర్వాతే ఫైనల్ సెలక్షన్ లిస్టు విడుదలచేశారు. సర్టిఫికేషన్ వెరిఫికేషన్ సమయంలో వివిధ కారణాలతో ఉద్యోగాలు రాని పలువురు అభ్యర్థులను నేను స్వయంగా విద్యాశాఖ అధికారుల వద్దకు తీసుకెళ్లి వారి అనుమానాలను నివృత్తి చేశాం. యువత ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా కొందరు మాట్లాడుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. వారం రోజులుగా వైసీపీ నేతలు యువ టీచర్లపై తప్పుడు ఆరోపణలతో దండయాత్ర చేస్తున్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన అభ్యర్థుల లిస్టును పబ్లిక్ డొమైన్‌లో పెడుతున్నాం. ప్రతిఒక్కరి సర్టిఫికెట్, అడ్రస్‌లు అందులో ఉన్నాయి. వారు ఎలా ఉద్యోగం పొందారో పూర్తి వివరా లు ఉన్నాయి.. వెరిఫై చేసుకోవచ్చు. రోశయ్య అనే ఒక మోసగాడు ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి బేరసారాలకు దిగడమే ఈ అపోహలకు ప్రధాన కారణం. గత ప్రభుత్వ హయాంలోనే అతడిపై శ్రీకాకుళం జిల్లాలో కేసు కూడా నమోదైంది. బురదజల్లడమే వైసీపీ పనిగా పెట్టుకుంది. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ఎంత అడ్డగోలుగా జరిగిందో రాష్ట్రంలో ఉన్న యువ తకు తెలుసు. మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్ అనే అమ్యూజ్‌మెంట్ పార్కులో డ్రైవర్లు, పనివాళ్లతో పేపర్లు దిద్దించారు. అటువంటి వైసీపీ నేతలకు పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించిన కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేసే అర్హత ఉందా అని ప్రశ్నించారు.





# మీ చొరవతోనే మహానాడు సక్సెస్

## కేడర్‌కు ఎంపీ కలిశెట్టి కృతజ్ఞతలు

విజయనగరం (చైతన్యరథం): పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు ఆదివారం ఎచ్చెర్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఎచ్చెర్ల నియోజకవర్గం లో ఎంపీ ఆధ్వర్యంలో జరిగిన డిజిటల్ మహానాడు 2026 కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలందరూ దిగ్విజయంగా విజయవంతం చేసినందుకు అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ముఖ్యంగా క్లస్టర్ పరిధిలో పార్టీ క్లస్టర్ ఇంచార్జ్‌లు లీడ్ తీసుకుని మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకుగాను ఎంపీ వారి క్యాంపు కార్యాలయంలో మహానాడు విజయవంతం అవ్వటానికి ప్రధాన పాత్ర పోషించిన అందరికీఎంపీ సన్మానించి వారికి అభినందనలు తెలియజేశారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఓటర్ సర్వే, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై రివ్యూ మీటింగ్ కండక్ట్ చేసి వారి నుంచి అభ్యంతరాలను స్వీకరించి సలహా సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా పూర్వపు అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు చౌదరి బాబ్జి గారు, ఎచ్చెర్ల నియోజకవర్గం నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్చార్జులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





గోవా అసెంబ్లీ భవనాన్ని విజయనగరం ఎమ్మెల్యే అదితీ విజయలక్ష్మీ గజపతిరాజు సందర్శించారు.

# "థాంక్యూ లోకేష్"సార్

## కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



గాజువాక (చైతన్యరథం): మహిళలకు చట్ట సభలలో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న చారిత్రాత్మక నిర్ణయానికి కృతజ్ఞతగా గాజువాక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గాజువాక నియోజకవర్గ తెలుగు మహిళ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన థాంక్యూ లోకేష్ అన్న కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ మాట్లాడుతూ మహిళల గౌరవం భద్రత ఆర్థిక స్వలంబన రాజకీయ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయటంలో తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు.

అన్న ఎన్టీఆర్ ప్రారంభించిన మహిళా అభ్యుదయ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు మరింత విస్తృతంగా ముందుకు తీసుకు వెళుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ మహిళల పండి రంగాల్లో మరింత ప్రాధాన్యం కల్పించాలని జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మహానాడు వేదికగా కోరుకోవటం అదేవిధంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించటం చాలా ఆనందదాయకమని మహిళలకు ఎల్లప్పుడూ అండగా ఉండే పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలియజేశారు తర్వాత కేక్ కట్ చేసి ప్లకార్ట్స్ ప్రదర్శిస్తూ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐటి విద్య శాఖ మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభ వాని స్టేట్ సెక్రటరీ అనంతలక్ష్మి, జిల్లా సెక్రెటరీ సన్యాసమ్మ, 78వ ఇంచార్జ్ దీప్తి, నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ కోరుకొండ పద్మ, నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ భార్గవి, సెక్రెటరీ కుమారి, నియోజకవర్గాధికార ప్రతినిధి పుష్ప, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవ్య, నియోజకవర్గ ఐటీడీపీ సెక్రటరీ స్వాతి, మధులత,వివిధ వార్డుల ప్రెసిడెంట్లు సెక్రటరీలు బుజ్జమ్మ, సరోజినీ గీతా అన్నపూర్ణ, చందు, యజ్ఞప్రియ, లోకేశ్వరి, సత్యవతి, సాయిలక్ష్మి, అమ్మాజీ మహిళా నాయకులు పాల్గొన్నారు.




# ఎట్టకేలకు పుంజుకున్న విశాఖ రైల్వేస్టేషన్ పునర్నిర్మాణ పనులు

విశాఖపట్నం (చైతన్యరథం): రైల్వేస్టేషన్ పునర్నిర్మాణ పనులు ఎట్టకేలకు పుంజుకున్నాయి. ఆరంభ దశలో కాంట్రాక్టర్ల వివాదంతో ఏడాదిన్నర ఆగిపోయిన పనులు ఇటీవల ఊపందుకున్నాయి. సుమారు రూ.500 కోట్ల అంచనాతో ప్రారంభమైన పనులకు దశల వారీగా వేయి కోట్ల వరకు వెచ్చిస్తామని రైల్వే ఉన్నతాధికారులు చెబుతున్నారు. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటవుతున్న నేపథ్యంలో అదేస్థాయిలో స్టేషన్ కూడా ఉండాలని అధికారులు ముందుగానే ప్రణాళిక రూపొందించారు. స్టేషన్‌కు కొత్త రూపు తీసుకురావడంతో పాటు అదనపు ప్లాట్‌ఫారాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని డీపీఆర్ తయారు చేసి ఆమోదం పొందారు. దాని ప్రకారం ప్రస్తుతం రైల్వే స్టేషన్‌ను జ్ఞానాపురం వైపు విస్తరిస్తున్నారు. ఇప్పుడు ఎనిమిది ప్లాట్‌ఫారాలు ఉండగా అదనంగా మరో ఆరు నిర్మించనున్నారు. అప్పుడు మొత్తం ప్లాట్‌ఫారాల సంఖ్య 14కు చేరుతుంది. దీంతో మరిన్ని కొత్త రైళ్లు రావడానికి అవకాశం ఉంటుంది. స్టేషన్‌ను 'యు' ఆకారంలో అభివృద్ధి చేస్తున్నారు. దీనివల్ల ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు ప్రయాణికులు వెళ్లడానికి సౌలభ్యంగా ఉంటుంది. కోల్‌కత్తాలో మాదిరిగా షాపింగ్ కోసం ప్రత్యేక నిర్మాణం (కాంకోర్) కూడా ప్లాన్ చేశారు. ప్రస్తుత ప్రవేశ ద్వారం ఉన్న వైపు టెర్మినల్ భవనాన్ని గ్రౌండ్౦2 మోడల్‌లో నిర్మిస్తారు. ఆ తరువాత జి౦5కు విస్తరిస్తారు. అటు జ్ఞానాపురం వైపు రైల్వే రిజర్వేషన్ కాంప్లెక్స్, పార్కింగ్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. మొదట మల్టీలెవెల్ కారు పార్కింగ్ భవనం నిర్మించాలని అనుకున్నారు. కానీ అందుబాటులో భూమి ఉండడంతో ఓపెన్ పార్కింగ్‌కే ప్రాధాన్యం ఇచ్చారు. సుమారుగా 1.5 లక్షల చ.అ. విస్తీర్ణంలో రెండు వేల వాహనాలు (కార్లుంద్విచక్ర వాహనాలు) పట్టేలా కవర్డ్ పార్కింగ్ నిర్మాణం పూర్తిచేశారు. దీనికి ఏఐ టెక్నాలజీ ఆధారిత ప్రవేశం ఏర్పాటుచేసే ఆలోచన ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ పనుల్లో భాగంగా ఆ ప్రాంతంలో ఎర్రిగెడ్డ మళ్లింపు పనులు కూడా చేపట్టారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి అన్ని పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.





# మహిళా సాధికారతకు మరో ముందడుగు

## మహిళలకు 33 శాతం రాజకీయ ప్రాతినిధ్య నిర్ణయంపై టీడీపీ మహిళా నేతల హర్షం

కాకినాడ (చైతన్యరథం): మహానాడు వేదికగా మహిళలకు 33 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటించడంపై మహిళా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో ఆదివారం "థ్యాంక్యూ సీఎం థ్యాంక్యూ లోకేష్" కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర పావని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాడి సుష్మిత, సీనియర్ టీడీపీ నాయకురాలు ఏటుకూరి నాగమణి, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ నాయకురాలు రాజేశ్వరి తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ, మహిళలకు సమాన ఆస్తి హక్కులు కల్పించి మహిళా సాధికారతకు పునాది వేసిన మహానేత స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయాలను కొనసాగిస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నారా లోకేష్ మహిళలకు 33 శాతం రాజకీయ ప్రాతినిధ్యం ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమని అభినందించారు. మహిళలను కేవలం ఓటర్లుగానే కాకుండా ప్రజాప్రతినిధులు, విధాన నిర్ణేతలు, రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దే దిశగా ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రత్యేకత ఏమిటంటే, ఈ కార్యక్రమంలో మహిళలే పూర్తిగా నిర్వహణ బాధ్యతలను చేపట్టారు. మహిళా నాయకులే సమావేశాన్ని నడిపించగా, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు తాను ప్రేక్షకుల్లో ఒకడిగా ఉంటూ మహిళలకే సభా ప్రాతినిధ్యం కల్పించారు. మహిళలే కార్యక్రమాన్ని నడిపించేలా అవకాశం ఇవ్వడం ద్వారా మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ, మహిళల పట్ల తెలుగుదేశం పార్టీకి ఉన్న చిత్తశుద్ధిని ఆచరణలో చాటిచెప్పారు. అనంతరం సానా సతీష్ బాబు ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొని పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చిన్నరాజప్ప, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, టీడీపీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ తదితరులు హాజరై మహిళా నాయకులను అభినందించారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి

## ఇన్‌ఛార్జ్ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి నివాసంలో ముఖ్య నేతల ఆత్మీయ విందు

కాకినాడ (చైతన్యరథం): కాకినాడ జిల్లాలో తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగూరు నారాయణ కీలక దిశానిర్దేశం చేశారు.?కాకినాడ సిటీ నియోజకవర్గ శాసనసభ్యులు వనమాడి కొండబాబు గారి నివాసంలో జిల్లా స్థాయి టీడీపీ నాయకులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆత్మీయ విందు కార్యక్రమానికి మంత్రి పొంగూరు నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ, ప్రతి లబ్ధిదారుడికి చేర్చాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. త్వరలో వేయనున్న పార్టీ కమిటీలు, గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడంపై ఆయన జిల్లా నాయకులతో సమీక్ష నిర్వహించారు. నాయకులందరూ ఐకమత్యంతో పనిచేసి జిల్లాలో పార్టీ ని, కూటమి ప్రభుత్వాన్ని తిరుగులేని శక్తిగా నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం జిల్లాలోని తునిలో జరగనున్న ముఖ్యమంత్రి అధికారిక కార్యక్రమం, పర్యటన ఏర్పాట్లపై జిల్లా నాయకులతో ప్రత్యేకంగా చర్చించారు. సీఎం పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, విజయవంతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు, కేడర్ మధ్య నిరంతరం అనుబంధం కొనసాగేలా, అలాగే క్షేత్రస్థాయి సమస్యలు, పార్టీ వ్యూహాలపై ఎప్పటికప్పుడు చర్చించుకోవడానికి వీలుగా.. ఇలాంటి ఆత్మీయ విందు కార్యక్రమాలనుఇకపై ప్రతీ నెల నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు. ఈ ఆత్మీయ సమావేశంలో పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. జ్యోతుల నవీన్ కుమార్ జ్యోతుల నెహ్రూ నిమ్మకాయల చినరాజప్ప పేరాబత్తుల రాజశేఖర్ఎమ్మెల్సీ కర్రి పద్మ శ్రీ వర్మ, పిల్లి అనంతలక్ష్మి పిల్లి సత్యనారాయణ మూర్తి కటకంశెట్టి ప్రభాకర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస్ బాబా ఉన్నారు.





# ఏజెన్సీలో పెద్దపులి సంచారం

## తీవ్ర భయాందోళనల్లో పలు గ్రామాల ప్రజలు

రంపచోడవరం (చైతన్యరథం): ఏజెన్సీలో పెద్దపులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ నెల 27న రాజవొమ్మంగి మండలంలో తొమ్మిది పశువులపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. ఈ ఘటన చుట్టుపక్కల గ్రామాల ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురి చేసింది. ప్రస్తుతం గంగవరం మండలం వేములోవ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. పశువులపై పులి దాడి గురించి తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను అప్రమత్తం చేశారు. దానిని బంధించాలని ఆదేశించారు. ఈ మేరకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ట్రాకర్లను ఏర్పాటు చేసి వేములోవ పరిసర ప్రాంతాల్లో పెద్దపులిని గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ డాక్టర్ జ్యోతి నేతృత్వంలో పులిని బంధించేందుకు అటవీశాఖ అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఫిబ్రవరి 14న పాపికొండల అభయారణ్యంలో విడిచిపెట్టిన పెద్దపులి వెనక్కి వచ్చి పోలవరం జిల్లాలో సంచరిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## జిందాల్ భూముల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్కులు

జిందాల్ భూముల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్కుల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. జూన్ మూడోవారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ చేసేందుకు రానున్నారు. జూన్ 15, 16, లేదంటే జూన్ 21న ముహూర్తం నిర్ణయించే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాల నుంచి వినిపిస్తోంది. జూన్ 21న ఈ భూమి పూజ ఉంటుందని పరిశ్రమల భూసేకరణలో ముఖ్యభూమిక వహించిన యాజమాన్య ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. జిందాల్ భూముల్లో ఇండస్టియల్ పార్కుల నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు వస్తుండడంతో అధికారులు ఇందుకు సంబంధించిన ప్రకియను పూర్తిచేసే పనిలో నిమగ్నమయ్యారు. జిందాల్ యాజమాన్యానికి, భూ నిర్వాసితులకు మధ్య నడుస్తున్న వివాదాన్ని పరిష్కరించేందుకు వారితో ఈ నెల 20న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత విశాఖలో చర్చలు జరిపారు. భూనిర్వాసితులతో పాటు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జెఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రీయల్ పార్కు వైస్ ప్రెసిడెంట్ రాచూరి కనకారావులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఇలా జిందాల్ భూసేకరణలో జరిగిన లోపాలను సరిదిద్దే పనిలో ప్రభుత్వం నిమగ్నమవడంతో ఈ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణానికి మార్గం సుగమం అవుతోంది. శృంగవరపుకోట మండలం ముషిడిపల్లి, చీడిపాలెం, చినఖండేపల్లి, మూలబొడ్డవర, కిల్తం పాలెం గ్రామాల పరిధిలో 2007-2008లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వం జిందాల్ యాజమాన్యం కోసం భూసేకరణ చేసింది. 919.22 ఎకరాల అసైన్డ్, డి.పట్టా భూములు, 208.54 ఎకరాల ప్రభుత్వ భూమి కలిపి 1127.76 ఎకరాలను ఆ సంస్థకు రిజిస్ట్రేషన్ చేసింది. అల్యూమినియం శుద్ధి కర్మాగారం నిర్మిస్తామని ఈ భూములు తీసుకొంది. ఈ పరిశ్రమకు ముడిసరుకుగా బాక్సైట్ అవసరం. అయితే వివిధ కారణాలతో విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలను ప్రభుత్వం నిషేధించింది. ముడిసరుకు వచ్చే అవకాశం లేక పరిశ్రమ నిర్మాణం చేపట్టలేకపోయింది. భూములు తీసుకొని పరిశ్రమను నిర్మించకపోవడంతో భూనిర్వాసితులు భూములను వెనక్కి ఇచ్చేయాలని అడుగుతూ వస్తున్నారు. అయితే ప్రతిపాదిత పరిశ్రమ స్థాపనకు బదులు మెగా ఇండస్ట్రీయల్ పార్కులను ఈ భూముల్లో నిర్మించేందుకు జిందాల్ యాజమాన్యం ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుంది. ప్రస్తుతం అధికారంలో వున్న తెలుగు దేశం , జనసేన, బిజేపీ కూటమి ప్రభుత్వం పెద్ద సంఖ్యలో యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని చూస్తోంది. ప్రతి నియోజకవర్గంలోను ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ పరంగా భూములను కేటాయిస్తోంది. ఒకే చోట ఎక్కువ మొత్తంలో భూముల లభ్యత లేకపోవడంతో 50 ఎకరాలు, 100 ఎకరాలు, 200 ఎకరాలను గ్రామాల్లో గుర్తించాల్సి వస్తోంది. దీనికి కూడా స్థానికుల నుంచి అడ్డంకులు వస్తున్నాయి. వీటిని అధిగమించేందుకు అధికారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో జిందాల్ యాజమాన్యం వద్ద సిద్ధంగా వున్న వందలాది ఎకరాల భూముల్లో ఇండస్ట్రీయల్ పార్కుల నిర్మాణం వైపు ఆలోచించింది. భూనిర్వాసితుల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గింది. క్షేత్ర స్థాయిలో సమస్యలను తెలుసుకుంది. వాటికి పరిష్కార మార్గం చూపేందుకు ఆలోచన చేసింది. హోం మంత్రి జరిపిన చర్చల్లో పురోగతి కనిపించడంతో నిరుద్యోగ యువతకు తొందరగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందకు ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణం చేపట్టేందుకు తొందరపడుతోంది. జిందాల్ యాజమాన్యం కూడా ప్రభుత్వం నుంచి ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ వస్తుందానని ఎదురు చూస్తోంది. భూమి పూజకు వచ్చే ముఖ్యులకు రోడ్డు మార్గం నుంచి కాకుండ నేరుగా ఇండస్ట్రీయల్ స్థలంలో దిగేలా హెలీప్యాడ్‌లను నిర్మించేశారు.

# పలు జిల్లాల్లో పిడుగులతో మోస్తరు వర్షాలు



విజయవాడ (చైతన్యరథం): రాగల మూడు గంటల్లో పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

అంతేకాకుండా.. 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్స్ కింద నిలబడవద్దని ప్రజలకు సూచించారు.మరోవైపు కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 42 నుంచి 44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోని 17 మండలాల్లో వడగాలులు వీస్తాయని వాతావరణ సంస్థ హెచ్చరించింది. ఎండల తీవ్రత అధికంగా ఉందని.. ఉదయం 11:00 నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలకు అధికారులు సూచించారు. డీహైడ్రేషన్ బారిన పడకుండా మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తీసుకోవాలన్నారు. వాతావరణంలో తేమ వల్ల ఉక్కపోత అధికంగా ఉంటుందని, రాబోయే రెండు రోజులు ఇదే పరిస్థితి ఉండవచ్చని అధికారులు తెలిపారు.

# దొంగ డాక్యుమెంట్లతో దోపిడీకి దిగిన నీచుడు

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై తెలుగుదేశం పార్టీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తీవ్ర ఆగ్రహం



గుంటూరు (చైతన్యరథం): వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై తెలుగుదేశం పార్టీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగ డాక్యుమెంట్లతో దోచుకునేందుకు బ్రహ్మనాయుడు ప్రయత్నించారని ఫైర్ అయ్యారు. దొంగ జీవోలు తయారు చేసి హైడ్రా కు కూడా పంపారని ప్రస్తావించారు. ఆదివారం గుంటూరు జిల్లాలో శ్రీకృష్ణదేవరాయలు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చేసిన దొంగ పనిని కూడా బొల్లా బ్రహ్మనాయుడు ఒరిజినల్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేశారని ఆగ్రహించారు. ఆ డాక్యుమెంట్లు తయారు చేసేందుకు డబ్బు సమకూర్చింది బ్రహ్మనాయుడేనని చెప్పుకొచ్చారు. జలాలపురం, వినుకొండ టౌన్, బ్రాహ్మణపల్లిలో కూడా బొల్లా బ్రహ్మనాయుడు.. అమాయకులను బెదిరించి భూములు లాక్కున్నారని దుయ్యబట్టారు. తిరుమల డెయిరీ అమ్మి వారికి ఇచ్చిన ఎగ్రిమెంట్‌ను తప్పి మరలా డెయిరీ పెట్టి వారిని మోసం చేశారని మండిపడ్డారు. బ్రహ్మనాయుడు సంస్కారం లేకుండా మాట్లాడే వ్యక్తి అని ఫైర్ అయ్యారు. అమాయక రైతుపై 307 కేసు పెట్టి జైలుకు పంపించాడని చెప్పారు. చట్టప్రకారం బ్రహ్మనాయుడుపై చర్యలు తీసుకుంటారని శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు.

# ప్రజలు ఛీకొట్టినా సిగ్గురాని వైసీపీ నేతలు

తిరుపతి (చైతన్యరథ): గత ఎన్నికల్లో వైసీపీని నిరుద్యోగ యువత 11 సీట్లకే పరిమితం చేసిందన్న అక్కసుతోనే వారిపట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని, దీనిపై రాష్ట్రవ్యాప్తంగా యువత తిరుగుబాటు చేయాలని శాప్ ఛైర్మన్ రవి నాయుడు పిలుపునిచ్చారు. మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను నిరసిస్తూ తిరుపతిలో 'నిరుద్యోగ యువతపై గొడ్డలివేటు' పేరిట మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బాలాజీ కాలనీలోని లక్ష్మీనారాయణ కల్యాణమండపంలో జరిగిన ఈ సమావేశంలో రవి నాయుడు మాట్లాడుతూ 'సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేశ్ నేతృత్వంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై వైసీపీ తప్పుడు ఆరోపణలు బాధ కల్గిస్తున్నాయి. పేద కుటుంబాలనుంచి కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. రాజకీయంగా కక్ష తీర్చుకోవాలంటే మాపై తలపడండి. యువత జీవితాలతో ఆడుకోవద్దు. యువగళం పాదయాత్రలో భాగంగా తిరుపతిలో నిర్వహించిన 'హలో లోకేశ్' కార్యక్రమంలో యువత కోరిక మేరకు డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ ఇస్తామని యువనేత లోకేశ్ ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ ద్వారా దాదాపు 16వేల టీచర్ ఉద్యోగాలను భర్తీ చేశారు. దీనిని అడ్డుకునేందుకు వైసీపీ నేతలు సుప్రీం కోర్టు వరకు వెళ్లి 150కి పైగా కేసులు వేయించారు. ఒక వ్యక్తి చేసిన నిరాధార ఆరోపణలు పట్టుకుని రాద్ధాంతం చేస్తున్నారు. అతనిపై ఆ రోజే కేసు నమోదు చేయడం జరిగింది. స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలు అమ్ముకున్నామని నిరాధారమైన ఆరోపణలు చేస్తూ క్రీడాకారుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్లు ఇచ్చేది క్రీడా సంఘాలు, సమాఖ్యలు అన్న కనీస పరిజ్ఞానం కూడా లేకుండా వైసీపీ మాట్లాడటం సిగ్గుచేటు. ఎవరెవరికి ఉద్యోగాలు ఇచ్చామో వారి జాబితా బహిరంగపరిచాం. ఆధారాలుంటే నిరూపించండి. నిరుద్యోగుల రక్తం కూడు తినే ఖర్మ కూటమి నేతలకు లేదు. దీనిపై బహిరంగ చర్చకు రావాలని' ఆయన సవాల్ విసిరారు.ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ఉద్యోగం సంపాదించుకునేందుకు యువత రాత్రింబవళ్లు కష్టపడ్డారని, అలాంటి వారిపై వైసీపీ నిందలు వేయడం సరికాదని, రాష్ట్రం నుంచి జగన్‌ను యువత తరిమికొట్టడం ఖాయమని హెచ్చరించారు. జగన్ రెడ్డి అవినీతి చరిత్ర ఏమిటో, గత జీవితమేంటో ఎవరిని అడిగినా చెబుతారన్నారు. ఎన్నికల సమయంలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో వివిధ కారణాలతో ఉద్యోగాలు రాని పలువురు అభ్యర్థులను తానే స్వయంగా విద్యాశాఖ అధికారుల వద్దకు తీసుకెళ్లి వారి అనుమానాలను నివృత్తి చేశానన్నారు. యువత ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా వైసీపీ నాయకులు మాట్లాడటం సరైందికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ఎంత అడ్డగోలుగా జరిగిందో అందరికీ తెలుసన్నారు. పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించిన కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేసే అర్హత వైసీపీకి ఉందా అని ప్రశ్నించారు. అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి చదువుకుని, ఉద్యోగాలు సాధించిన తమను అవహేళన చేయడం దారుణమని పలువురు ఉపాధ్యాయులు కన్నీటి పర్యంతమయ్యారు.

# రహదారుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వెల్లడి



పెనమలూరు (చైతన్యరథం): నియోజకవర్గ అభివృద్ధికి రహదారులే కీలకమని గుర్తించి కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ పేర్కొన్నారు. కానూరు, సనాతననగర్, ఆటోనగర్ ప్రాంతాలను అనుసంధానం చేసే పంటకాలవ రహదారి సీఆర్డీఏ నిధులు 3 కోట్ల 20 లక్షలతో నిర్మించే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ శంకుస్థాపన చేశారు.పంటకాలువ రహదారి అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ,ఈ రహదారి నిర్మాణానికి పునాది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే పడిందని గుర్తు చేశారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాల కాలంలో నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయినప్పటికీ, తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమయ్యాయని తెలిపారు. కానూరు నుంచి చైతన్య రోడ్డు,వంద అడుగుల రోడ్డు వరకు రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామని, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఎదురైన సాంకేతిక సమస్యలను పరిష్కరించి కళాశాల యాజమాన్య సహకారంతో ఫ్లైఓవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వివరించారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత దాదాపు 90 శాతం పూర్తైన ఫ్లైఓవర్ పనులు నిలిచిపోయాయని,అయితే 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఫ్లైఓవర్‌తో పాటు యనమలకుదురు వంతెన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. నలందా రోడ్ జంక్షన్ వరకు రూ.6.25 కోట్లతో రోడ్డు,డ్రైనేజీ పనులు చేపట్టగా,ప్రస్తుతం మరో రూ.3.25 కోట్లతో సాయిబాబా గుడి వరకు రహదారి,డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్నామని చెప్పారు.అదేవిధంగా 100 ఫీట్ రోడ్ వరకు విస్తరణ కోసం అదనంగా రూ.7 కోట్ల నిధుల మంజూరుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. గతంలో కచ్చా రహదారులు,మురుగు కాలువలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రాంతాలు నేడు ఆధునిక రహదారులతో అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు.తారు సరఫరాలో కొంత ఆలస్యం ఉన్నప్పటికీ పనులు వేగంగా కొనసాగుతున్నాయని,త్వరలోనే పూర్తయిన పనులను ప్రజలకు అంకితం చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి అనేక సంవత్సరాల అభివృద్ధిని మించిపోయిందని పేర్కొంటూ, శ్రీనివాసనగర్,కృష్ణాపురం,గద్దె రామ్మోహన్ ఆర్టీసీ కాలనీ,ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు.బాలాజీనగర్‌లో వర్షాకాలంలో నీటి నిల్వ సమస్య పరిష్కారానికి కూడా త్వరలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి కోసం అవసరమైన చోట ఆక్రమణలు తొలగించాల్సి వచ్చినా ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, ఎవరికి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా గ్రామాలు, పట్టణాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. విజయవాడ నగరానికి ప్రత్యామ్నాయ రహదారి అనుసంధానాలు కల్పించడం,మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేయడం,బందర్ రోడ్డుపై ట్రాఫిక్ భారాన్ని తగ్గించడం తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రహదారి విస్తరణ,అభివృద్ధి పనులకు సహకరిస్తున్న ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన ఆయన,ప్రజల సహకారంతో ప్రస్తుతం ప్రారంభించిన పనులను రాబోయే ఆరు నెలల్లో పూర్తి చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.సాయిబాబా గుడి వరకు చేపడుతున్న పనులు పూర్తయ్యాక 100 ఫీట్ రోడ్ వరకు విస్తరణ పనులను కొనసాగిస్తామని వెల్లడించారు. ప్రజల ఆశీస్సులు,సహకారంతో పెనమలూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# పొగాకు రైతుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి



నెల్లూరు (చైతన్యరథం): జిల్లాలోని పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఏపీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. ఆదివారం పొగాకు రైతు ప్రతినిధులతో.. మంత్రి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యలపై మంత్రి ఆనం చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పొగాకు రైతు ప్రతినిధులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని మంత్రి ఆనం వెల్లడించారు. నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు, ఉదయగిరి, కావలి ప్రాంతాల్లో సుమారు 45 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నారని తెలిపారు. దాదాపు 4 వేల రైతు కుటుంబాలు ఈ పంటపై ఆధారపడి జీవిస్తున్నాయని చెప్పుకొచ్చారు. జిల్లాలో 3,600 పొగాకు బ్యారెన్లు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది పొగాకు ధర కిలోకు రూ.280 నుంచి రూ.360 వరకు పలికిందని, ప్రస్తుతం డీసీపల్లి, కలిగిరి కొనుగోలు కేంద్రాల్లో కిలోకు కేవలం రూ.190 మాత్రమే వస్తోందని పేర్కొన్నారు. ధరలు గణనీయంగా పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఈ సమస్యను ఇప్పటికే మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, బాలవీరాంజనేయులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి ఆనం తెలిపారు. అంతేకాకుండా కేంద్ర వాణిజ్యశాఖ, ఆర్థికశాఖ మంత్రులతో కూడా సీఎం చర్చించారని అన్నారు. పొగాకు రైతులకు న్యాయం జరిగే వరకు తమ ప్రభుత్వం వారి పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం అవసరమైన చర్యలు తీసుకుంటూ, మార్కెట్ పరిస్థితులను సమీక్షించి తగిన పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# ఎట్టకేలకు మా ఊళ్లకు కరెంటొచ్చింది

కుక్కునూరు (చైతన్యరథం): మండల పరిధిలోని పెదరావిగూడెం పంచాయతీ చీపురు గూడెం, బండారుగూడెం రెండు ఆదివాసీ గ్రామాలు ప్రధాన రహదారికి దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో ఉన్నాయి. దాదాపు 30 ఏళ్ల క్రితం వీరంతా చత్తీస్‌ఘడ్ ప్రాంతం నుంచి వలస వచ్చి ఆదివాసీ గ్రామాలు ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి ఈ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేదు. అటవీ శాఖ రిజర్వ్ ఫారెస్ట్ నిబంధనల ప్రకారం విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలంటే ఎన్నో ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో వారు చీకటిలోనే మగ్గుతూ ఇన్నేళ్లు కాలం గడిపారు. అయితే ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాభియాన్ (పీఎం జన్మన్) పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ విద్యుత్ శాఖాధికారులు ఈ గ్రామాలపై దృష్టి పెట్టారు. బండారుగూడెంలో 12 కేవీ, చీపురుగూడెం 13 కేవీ సోలార్ ఆఫ్‌గ్రిడ్‌ను దాదాపు రూ.65 లక్షలతో ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామానికి విద్యుత్ సౌకర్యం ఏర్పడింది. ఈ రెండు గ్రామాల్లో దాదాపు 85 ఆదివాసీ కుటుంబాలున్నాయి. శనివారం ఏలూరు సర్కిల్ సూపరిండెంటెండ్ ఇంజనీర్ పి.సాల్మన్‌రాజు సోలార్ ఆఫ్ గ్రిడ్‌ను ప్రారం భించారు. ఇప్పటి వరకు విద్యుత్ వెలుగులు ఎరుగని ఆదివాసీ గ్రామాలకు పీఎం జన్మన్ పథకం ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించామని ఆయన విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ ఖాన్, ఏడీఈ కట్టా రమేశ్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, స్థానిక టీడీపీ నాయకులు సుబ్బారావుశర్మ, రమణరాజు, గోరమూడి శ్రీను, గుర్రం ఉదయ్, పాల్గొన్నారు.

# ఇక ప్రతి సోమవారం నీటి ఎద్దడి ప్రాంతాల్లో పర్యటిస్తా

## రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడి



రాయదుర్గం (చైతన్యరథం): తాగునీటి సమస్య మీ ఇంటిదైై.. తాగునీరు రావడం లేదని మీ ఇంట్లో వాళ్లు నిలదీస్తే.,.. ఇలాగే ఉంటారా..? అని మున్సిపల్, విద్యుత శాఖ అధికారుల ను ఎమ్మెల్యే కా లవ శ్రీనివాసులు సూటిగా ప్రశ్నించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతి థిగృహంలో శనివారం ఆయన ఇరుశాఖల అధికారులతో సమీక్ష నిర్వ హించారు. అధికారుల పనితీరు, సమన్వయ లోపంపై అసంతృప్తి వ్య క్తం చేశారు. తాగునీరు అందించడంలో ఇరు శాఖల వైఫల్యాన్ని తీవ్ర స్థాయిలో ఆక్షేపించారు. మున్సిపాలిటీ, విద్యుత శాఖల మధ్య సమన్వ యం పూర్తిగా లోపించిందన్నారు. సమస్యను పరిష్కరించడంపై దృష్టి పెట్టకుండా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలం గడుపు తున్నారని మండిపడ్డారు. ప్రజలకు రోజు మార్చి రోజు లేదా కనీసం మూడురోజులకు ఒక సారి తాగునీరు తప్పక ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే ఏడెనిమిది రోజులకోసారి కూడా నీరు ఇవ్వలేకపోవడం దుర దృష్టకరమన్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా పరిస్థితిలో మార్పు లేదన్నారు. ఇది ప్రజల సమస్య కాబట్టి నిర్లక్ష్యం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి కేవలం జీతం కోసం పని చేయడం సరికాదన్నారు. ప్రజల్లో తనకు, ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడానికే మీరంతా పనిచేస్తున్నట్లు అనిపిస్తోం దన్నారు. బాధ్యత రాహిత్య ధోరణిని వెంటనే మార్చుకుని, ప్రజల స మస్యను తమ సమస్యగా భావించి పనిచేయాలని సూచించారు. ఇకపై ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. సోమవారం నుంచి నీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాం తాలను సందర్శిస్తానని తెలిపారు. ఇకపై సమన్వయ లోపం, నిర్లక్ష్యం కొనసాగితే ప్రజల ముందు నిలబెట్టడం, క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేయడం తప్ప మరొక మార్గం ఉండదని హెచ్చరించారు.



# ఘనంగా గంగమ్మ తల్లి తిరణాల

## సుగవాసి ప్రసాద్ బాబు ప్రత్యేక పూజలు, అన్నదానం

రాయచోటి (చైతన్యరథం): అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణానికి సమీపంలోని గాలివీడు రోడ్డులో మాండవ్య నది తీరాన వెలసిన శ్రీశ్రీశ్రీ గంగమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం ఘనంగా ప్రారంభమైన తిరుణాల మహోత్సవాల్లో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ ఆశీర్వాదాలు పొందారు. ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని గంగమ్మ తల్లి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ సుగవాసి పాలకొండ్రాయుడు గారి చొరవతో నిర్మించబడిన ఈ దేవాలయం నేడు భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను కాపాడడంలో ఇలాంటి మహోత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భక్తుల భారీ సంఖ్యలో పాల్గొన్నారు, బోణాల కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగాయి.

# రేపు "ఎన్టీఆర్ భరోసా" పెన్షన్ల పంపిణీ

## పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనాలని సుగవాసి పిలుపు



రాయచోటి (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా" పెన్షన్ కార్యక్రమం 1న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తున్నామని, అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు సకాలంలో అందేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలోని పార్లమెంట్, నియోజకవర్గ, మండల స్థాయి పార్టీ నాయకులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇంచార్జ్‌లు, గ్రామ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, అభిమానులు తమ తమ ప్రాంతాల్లో జరిగే పెన్షన్ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, వివరాలను తప్పనిసరిగా మై టీడీపీ యాప్‌లో ఫ్లోడ్ చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.



ఒంగోలులో నూతనంగా నిర్మిస్తున్న పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిర్మాణ పనులను పరిశీలించిన కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కూటమి నాయకులు






# ప్రతిభావంతులకు "పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పురస్కారాలు"


## పురస్కారాల సభలో ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, శ్రావణిశ్రీ వ్యాఖ్య

అనంతపురం (చైతన్యరథం): ఉమ్మడి అనంతపురంజిల్లా వ్యాప్తంగా ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 500లకు పైగా మార్కులు సాధించి మాదిగ సామాజికవర్గ విద్యార్థులకు "పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ప్రతిభా పురస్కారాలు-2026" అందించే కార్యక్రమాన్ని మాదిగ ఉద్యోగుల సమాఖ్య(ఎం.ఈ.ఎఫ్) ఆధ్వర్యంలో అనంతపురం పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు మరియు శ్రీసత్యసాయిజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు గారు మరియు శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గారు హాజరయ్యారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ఉద్దేశించి ఎం.ఎస్.రాజు గారు మరియు బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ మాదిగ బిడ్డలు అన్ని రంగాల్లో స్థాపించాలి. మాదిగ సామాజికవర్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో అన్న మందకృష్ణ మాదిగ గారు ఎన్నో పోరాటాలు చేసి ఎస్సీ వర్గీకరణ సాధించారు. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు సైతం మాదిగ సామాజికవర్గం అభ్యున్నతి కోసం అనేక పథకాలు అమలు చేయడమే కాకుండా, ప్రభుత్వం నుండి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తున్నారు. ఈ అవకాశాలు అన్నింటినీ మాదిగ సామాజికవర్గం అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉంది. మాదిగ బిడ్డలు అత్యున్నత స్థాయికి చేరాలి, జాతికి అన్ని విధాలా అండగా నిలవాలి. భవిష్యత్తులో ఉన్నత చదువులు కూడా పూర్తిచేసి, జాతి కీర్తి ప్రతిష్టలు పెంచాలని ఎం.ఎస్.రాజు, శ్రావణిశ్రీ కాంక్షించారు.

మాదిగ విద్యార్థులను ప్రోత్సహించడం కోసం వచ్చే విద్యా సంవత్సరం నుండి రూ.1లక్ష రూపాయలు విరాళంగా ఇస్తానని ఎం.ఎస్.రాజు ప్రకటించారు. తదనంతరం ఈ కార్యక్రమంలో 198మంది విద్యార్థులకు అవార్డులు అందించి, వారికి శాలువా కప్పి సత్కరించి, జ్ఞాపికలు బహుకరించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎం.ఈ.ఎఫ్ జిల్లా అధ్యక్షులు మన్నెపాకుల రమేష్ మరియు ఇతర నాయకులను ఎం.ఎస్.రాజు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ....విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. చదువుకు పేదరికం అడ్డు కాదని, అంబేద్కర్ గారి జీవన విధానాన్ని పూర్తిగా చదవాలని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల వల్లనే మాదిగలకు రాజ్యాధికారంలో వాటా దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ ఎన్.టీ.రామాంజినమ్మ, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, ప్రత్యేక అతిథులుగా ఎం.ఆర్.పీ.ఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు, ఎం.ఆర్.పీ.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు వైకే విశ్వనాథ్, ఎం.ఆర్.పీ.ఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్, ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి భిక్షాలు, ఎం.ఎస్.పీ జాతీయ నాయకులు సొట్ట నరేంద్రబాబు, జిల్లా ఇన్చార్జి ఎం.చిన్న సుబ్బారావు, ఎం.ఈ.ఎఫ్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై గంగాధర్ పాల్గొన్నారు.

# రక్తం మరిగిన రాకాసి వైసీపీ

కర్నూలు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ అధికారం కోల్పోయి రెండేళ్లు గడిచినా ఆ పార్టీ నేతల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. టీడీపీ శ్రేణులు సహా సాధారణ ప్రజలపై దాడులకు తెగబడుతూనే ఉన్నారు. సామాన్యులను భయభ్రాంతులకు గురి చేస్తూ రాక్షసానందం పొందుతున్నారు. తాజాగా అలాంటి ఘటనే కర్నూలు జిల్లా కోసిగి మండలం కందుకూరులో చోటు చేసుకుంది. ఆ గ్రామంలో వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. రైతుపై కత్తులతో దాడికి యత్నించాయి. కర్నూలు జిల్లా ఆదోని మండలం పాండవగల్లు గ్రామానికి చెందిన రామదాసు అనే రైతు.. కందుకూరులో పొలం తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. అయితే, తనకు తెలియకుండా గ్రామంలో వ్యవసాయం చేయడంపై వైసీపీ నేత బెట్టన గౌడ్ ఆగ్రహించాడు. తన అనుమతి లేకుండా వ్యవసాయం చేయడం ఏంటని ఊగిపోయాడు. అనుచరులతో కలిసి మారణాయుధాలు తీసుకుని రైతు రామదాసు వద్దకు వెళ్లాడు. రైతును చూసిన వెంటనే ఒక్కసారిగా కత్తులతో దాడికి యత్నించారు. వైసీపీ మూకల దాడి నుంచి అతి కష్టం మీద తప్పించుకున్నాడా రైతు. అనంతరం పోలీసులను ఆశ్రయించాడు. వైసీపీ నేత బెట్టన గౌడ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని.. రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనతో కందుకూరు, పాండవగల్లు గ్రామాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వ్యవసాయం చేయాలంటే వైసీపీ నేతల అనుమతి తీసుకోవాలా? అంటూ మండిపడుతున్నారు. కాగా, ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టిస్తోంది.





# వైసీపీ వికృత చేష్టలు

నంద్యాల (చైతన్యరథం): జిల్లాలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ధ్వంసం వ్యవహారంలో మరోమారు వైసీపీ డ్రామాలు బట్టబయలయ్యాయి. ఈ ఘటనలో వైసీపీ కుట్రలు వెలుగులోకి వచ్చాయి. సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా వైసీపీ డ్రామా బట్టబయలైంది. ఈ ఘటనకు పాల్పడింది వైసీపీ కార్యకర్త జమలయ్యగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. 2018 నుంచి మాజీ ఎమ్మెల్యే శిల్పా రవికిషోర్ రెడ్డి, నంద్యాల వార్డు కౌన్సిలర్, వైసీపీ నేత పున్నా శేషయ్య అనుచరుడిగా నిందితుడు జమలయ్య ఉన్నాడని పోలీసులు తెలిపారు. వైసీపీ రాజకీయ కార్యకలాపాల్లో సుదీర్ఘ కాలంగా క్రియాశీలకంగా నిందితుడు జమలయ్య ఉన్నాడు. 2022లో అప్పటి పాలకుల సిఫార్సుతో కమ్యూనిటీ రిసోర్సు పర్సన్‌గా జమలయ్య భార్య పని చేస్తున్నారు. వైఎస్సార్ విగ్రహం ధ్వంసం చేసిన వ్యవహారంలో ఇతర పార్టీల ప్రమేయం ఏమి లేదని, ఈ ఘటనలో నేరుగా నిందితుడు జమలయ్య పాల్గొన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సీసీ కెమెరాల వీడియోతో పాటు ఇతర ఆధారాలను పరిశీలించి ఈ కుట్రలో ఇతరుల భాగస్వామ్యంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా ముందుగానే ఈ కుట్రకు పాల్పడ్డారా అనే అంశంపై కూడా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసినా, తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే ప్రయత్నం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని పోలీసులు వార్నింగ్ ఇచ్చారు.



# పకడ్బందీగా తల్లికి వందనం అమలుకు కసరత్తు

చిత్తూరు (చైతన్యరథం): ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఓ పక్క గట్టి ప్రయత్నాలను చేస్తూనే మరోపక్క తల్లికి వందనం పథకం అమలుకు అధికార యంత్రాంగం కసరత్తు చేపట్టింది. కొత్త అడ్మిషన్ల సందర్భంగా ఉపాధ్యాయులు ఈపథకం గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కంటే అధిక మొత్తం ఇవ్వడంతో పాటు ఎంతమంది పిల్లలుంటే అందరికీ పథకాన్ని వర్తింపజేస్తున్న సంగతిని గుర్తు చేస్తున్నారు. మరో 12 రోజుల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఆధార్ నంబరు నమోదు కీలకం చేసింది.'తల్లికి వందనం' లబ్ధి పొందాలంటే తల్లుల బ్యాంకు ఖాతా కచ్చితంగా ఆధార్‌తో అనుసంధానమై ఉండాలి. గతేడాది అవగాహనా రాహిత్యంతో కొందరు బ్యాంకు ఖాతాలకు ఆధార్‌తో అనుసంధానం చేసుకోలేకపోయారు. దీంతో కొంతమంది పిల్లలు తల్లికి వందనం పథకం కింద లబ్ధి పొందలేకపోయారు. ఈక్రమంలో ఈ ఏడాది అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈపక్రియను వేగవంతం చేయడంలో ఉపాధ్యాయులను భాగస్వాములు చేసింది. బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. కాగా 2026-27 విద్యా సంత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం 2.04,355 మంది విద్యార్థులున్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.మై ఆధార్ విభాగానికి వెళ్లి ఆధార్ సర్వీసెస్ కింద చెక్ ఆధార్/బ్యాంకు లింకేజీ స్టేటస్ ఎంపిక చేసుకోవాలి.12 అంకెల ఆధార్ నంబరుతో పాటు ఓటీపీ నమోదు చేసి క్లిక్ చేస్తే మొబైల్ నంబరకు ఓటీపీ వస్తుంది. వచ్చిన ఓటీపీని ఎంటర్ చేశాక స్క్రీన్‌పై ఆధార్ ఏ బ్యాంకు ఖాతాకు లింక్ అయ్యిందో కనిపిస్తుంది.ఖాతా ఉన్న బ్రాంచిలో సంప్రదించి, ఆధార్ సీడింగ్/ఎన్‌పీసీఐ లింక్డ్ ఫారం పూర్తించి సమర్పించాలి. ఆధార్ సంఖ్య, బ్యాంకు ఖాతా వివరాలు మొబైల్ నంబరు తదితర సమాచారాన్ని నమోదు చేసి నిర్దేశించిన చోట సంతకం చేసి బ్యాంకులో సమర్పించి రసీదు పొందాలి. ఎన్‌పీసీఐ లింకయ్యాక ఫోన్‌కు ఎస్‌ఎంఎస్ ద్వారా సందేశం వస్తుంది. తల్లికి వందనం సాయం జమ చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తును వేగవంతం చేసింది. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అర్హుల జాబితాలు సిద్ధం చేస్తున్నారు. లబ్ధిదారులకు గతంలో ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా ఈ సారి ప్రభుత్వం ముందస్తుగా బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచిస్తున్నారు. దీనిపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. గతేడాది జిల్లాలో ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 2,64,679 మంది ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్, ప్రైవేటు తదితర యాజమాన్య పాఠశాలల్లో చదివారు. వీరిలో 2,06,541 మంది విద్యార్థులకు చెందిన 1,30,382 మంది తల్లులు 'తల్లికి వందనం' పథకానికి అర్హత సాధించారు. విద్యార్థికి రూ.15 వేల చొప్పున అర్హత సాధించిన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.338.83 కోట్లు ప్రభుత్వం జమచేసింది. గతేడాది వివిధ కారణాలతో 54,138 మంది పథకానికి అనర్హులయ్యారు. ఇందులో సాంకేతిక సమస్యలు, ఆధార్ అనుసంధానం చేసుకోలేనివారు ఎక్కువ మందే ఉన్నారు.

# తెలుగుజాతి ఆత్మగౌరవం ఎన్టీఆర్

నార్త్‌కరోలినా: తెలుగు ప్రజల ఆత్మగౌంవ ప్రతీక మహానటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా రాలీ ఎన్నారై టీడీపీ ఆధ్వర్యంలో అభిమానులు సంస్మరణ సభ విజయవంతంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే రాలీ నుంచి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్ఫూర్తితో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్టీఆర్ అభిమానులు, తెలుగు కుటుంబాలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అపెక్స్ నగరంలోని సేలెమ్ విలేజ్ క్లబ్ హౌస్‌లో జరిగిన ఈ వేడుకల్లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఎన్టీఆర్ రాజకీయ, సినీ, సామాజిక సేవలు, తెలుగు జాతికి అందించిన సేవలను కొనియాడారు. తెలుగు ప్రజల గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిన మహానేతగా ఎన్టీఆర్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, స్వాభిమాన రాజకీయాలకు ఆయన వేసిన బాట





- రాలీ ఎన్నారై టీడీపీ ఆధ్వర్యంలో నివాళి
- అపెక్స్ నగరంలో జయంతి వేడుకలు
- పాల్గొన్న కూటమి నాయకులు, కార్యకర్తలు

నేటికీ కొట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు తమ పార్టీ కండువాలతో ఐక్యతను ప్రదర్శిస్తూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. యువత ఎన్టీఆర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేడుకల అనంతరం పాల్గొన్న వారందరికీ ఆతిథ్య విందు ఏర్పాటు చేశారు. విందును అందించి కార్యక్రమం విజయానికి సహకరించిన చార్మినార్ బిర్యానీస్/చాట్ రెస్టారెంట్ యాజమాన్యానికి నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పనిదినం అయినప్పటికీ మే 28నే ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించడం విశేషం. చివరిగా వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

## ఫిలడెల్ఫియాలో ఎన్టీఆర్ జయంతి



ఫిలడెల్ఫియా: తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక, విశ్వ విఖ్యాత నట సార్వభౌమ ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు పెన్సిల్వేనియాలోని ఫిలడెల్ఫియా నగరంలో ఘనంగా నిర్వహించారు. పరిటాల సునీత జన్మదిన వేడుకలను కూడా ఆనందో త్సాహాల మధ్య జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. మహానాడు స్ఫూర్తితో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకుసాగాలని, పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు జై ఎన్టీఆర్, జై చంద్రబాబు, జై బాలయ్య, జై లోకేష్ నినాదాలతో సభా ప్రాంగణాన్ని మార్మోగించారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన వారికి, హాజరైన నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు, ప్రవాస తెలుగు వారికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.





## ఎన్టీఆర్‌కు చికాగో ఎన్ఆర్ఐ టీడీపీ నివాళి

చికాగో: ఎన్ఆర్ఎస్ఐ టీడీపీ చికాగో ఆధ్వర్యంలో, సీనియర్ టీడీపీ నాయకులు శ్రీహేమ కానూరు గారి పర్యవేక్షణలో చికాగోలోని కానూరు ఫార్మ్ హౌస్‌లో ఎన్టీఆర్ జయంతి, మహానాడు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఎన్టీఆర్ అభిమానులు హాజరయ్యారు. అమెరికా ఎస్ఆర్ఎస్ఐ టీడీపీ కోఆర్డినేటర్ కోమటి జయరాం, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమా జూమ్ కాల్ ద్వారా పాల్గొని ప్రసంగించారు. తెలుగుజాతికి ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల హృదయాలలో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ టీడీపీ నాయకులు హేమ కానూరు, ఎస్ఆర్ఎస్ఐ టీడీపీ చికాగో అధ్యక్షుడు రవి కాకర ప్రసంగించి సభకు హాజరైన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# తానా చైర్మన్ కొడాలి అరుదైన ఘనత

### ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన టెన్జింగ్-హిల్లరీ ఎవరెస్ట్ మారథాన్ పూర్తి







అమెరికా: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) బోర్డ్ చైర్మన్, ప్రముఖ వైద్యనిపుణుడు నాగేంద్ర శ్రీనివాస్ కొడాలి ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన, సాహ సోపేతమైన మారథాన్‌లలో ఒకటైన టెన్జింగ్–హిల్లరీ ఎవరెస్ట్ మారథాన్‌ను విజయ వంతంగా పూర్తి చేసి మరో అరుదైన ఘనతను సాధించారు. ప్రతి సంవత్సరం ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ప్రాంతంలో నిర్వహించే ఈ మారథాన్ ప్రపంచంలోని అత్యంత ఎత్తైన ప్రదేశంలో జరిగే మారథాన్‌గా గుర్తింపు పొందింది. సముద్రమట్టానికి సుమారు 5,364 మీటర్ల ఎత్తులో ప్రారంభమయ్యే ఈ రేసులో తక్కువ ఆక్సిజన్, కఠినమైన వాతావరణ పరిస్థితులు, మంచుతో కూడిన మార్గాలు, ఎత్తుపల్లాలు వంటి ఎన్నో సవాళ్లను అధిగమించాల్సి ఉంటుంది. ఈ పోటీని పూర్తి చేయడం అసాధారణమైన శారీరక, మానసిక సామర్థ్యానికి నిదర్శనం. పురాణ ఇతిహాసాల ఆధారంగా రూపొందించిన తానా విశ్వగురుకులం అనే ప్రత్యేక బోధనా పద్ధతిని ప్రపంచానికి.. మరీ ముఖ్యంగా ఉత్తర అమెరికాలోని తెలుగు వారికి పరిచయం చేయడంలో భాగంగా ఈ సాహస యాత్ర సాగించారు. తానా విశ్వగురుకుల బోధనా వ్యాప్తికి, తానా సిద్ధాంతాలు, వ్యవస్థాపక లక్ష్యాలను మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ఎంతో క్లిష్టమైన ఈ యాత్రలకు నాగేంద్ర శ్రీనివాస్ కొడాలి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఆయన ప్రపంచంలోని ఏడు అత్యున్నత శిఖరాల్లో మూడు అయిన లి కార్స్టెన్స్ పిరమిడ్ (ఇండోనేషియా), మౌంట్ ఎల్బ్రస్ (రష్యా), మౌంట్ కిలిమంజారో (టాంజా నియా)లను విజయ వంతంగా అధిరోహించారు.

**తానా సభ్యుల హర్షం**

సాహసం, సేవాభావం, నాయకత్వం కలగలిసిన నాగేంద్ర శ్రీనివాస్ కొడాలి సాధించిన ఈ విజయంపై తానా సభ్యులు, తెలుగు సమాజ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు వారసత్వాన్ని ప్రపంచ వేదికపై మరింతగా నిలబెట్టే దిశగా ఆయన చేస్తున్న కృషి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. కాగా తానా చేసే సేవా కార్యక్రమాలను ప్రోత్సహించడంతో పాటు 2027లో నరేన్ కొడాలి అధ్యక్షతన జరిగే తానా స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని, వాటికి అందరి సహాయ సహకారాలు అందించాలని తానా బోర్డు చైర్మన్ నాగేంద్ర శ్రీనివాస్ కొడాలి విజ్ఞప్తి చేశారు.



చార్లెట్‌లో 'నాట్స్'

## ఉచిత వైద్యశిబిరం

**50 మందికి పైగా వైద్యసేవలు**

యూఎస్ఏ: అమెరికాలో భాషే రమ్యం.. సేవే గమ్యం అంటూ సేవలందిస్తున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం నాట్స్ తాజాగా చార్లెట్ చాప్టర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రవాస తెలుగువారి కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహించింది. 'క్రిష్యా కేర్స్' వేదికగా ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. 50 మందికి పైగా నమోదు చేసుకుని ఉచిత వైద్యసేవలు పొందారు. గ్యాస్ట్రో ఎంటరా లజిస్ట్ వినీత్ కొర్రపాటి, ఫ్యామిలీ ఫిజీషియన్ కిషన్ మరమ రాజ్, కార్డియాలజిస్ట్ కార్తీక్ శఠగోపం, ఆంకాలజిస్ట్ గీతా వల్లభనేని వచ్చిన వారికి ఉచితంగా వైద్యసేవలు అందించారు. మెడికల్ క్యాంప్ విజయవంతానికి కృషిచేసిన యువ వాలంటీర్లను నాట్స్ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఉచిత వైద్యశిబిరం నిర్వహణలో చొరవ చూపించిన చార్లెట్ చాప్టర్ నాట్స్ నాయకులను నాట్స్ చైర్మన్ కిషోర్ కంచర్ల, నాట్స్ అధ్యక్షుడు శ్రీహరి మందాడి ప్రత్యేకంగా అభినందించారు.

# భారత అథ్లెటిక్స్‌కు స్వర్ణయుగం

## 'మన్ కీ బాత్'లో ప్రధాని ప్రశంసలు



ఢిల్లీ: భారత క్రీడాకారులు ప్రపంచస్థాయిలో తమ ప్రతిభను చాటుతూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన 'మన్ కీ బాత్' 134వ ఎపిసోడ్‌లో ఆయన దేశ విదేశాల్లోని భారతీయులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా భారత అథ్లెటిక్స్ రంగం సాధిస్తున్న పురోగతిని ప్రత్యేకంగా ప్రస్తావించారు మోదీ. జార్ఖండ్ రాజధాని రాంచీలో ఇటీవల జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల్లో క్రీడాకారులు అసాధారణ ప్రతిభ కనబరిచారన్నారు. వివిధ విభాగాల్లో ఏకంగా 4 జాతీయ రికార్డులు నెలకొల్పారని గుర్తుచేశారు. గురిందర్వీర్ సింగ్, విశాల్ టీకే, తేజస్విన్ శంకర్, దేవ్ మీనా, కుల్దీప్ కుమార్‌లు ఆయా విభాగాల్లో కొత్త రికార్డులు సృష్టించి క్రీడా ప్రతిష్ఠను పెంచారని కొనియాడారు. పురుషుల 100 మీటర్ల స్ప్రింట్‌లో చోటుచేసుకున్న పరిణామాన్ని ఈ కార్యక్రమంలో ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే మూడుసార్లు జాతీయ రికార్డు బద్దలవడం భారత అథ్లెటిక్స్ చరిత్రలో అరుదైన ఘట్టమని పేర్కొన్నారు. గురిందర్వీర్ సింగ్, అనిమేశ్ కుజూర్ లాంటి యువ అథ్లెట్ల ప్రదర్శనలు దేశంలో క్రీడల పట్ల ఆసక్తి పెరిగేందుకు నిదర్శనమన్నారు. ఇలాం టి విజయాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం సహా.. అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు తోడ్పడతాయని మోదీ చెప్పుకొచ్చారు.

### వడగాలులతో జాగ్రత్త!

ఇక.. దేశవ్యాప్తంగా వీస్తున్న తీవ్ర వేడిగాలులపై మోదీ ప్రజల ను అప్రమత్తం చేశారు. గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవు తున్న తరుణంలో ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎక్కువగా నీరు తాగడం, ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం, శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గత నెల 133వ ఎపిసోడ్‌లో భారత చారిత్రక రికార్డుల పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న 'నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా' గురించి కూడా నేటి మన్ కీ బాత్‌లో ప్రస్తావించారు మోదీ. దేశ చరిత్రకు సంబంధించిన 20 కోట్లకుపైగా చారిత్రక పత్రాలు, రికార్డులను.. ఆర్కైవ్స్ వాల్ పోర్టల్ ద్వారా డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకొచ్చిందని వివరించారు.

# సైబర్ సెక్యూరిటీ లోపాలు ఉన్నాయ్..

### ఓఎస్ఎం కాంట్రవర్సీపై సీబీఎస్ఈ స్పందన




ఢిల్లీ: ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) వ్యవస్థలో సైబర్ సెక్యూరిటీ సంబంధిత సమస్యలున్నాయన్న ఆరోపణలపై సీబీఎస్ ఈ తొలిసారిగా స్పందించింది. ఓఎస్ఎంలో బయటపడ్డ లోపాల పై తాము దృష్టిపెట్టామని ఎక్స్ వేదికగా చెప్పింది. వివిధ ప్రభుత్వ ఏజెన్సీలు, ఐఐటీలకు చెందిన సైబర్ సెక్యూరిటీ నిపుణులు బృందం ఓఎస్ఎం వ్యవస్థ భద్రతను మరింత మెరుగు పరిచేందు కు కొన్ని రోజులుగా కసరత్తు చేస్తోందని తెలిపింది. ఇప్పటికే బయటపడ్డ లోపాలను పరిష్కరించామని తెలిపింది. ఇతరత్రా ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. ఓఎస్ఎం పోర్టల్‌ను మరింత భద్రమైన వేదికలోకి మారుస్తున్నామని కూడా తెలిపింది. ఈ భద్రతా లోపాలను తమ దృష్టికి తెచ్చిన ఎథికల్ హ్యాకర్లు, పౌరులకు కూడా సీబీఎస్‌ఈ ధన్యవాదాలు తెలిపింది. వీరిలో కొందరిని నేరుగా సంప్రదించి కృతజ్ఞతలు చెప్పామని పేర్కొంది. ఇలాంటి లోపాలను గుర్తించిన వారు ఆ వివరాలను తమకు పంపించాలని కూడా సూచించింది. ఓఎస్ఎం పోర్టల్‌లో భద్రతాలోపాలను 19 ఏళ్ల ఎథికల్ హ్యాకర్ నిసర్గ అధికారి తొలిసారిగా బయటపెట్టిన విషయం తెలిసిందే. ఈ పోర్టల్‌కు సంబంధించి ఏడబ్ల్యూఎస్ వ్యవస్థలో భద్రపరిచిన ప్రశ్న పత్రాలు, సమాధాన పత్రాలు ఎవరైనా యాక్సెస్ చేయగలిగే పరిస్థి తి ఉందని చెప్పారు. ఇందుకు ఆధారాలను కూడా ఆన్‌లైన్‌లో పెట్టాడు. ఇదిలా ఉంటే, ఓఎస్ఎం వ్యవస్థ నిర్వహణ కేటాయింపు నకు ఉద్దేశించిన టెండర్ నిబంధనల్లో కోయెంప్ట్ సంస్థకు అనుకూ లంగా మార్పులు జరిగాయన్న 12వ తరగతి విద్యార్థి సార్థక్ సిద్ధాంత్ ఆరోపణలపై కూడా సీబీఎస్‌ఈ ఇప్పటికే స్పందించింది. ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఒక ఓఎస్ఎం లోపాల కారణం గా మార్కుల కేటాయింపులో తప్పులు దొర్లినట్టు ఆరోపణలు కూడా రావడంతో విద్యార్థులకు మరోసారి వెరిఫికేషన్, రీఎవాల్యుయేషన్ అవకాశాన్ని ఇచ్చింది. ఇందుకు సంబంధించిన కొత్త పోర్టల్‌ను జూన్ 1 నుంచి అందుబాటులోకి వస్తుందని పేర్కొంది.

### పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై

# విండ్‌ఫాల్ పన్ను తగ్గింపు

### కేంద్రం కీలక నిర్ణయం



న్యూఢిల్లీ: ఆయిల్ కంపెనీలకు ఉపశమనం కలిగిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై విండ్‌ఫాల్ గైన్స్ పన్నును కేంద్రం తగ్గించింది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. తాజా ఆదేశాల ప్రకారం పెట్రోలియం ఎగుమ తులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ డ్యూటీని లీటరుకు రూ.1.5 చొప్పున తగ్గించింది. డీజిల్ ఎగుమతులపై లీటరుకు రూ.13.5 గా నిర్ణయించారు. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఎగుమతులపై లీటరుకు రూ.9.50 పన్ను విధించనున్నారు. సవరించిన రేట్లు జూన్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

### దేశీయ ఇంధన ధరల్లో మార్పు లేదు

దేశీయ మార్కెట్‌లో విక్రయించే పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీలో మాత్రం ఎలాంటి మార్పు లేదని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులకే ఈ సవరణ వర్తిస్తుందని స్పష్టం చేసింది. మరో కీలక నిర్ణయం కూడా కేంద్రం తీసుకుంది. పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై విధించే రోడ్డు, మౌలిక సదుపాయాల సెస్‌ను పూర్తిగా సున్నాకు తగ్గిం చింది. ఈ చర్య ఎగుమతిదారులపై పన్ను భారం తగ్గించనుంది.

### విండ్‌ఫాల్ పన్ను అంటే..

దేశీయ మార్కెట్‌లో ఇంధన లభ్యతను నిర్ధారించడం, అంత ర్జాతీయ ధరల వ్యత్యాసం వల్ల ఎగుమతిదారులు అధిక లాభాలు పొందకుండా నియంత్రించడానికి కేంద్రం ఈ విండ్‌ఫాల్ పన్నును ప్రవేశపెట్టింది. అంతర్జాతీయ మార్కెట్లో హెచ్చుతగ్గుల ఆధారంగా ఈ రేట్లను ఎప్పటికప్పుడు ప్రభుత్వం సమీక్షిస్తుంటుం ది. ప్రస్తుతం గ్లోబల్ చమురు మార్కెట్లు కొంత స్థిరత్వం దిశగా పయనిస్తుండటంతో ప్రభుత్వం విండ్‌ఫాల్ పన్నును తగ్గించాలనే నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

# యూపీలో ఎన్‌కౌంటర్..

### టీనేజర్ హత్య కేసులో నిందితుడు మృతి



ఉత్తర్‌ప్రదేశ్: కలకలం రేపిన టీనేజర్ హత్య కేసులో ప్రధాన నిందితుడు అసద్ శనివారం రాత్రి పోలీస్ ఎన్‌కౌంట ర్‌లో మరణించాడు. బక్రీద్ నాడు సూర్య చౌహాన్ అనే టీనేజర్ ను అసద్, మరికొందరితో కలిసి హత్య చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తడంతో యూపీలో పెను కలకలం రేగింది. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఇక అసద్ కోసం గాలింపు చర్యలు చేపట్టిన ఘాజియాబాద్ పోలీసు లకు అతడు తన స్నేహితుడిని కలిసేందుకు ఖోదా ప్రాంతానికి వస్తున్నట్టు సమాచారం అందింది. దీంతో, పోలీసులు నిఘా పెట్టారు. మరో వ్యక్తితో కలిసి బైక్‌పై వచ్చిన అతడు పోలీసులపై కాల్పులకు దిగాడు. ఈ క్రమంలో పోలీసులు కూడా ఎదురు కాల్పులకు దిగడంతో అసద్‌కు గాయాలయ్యాయి. ఒక కానిస్టేబుల్ కూడా ఈ ఘటనలో గాయపడ్డారు. నిందితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడని పోలీసులు తాజాగా తెలిపారు. మే 28న సూర్య చౌహాన్.. అసద్‌తో పాటు మరికొందరితో వాగ్వావాదానికి దిగాడు. బైక్ విషయంలో వారి మధ్య గొడవ జరిగినట్టు తెలిసింది. ఈ క్రమంలో సూర్య వారి చేతిలో హత్యకు గురయ్యాడు. దీంతో అతడి కుటుంబసభ్యులు స్థానికంగా నిరసనకు దిగారు. నిందితుల ఎన్‌కౌంటర్ జరిగాకే తన కుమారుడి అంత్యక్రియలు పూర్తి చేస్తానని మృతుడి తల్లి తేల్చి చెప్పారు. అయితే సీనియర్ పోలీసు ఉన్నతాధికారులు నచ్చజెప్పడంతో సూర్య కుటుంబం చివరకు అతడి అంత్యక్రియ లను పూర్తి చేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు మొత్తం ఐదు మందిపై కేసు నమోదు చేశారు. ముగ్గురిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న అసద్ మాత్రం ఎన్‌కౌంటర్‌లో కన్నుమూశాడు.

# ఉగ్రవాదులకు సాయంగా టెలికం సిగ్నల్స్

## పాక్ కుట్రను వివరించిన అధికారులు

ఇంటర్నెట్ డెస్క్: భారత్‌లోకి ఉగ్రవాదుల చొరబాట్లను ప్రేరేపించే పాక్ వారికి సాయంగా అక్రమ టెలికం సిగ్నల్స్‌ను ప్రసారం చేస్తోంది. భారత నిఘా వర్గాలకు చిక్కకుండా సమాచా ర మార్పిడిలో సాయపడేందుకు ఈ సిగ్నల్స్‌ను భారత్‌లోకి ప్రసారం చేస్తోందని అధికారులు జాతీయ మీడియాకు తెలిపారు. ఇవి జమ్మూ వరకూ చొచ్చుకొస్తున్నట్టు చెప్పారు. ఈ దిశగా నియంత్రణ రేఖకు అత్యంత సమీపంలో వ్యూహాత్మక ప్రాంతాల్లో పాక్ సెల్ టవర్స్‌ను ఏర్పాటు చేసుకుంది. వీటి ద్వారా ప్రసారమయ్యే సిగ్నల్స్ జమ్మూలోని జైళ్ల వరకూ చేరుతున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. కశ్మీర్‌లోని పర్వత ప్రాంతాలు ఈ సిగ్నల్స్ ను అడ్డుకుంటున్నప్పటికీ జమ్మూ మైదాన ప్రాంతాల మీదుగా ఎలాంటి ఆటంకాలు లేకుండా ఈ సిగ్నల్స్ భారత్‌లోకి చొచ్చు కొస్తున్నాయి. ఈ టవర్స్‌లో ప్రామాణిక జీఎస్ ఎమ్ టెక్నాలజీకి బదులు సీడీఎమ్ఏ సాంకేతికతను వాడారని భారత అధికారులు చెప్పారు. స్మార్ట్ ఫోన్స్, రేడియో సెట్స్ అనుసంధానించి ఎన్‌క్రిప్టెడ్ విధానంలో సమాచారం పంపించే వైఎస్ఎమ్ఎస్ సర్వీసుకు (చైనా తయారీ వ్యవస్థ) అనువుగా ఈ టవర్స్‌ను పాక్ ఏర్పాటు చేసిందని చెబుతున్నారు. ఫలితంగా భారతీయ సిగ్నల్స్, సిమ్ కార్డుల అవసరం లేకుండానే పాక్ హ్యాం డ్లర్లు భారత్‌లోని ఉగ్రవాదులతో సంప్రదింపులు జరుపుతారని చెబుతున్నారు.




### టెలికం నిబంధనలు ఏం చెబుతున్నాయి

అంతర్జాతీయ టెలికం నిబంధనల ప్రకారం ఒక దేశానికి చెందిన సెల్యులర్ సిగ్నల్స్ సరిహద్దు దాటి 500 మీటర్లకు మించి పొరుగు దేశంలోకి వెళ్లకూడదు. అయితే, భారత్‌లోని కథువా, రాజౌరీ, పూంఛ్ సరిహద్దు జిల్లాలతో పాటు జమ్మూ నగరానికి ఉత్తరాన 15 కిలోమీటర్ల దూరంలోని కోట్‌బాల్వాల్ జైలు వరకూ పాక్ సిగ్నల్స్ ఆనవాళ్లను గుర్తించామని అధికారులు చెప్పారు.

అక్రమ సిగ్నల్స్‌ను అడ్డుకునేందుకు జైళ్ల వద్ద ఉన్న కొన్ని జామర్లు ఈ సిగ్నల్స్‌ను అడ్డుకోలేకపోతున్నాయని అధికారులు తెలిపారు. వీటిని అడ్డుకునే కొత్త తరం జామర్ల అవసరం ఉందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే 2019-20 పాక్ చేసిన ఇలాంటి ప్రయత్నాలను భారత్ దీటుగా ఎదుర్కొందని చెప్పారు. ప్రస్తుతం పాక్ ప్రయత్నాలకు అదే గతి తప్పదని చెప్పారు.

# బ్రహ్మోస్ క్షిపణులకు ఆసియాలో భారీ డిమాండ్..

## వియత్నాంతో ఒప్పందం పూర్తి




భారత్ రూపొందించిన అత్యాధునిక సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి 'బ్రహ్మోస్'కు ఆసియా దేశాల్లో భారీ గిరాకీ పెరుగుతోంది. విదేశాల నుంచి ఆయుధాలు కొనే భారత్ ఇప్పుడు బ్రహ్మోస్ క్షిపణులను విదేశాలకు విక్రయిస్తోంది. వియత్నాంతో క్షిపణుల సరఫరా ఒప్పందం పూర్తయిందని సింగపూర్‌లో షాంగ్రి-లా చర్చల్లో పాల్గొన్న భారత రక్షణ శాఖ సెక్రెటరీ రాజేష్ కుమార్ సింగ్ వెల్లడించారు. అధికారిక ప్రకటన మాత్రం వేచి ఉందన్నారు. ఇండోనేసియాతో చర్చలు తుది దశకు చేరుకున్నాయని కూడా తెలిపారు. ఈ క్షిపణులను కొన్న మొదటి దేశం ఫిలిప్పైన్స్. 2022లో 375 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదిరింది. ఇప్పటికే కొన్ని క్షిపణులు ఆ దేశానికి చేరాయి. ప్రస్తుతం సింగపూర్, మలేసియా, బ్రూనే, థాయ్‌లాండ్, దక్షిణాఫ్రికా, ఖతార్, ఒమన్, బ్రెజిల్, యూఏఈ దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి చూపిస్తున్నాయి. డిమాండ్ పెరిగితే ఉత్పత్తి సామర్థ్యం పెంచేందుకు ఇతర దేశాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని రాజేష్ కుమార్ స్పష్టం చేశారు.

## రష్యా కొత్త అస్త్రం 'యోల్కా'

# ఉక్రెయిన్ డ్రోన్లను గాల్లోనే నాశనం



ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా తాజాగా 'యోల్కా' ఇంటర్‌సెప్టర్ డ్రోన్లను భారీగా ఉపయోగిస్తున్నట్లు వెల్లడైంది. పిస్టల్ మాదిరి పరికరంతో సులభంగా ప్రయోగించగల ఈ డ్రోన్.. కృత్రిమ మేధ, కెమెరా, సెన్సర్ల సాయంతో శత్రు డ్రోన్లను స్వయంగా గుర్తించి, గంటకు 200-250 కిలోమీటర్ల వేగంతో వెంటాడి ఢీకొట్టి నాశనం చేస్తుంది. ఇందులో పేలుడు పదార్థం అవసరం లేదు. స్తూపాకారంలో రూపొందించిన దీనికి ఎక్స్ ఆకారపు రెక్కలు ఉంటాయి.

మూడు కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల ఈ డ్రోన్ ధర కేవలం 500 డాలర్లు. గత ఏడాది విక్టరీ డే పరేడ్‌లో ఇది అందరి దృష్టినీ ఆకర్షించింది. రష్యా ఈ ఆయుధాన్ని ఉపయోగించడం మొదలుపెట్టిన తర్వాత ఉక్రెయిన్ వ్యూహం మార్చుకుంది. నిఘా డ్రోన్లను మునుపటి 150-200 మీటర్ల ఎత్తుకు బదులు 900 మీటర్లకుపైగా ఎగిరేలా పంపడం మొదలుపెట్టింది.

# 'అమెరికా డ్రోన్‌ను కూల్చేశాం'



అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. తమ గగనతలంలోకి చొరబడిన అమెరికా ఎంక్యూ-1 డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఆదివారం ప్రకటించింది. శత్రుత్వ కార్యకలాపాల ఉద్దేశంతో తమ జలాల్లోకి ప్రవేశించిన ఆ డ్రోన్‌ను వెంటనే గుర్తించి, గగనతల రక్షణ క్షిపణులతో నాశనం చేసినట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ధృవీకరించింది.

ఇది ఒక్క సంఘటనే కాదు. గత మంగళవారం కూడా అమెరికాకు చెందిన ఎంక్యూ-9 డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. అమెరికా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ప్రతీకారం తీర్చుకునే హక్కు తమకు ఉందని ఇరాన్ అప్పుడే హెచ్చరించింది. తమ గగనతలంలోకి చొరబడిన ఒక యుద్ధ విమానంపై కూడా కాల్పులు జరిపినట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి.


మరోవైపు తాము 'ఆత్మరక్షణ దాడులు' చేసినట్లు అమెరికా ప్రకటించింది. సోమవారం దక్షిణ ఇరాన్‌లోని క్షిపణి ప్రయోగ కేంద్రాలపై, మైన్‌లు అమర్చడానికి ప్రయత్నిస్తున్న పడవలపై దాడులు చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) వెల్లడించింది. కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ తమ దళాల రక్షణకు కట్టుబడి ఉన్నామని సెంట్‌కామ్ ప్రతినిధి టిమ్ హాకిన్స్ స్పష్టం చేశారు.

గురువారం రాత్రి ఇరాన్‌లోని ఒక సైనిక స్థావరంపై కూడా అమెరికా దాడులు నిర్వహించింది. ఆ స్థావరం అమెరికా దళాలకు, వాణిజ్య నౌకలకు ముప్పుగా పరిణమించిందని వాషింగ్టన్ పేర్కొంది. గురువారం తెల్లవారుజామున హర్మూజ్ జలసంధి సమీపంలోని బందర్ అబ్బాస్ ఓడరేవు నగరానికి తూర్పున మూడు భారీ పేలుళ్లు చోటు చేసుకున్నాయని ఇరాన్ వార్తా సంస్థ ఫార్స్ నివేదించింది. ఇరాన్ అణు కార్యక్రమం తమకు తీవ్రమైన ముప్పుగా పరిణమించిందనీ, అణ్వాయుధాల అభివృద్ధికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడానికే ఇజ్రాయెల్‌తో కలిసి పోరాడుతున్నామని అమెరికా వాదిస్తోంది.

# పూర్తి ఆరోగ్యంగా ట్రంప్

## వైద్య పరీక్షల నివేదిక

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉన్నారని శ్వేతసౌధం వైద్యుడు షాన్ బార్బెల్ నివేదించారు. ఈ నెల 26న వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో 22 మంది నిపుణులు ట్రంప్‌కు పలు పరీక్షలు చేశారు. వచ్చే నెల 80 ఏళ్లు నిండనున్న ట్రంప్ 108 కిలోల బరువుతో దేశ సేవకు అన్ని విధాలా సమర్థంగా ఉన్నారని వైద్యులు ధృవీకరించారు.



ఆయన చేతులపై కనిపించిన మచ్చలు తరచూ కరచాలనం చేయడం వల్ల ఏర్పడిన స్వల్పమైన సాఫ్ట్ టిష్యూ ఇరిటేషన్ మాత్రమేనని బార్బెల్ వివరించారు. దీర్ఘకాల సిరల వ్యాధి (వీనస్ ఇన్సఫిషియెన్సీ) కారణంగా కాళ్ల దిగువ భాగంలో స్వల్పంగా వాపు ఉన్నా, అది మునుపటి కంటే మెరుగ్గా ఉందని పేర్కొన్నారు.

# ఇండో-పసిఫిక్‌లో భారత్ కీలక భాగస్వామి

### - హెగ్సెత్ ప్రకటన

సింగపూర్ షాంగ్రిలా సదస్సులో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఇండో-పసిఫిక్ భద్రతపై అమెరికా నిబద్ధతను మరోసారి స్పష్టం చేశారు. ఇండో-పసిఫిక్‌ను చైనా శాసించకుండా చూసుకోవడమే అమెరికా వ్యూహంలో ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. అదే సమయంలో బీజింగ్‌తో ఘర్షణ కోరుకోవడం లేదని స్పష్టం చేశారు.



ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్-పాక్ ఉద్రిక్తతలను ట్రంప్ పరిష్కరించడంలో తోడ్పడ్డారని హెగ్సెత్ వెల్లడించారు. భారతదేశాన్ని ఇండో-పసిఫిక్ వ్యూహంలో కీలక భాగస్వామిగా అమెరికా గుర్తిస్తోందని హెగ్సెత్ ఉద్ఘాటించారు. భారత్ సాయుధ దళాల ఆధునీకీకరణను, హిందూ మహాసముద్ర ప్రాంతంలో శక్తి సమతుల్యత కాపాడటంలో భారత్ పాత్రను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఉమ్మడి ఆయుధోత్పత్తిలో కూడా రెండు దేశాలు కలిసి పనిచేస్తాయని ప్రకటించారు. అయితే, ట్రంప్ సర్కారు చైనాతో అతి సాన్నిహిత్యం పెంచుకుంటూ ఇండో-పసిఫిక్ నిబద్ధతను పక్కకు నెట్టేస్తోందని డెమోక్రటిక్ సెనేటర్ టామీ డక్‌వర్త్ విమర్శించారు.

# బ్యూఫోర్ట్ కోటపై మళ్లీ ఇజ్రాయెల్ పతాకం

దక్షిణ లెబనాన్‌లోని వ్యూహాత్మక బ్యూఫోర్ట్ కోటను ఇజ్రాయెల్ గోలానీ బ్రిగేడ్ స్వాధీనం చేసుకుంది. యుద్ధ విమానాల బాంబింగ్, భూతల పోరాటం కలిసి చేసిన తర్వాత ఐడీఎఫ్ ఆ కోటపై జెండా ఎగురవేసింది. 1982 మొదటి లెబనాన్ యుద్ధంలో పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ నుంచి ఈ కోటను స్వాధీనం చేసుకున్నది కూడా అదే బ్రిగేడ్. అప్పటి నుంచి 2000 వరకు ఇది ఇజ్రాయెల్ అధీనంలో ఉంది. దక్షిణ లెబనాన్, ఉత్తర ఇజ్రాయెల్‌పై నిఘా ఉంచేందుకు ఈ కోట అత్యంత కీలకం. "44 ఏళ్ల తర్వాత మళ్లీ బ్యూఫోర్ట్‌పై ఇజ్రాయెల్ పతాకం ఎగురుతోంది" అని రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. ఈ ప్రాంతంలోని రాకెట్ లాంచింగ్ వ్యవస్థలపై దృష్టి పెడతామని ఐడీఎఫ్ తెలిపింది.



# ఐపీఎల్ విజేత బెంగళూరు

- గుజరాత్ టైటాన్స్‌పై ఘన విజయం
- వరుసగా రెండోసారి విజేతగా నిలిచిన కోహ్లీసేన
- అర్ధసెంచరీలతో రాణించిన కోహ్లీ, అయ్యర్



అహ్మదాబాద్: ఐపీఎల్-19 సీజన్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్లో గుజరాత్పై ఆ జట్టు 5 వికెట్ల తేడాతో నెగ్గి వరుసగా రెండోసారి టైటిల్ సాధించింది. 156 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్కు దిగిన బెంగళూరు 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆ జట్టులో విరాట్ కోహ్లి (75; 42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సులు) చెలరేగాడు. వెంకటేశ్ అయ్యర్ (32; 16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సు), టిమ్ డేవిడ్ (24; 17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. రజత్ పాటీదార్ (15), జితేశ్ శర్మ (11) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్ 2, సిరాజ్, రబాడ, అర్షద్ ఖాన్ ఒక్కో వికెట్ పడగొట్టారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. వాషింగ్టన్ సుందర్ (50; 37 బంతుల్లో) అర్ధ శతకంతో జట్టును ఆదుకున్నాడు. మిగతా బ్యాటర్లు చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. ఓపెనర్లు సాయి సుదర్శన్ (12), శుభమన్ గిల్ (10) విఫలమయ్యారు. వన్ డౌన్‌లో వచ్చిన నిశాంత్ సింధు




(20) పరుగులు చేసి వెనుదిరిగాడు. జోస్ బట్లర్ (19) కూడా క్రీజులో ఎక్కువసేపు నిలవలేకపోయాడు. అర్షద్ ఖాన్ (15) రన్స్ చేశాడు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ 3, జోష్ హేజిల్‌ఉడ్ 2, భువనేశ్వర్ కుమార్ 2, కృనాల్ పాండ్య ఒక్కో వికెట్ పడగొట్టారు. వరుసగా రెండోసారి బెంగళూరు విజేతగా నిలిచింది.

## ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు

### యువరాజ్ సరసన నేపాల్ క్రికెటర్

టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ పేరు చెప్పగానే ఓ రికార్డు గుర్తుకు వస్తుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు




కొట్టిన తొలి ప్లేయర్‌గా యువీ రికార్డు సృష్టించాడు. టీ20 ప్రపంచ కప్ 2007లో భాగంగా సెప్టెంబర్ 19న ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘనత సాధించాడు. ఆ తర్వాత పలువురు ఆటగాళ్లు కూడా ఈ రికార్డును అందుకున్నారు. తాజాగా క్రికెట్ ప్రపంచంలో పసికూన అయినా నేపాల్ జట్టు నుంచి కూడా ఓ ప్లేయర్ ఈ అరుదైన రికార్డును అందుకున్నాడు. నేపాల్ స్టార్ ఓపెనర్ కుషాల్ భుర్టెల్ ఈ ఘనతను సాధించి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. పురుషుల ఆసియా క్రీడాల టీ20 క్వాలిఫయర్-2026లో టోర్నీలో భాగంగా చైనాతో ఆదివారం (మే 31) జరిగిన మ్యాచ్‌లో భుర్టెల్ ఈ అరుదైన ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన బూర్టెల్ డ్రాగన్ కంట్రీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌లో చుయూయ్ చెన్ వేసిన ఆరు బంతులను వరుసగా సిక్సర్లుగా మలిచి అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. మొత్తం 43 బంతుల్లోనే 129 పరుగులు చేసి చైనా బౌలర్లపై దండయాత్ర చేశాడు. భుర్టెల్ ఇన్నింగ్స్‌లో ఏకంగా 16 సిక్సర్లు నమోదయ్యాయి. అనంతరం డెంగ్ జింకీ అతన్ని ఔట్ చేసినా అప్పటికే మ్యాచ్ పూర్తిగా నేపాల్ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఫలితంగా నేపాల్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి ఏకంగా 313 పరుగుల అతి భారీ స్కోరు సాధించింది. 314 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చైనా ఆరంభం నుంచే ఒత్తిడికి గురైంది. నేపాల్ బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శన ముందు చైనా బ్యాటింగ్ కుప్పకూలింది. చైనా జట్టు కేవలం 92 పరుగులకే ఆలౌటైంది. గతంలో అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకే ఓవర్లలో ఆరు సిక్సర్ల ఘనతను హెర్షల్ గిబ్స్, యువరాజ్ సింగ్, కీరన్ పోలార్డ్, జస్కరన్ మల్హోత్రా, దీపేంద్ర సింగ్ ఎయిరీ సాధించారు. కాగా, సింగపూర్ వేదికగా జరుగుతున్న పురుషుల ఆసియా క్రీడల టీ20 క్వాలిఫయర్-2026 టోర్నీలో మొత్తం 8 జట్లు రెండు గ్రూప్‌లుగా విభజించబడి పోటీపడుతున్నాయి. నేపాల్, చైనా, ఖతార్, మలేసియా గ్రూప్-ఏ, బెహ్రెయిన్, హాంగ్‌కాంగ్, ఒమన్, సింగపూర్ గ్రూప్-బీలో పోటీపడుతున్నాయి.

## భారత్ ఏ జట్టు వైస్ కెప్టెన్‌గా గైక్వాడ్

### -శ్రీలంకలో ముక్కోణపు సిరీస్



శ్రీలంక: శ్రీలంకలో ముక్కోణపు సిరీస్‌కు భారత్-ఎ జట్టు వైస్ కెప్టెన్‌గా యువ బ్యాటర్ రియాన్ పరాగ్ ఎంపికైన సంగతి తెలిసిందే. తాజాగా తొడ కండరాల గాయంతో పరాగ్ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో అతడి స్థానంలో స్టార్ ప్లేయర్ రుతురాజ్ గైక్వాడ్‌కు బీసీసీఐ చోటు కల్పించింది. దాంతోపాటు వైస్ కెప్టెన్ బాధ్యతలనూ అప్పగించింది. జూన్ 9 నుంచి ప్రారంభం కానున్న ఈ ముక్కోణపు సిరీస్‌లో భారత్-ఎ, శ్రీలంక-ఎ, అఫ్గానిస్థాన్-ఎ జట్లు తలపడనున్నాయి. ప్రతి జట్టు మిగతా రెండు జట్లతో రెండేసి మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌లన్నింటికీ శ్రీలంకలోని దంబుల్లా ఆతిథ్యమివ్వనుంది. ఐపీఎల్ 2026లో రియాన్ పరాగ్ రాజస్థాన్ రాయల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. టోర్నీ మొత్తాన్ని అతడు కండరాల గాయంతోనే ఆడాడు. ఇప్పుడు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించడంతో ముక్కోణపు సిరీస్ నుంచి వైదొలిగాడు. పూర్తిగా కోలుకోవడానికి దాదాపు మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం.

భారత్-ఎ జట్టు:

-----------

-----------

తిలక్ వర్మ(కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్ కెప్టెన్), ప్రియాంశ్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, ఆయుశ్ బదోని, నిశాంత్ సింధు, సుర్యాంశ్ షెడ్గే, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), కుమార్ కుషాగ్రా(వికెట్ కీపర్), విప్రాజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్వీర్ సింగ్, అన్షుల్ కాంబోజ్, అర్షద్ ఖాన్, అనుకుల్ రాయ్

## వైభవ్ టెస్ట్ క్రికెట్ ఆడగలడా..



తాజా ఐపీఎల్‌లో అదరగొట్టిన పదిహేనేళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ సాంప్రదాయ టెస్ట్ క్రికెట్ ఆడగలడా? ఈ ప్రశ్నలకు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ సమాధానం చెప్పాడు. ఫార్మాట్ ఏదైనా తనకు నచ్చిన రీతిలో ఆడే స్వేచ్ఛ వైభవ్‌కు ఇవ్వాలని అభిప్రాయపడ్డాడు. ఆ స్వేచ్ఛ కొనసాగితే టెస్ట్ క్రికెట్‌లో కూడా అతడు విజయవంతం అవుతాడు' అని సచిన్ పేర్కొన్నాడు. 'వైభవ్ చాలా స్పెషల్ ప్లేయర్. అతడు మణికట్టును వాడే విధానం బాగుంది. అతడు కేవలం బంతిని బాదడమే కాదు. బౌలర్ల లైన్ అండ్ లెంగ్త్‌ను ముందుగానే పసిగట్టి మైదానం నలువైపులా షాట్లు కొట్టాడు. అతడు టెస్ట్ క్రికెట్ ఆడాలని నేను కోరుకుంటున్నా. టెస్ట్ క్రికెట్‌లో వివిధ సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకుంటాడు. ఫార్మాట్ ఏదైనా అతడు స్వేచ్ఛగా ఆడేలా ప్రోత్సహించాలి' అని సచిన్ పేర్కొన్నాడు.

**జార్ఖండ్ టీ20 లీగ్‌లో ఇషాన్‌ను కిషన్‌ను దాటి**

## అత్యధిక ధర పలికిన ఎంఐ ప్లేయర్



ముంబై: టీమిండియా యంగ్ ప్లేయర్, సన్ రైజర్స్ హైదరా బాద్ స్టార్ ఆటగాడు ఇషాన్ కిషన్‌కు జార్ఖండ్ టీ20 లీగ్ వేలంలో ఊహించని షాక్ తగిలింది. ఐపీఎల్ 2026లో పరుగుల వరద పారించిన ఇషాన్‌ను వెనక్కినెట్టి, ముంబై ఇండియన్స్ జట్టులో ఉన్న ఓ సాధారణ ప్లేయర్ అయిన రాబిన్ మింజ్ అత్యంత ఖరీదై న ఆటగాడిగా నిలిచాడు. మే 30న జార్ఖండ్ రాష్ట్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో తొలి జార్ఖండ్ టీ20 లీగ్ మెగా వేలం ఘనంగా జరిగింది. రాంచీ వేదికగా జరిగిన జార్ఖండ్ టీ20 లీగ్ వేలంలో రాంచీ టైటాన్స్, జంషెడ్‌పూర్ స్టీలర్స్, చోటా నాగ్‌పూర్ రాయల్స్, కోయలాంఛల్ సూపర్‌కింగ్స్, ధన్‌బాద్ డైమాండ్స్, సంథల్ స్ట్రయికర్స్ అనే ఆరు ఫ్రాంచైజీలు పాల్గొన్నాయి. ఈ వేలంలో అన్ని జట్లు తలో రూ.50 లక్షల బడ్జెట్‌తో ఆటగాళ్లను కొనుగోలు చేశాయి. ఈ అక్షన్‌లో ముంబై ఇండియన్స్ ఆటగాడు రాబిన్ మింజ్‌ను దక్కించుకునేందుకు అన్ని జట్లు తీవ్రంగా పోటీ పడ్డాయి. చివరకు కోయలాంఛల్ సూపర్ కింగ్స్ అతడిని రూ.15.25 లక్షలకు సొంతం చేసుకుంది. దీంతో ఈ టోర్నీ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రాబిన్ మింజ్ రికార్డు సృష్టించాడు. మరోవైపు టీమిండియా పాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్‌ను సంథల్ స్ట్రయికర్స్ రూ.14.70 లక్షలకు కొనుగోలు చేసింది. రాబిన్ మింజ్‌తో పోలి స్తే ఇషాన్ ధర రూ.55 వేల తక్కువగా ఉండటం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. దేశీయ క్రికెట్‌లో రాబిన్‌కు పవర్ హిట్టర్ అనే పేరు ఉంది. ఆ ఇమేజ్ అతడిని ఇషాన్ కంటే ఎక్కువ మొత్తానికి అమ్ముడుపోయేలా చేసింది. అలానే ఇషాన్ జాతీయ జట్టు బాధ్యతల కారణంగా ఈ టోర్నీలో కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉండటం కూడా వేలంపై ప్రభావం చూపినట్లు తెలు స్తోంది. కాగా, జార్ఖండ్ టీ20 లీగ్ జూన్ 10 నుంచి ప్రారంభం కానుంది. ఈ లీగ్‌లో మొత్తం 27 మ్యాచ్‌లు జరగనున్నాయి.

చైతన్య రథం
సినిమా
సోమవారం 1 జూన్ 2026 X

## రాకా గ్లింప్స్‌పై క్రేజీ బజ్



అల్లు అర్జున్, దీపికా పదుకొనె కాంబోలో దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం "రాకా". ఇండియన్ సినిమా నుంచి నెవర్ బిఫోర్ లెవెల్ ట్రీట్ ఇచ్చేలా సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. అట్లీ ప్లానింగ్‌లో సినిమా షూట్ శరవేగంగా సాగుతుంటే.. సినిమాలో బన్నీ మొత్తం మూడు షేడ్స్‌లో కనిపించనున్నాడట. తాజాగా ఓ క్రేజీ టాక్ వైరల్‌గా మారింది. అదేంటంటే –రాకా గ్లింప్స్ మరో రెండు నెలల తర్వాత ఆడియెన్స్ ముందుకు రానుందని. అంటే ఆగస్ట్‌లోనే రాకా విజువల్ ట్రీట్ ఎలా ఉంటుందనేది అందరికీ ఒక క్లారిటీ రానుందన్న మాట. సినిమా ప్రపంచాన్ని పరిచయం చేసే విధంగా దీన్ని ప్లాన్ చేస్తున్నట్టుగా టాక్. మరి దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం సమకూరుస్తున్నాడు. అలాగే సన్ పిక్చర్స్ నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

## జన నాయగన్ దర్శకుడు ఏమన్నాడంటే..?



తమిళ స్టార్ హీరో, సీఎం విజయ్ నటించిన 'జన నాయగన్' ఎప్పుడు రిలీజ్ అవుతుందో అర్థంగాని పరిస్థితి తెలిసిందే. దర్శకుడు హెచ్ వినోద్ తాజాగా పాల్గొన్న కార్యక్రమంలో మూవీ విడుదల వివాదంపై మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "నిజానికి ఈ సినిమా విడుదల మన చేతుల్లో ఉండదు. ఈ చిత్రానికి సంబంధించిన నిజాల గురించి మాట్లాడేందుకు నాకు ధైర్యం లేదు" అని దర్శకుడు హెచ్ వినోద్ వ్యాఖ్యానించారు. "ఒకవేళ ధైర్యం చేసి మాట్లాడినా.. దానిని టెలీకాస్ట్ చేసే ధైర్యం మీకు లేదు" అని కామెంట్స్ డోస్ పెంచాడు.

అసలు ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరిలోనే విడుదల కావాల్సి ఉంది. కానీ, సెన్సార్ విషయంలో కోర్టుల వరకూ వెళ్లింది. ప్రత్యేకంగా ఏర్పాటైన రివైజింగ్ కమిటీ ఈ మూవీని చూసి రిపోర్టు ఇవ్వాలి. ఇంకా ఇవ్వలేదు. ఈ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాలేదని నిర్మాత వెంకట్ కె నారాయణ ఇటీవల తెలిపారు. మొత్తానికి విజయ్ సీఎం అయ్యాక కూడా సినిమా రిలీజ్‌పై క్లారిటీ రాకపోవడం విచిత్రం.

## శ్రీనివాస మంగాపురం.. రిలీజ్‌కు రెడీ



అజయ్ భూపతి దర్శకత్వంలో లెజెండరీ సూపర్ స్టార్ కృష్ణ మనవడు, ఘట్టమనేని రమేష్‌బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా రాబోతున్న సినిమా 'శ్రీనివాస మంగాపురం'. కాగా సూపర్ స్టార్ కృష్ణ 84వ జయంతి సందర్భంగా ఈ చిత్రం జూలై 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాకి మహేష్‌బాబు సలహాలు, సూచనలు ఉన్నాయని.. మహేష్ ఫీడ్ బ్యాక్ తమకు ఎంతగానో ఉపయోగ పడిందని జయకృష్ణ చెప్పుకొచ్చాడు. కాగా అశ్వినీదత్ సమర్పణలో, పి. కిరణ్ నిర్మాణంలో 'చందమామ కథలు' బ్యానర్‌పై ఈ చిత్రం రూపొందుతోంది. కాగా తిరుపతి నేపథ్యంలో హిందూ పుణ్యక్షేత్రం తిరుమల వెంకటేశ్వర ఆలయం చుట్టూ ఈ కథ సాగుతుందని తెలుస్తోంది. విష్ణువు స్వయంభుగా అవతరించిన క్షేత్రంలో జరిగిన ఓ సంఘటన ఆధారంగా ఈ కథా నేపథ్యం సాగుతుందని.. ఈ సినిమా మెయిన్ కథాంశమే చాలా కొత్తగా ఉంటుందని తెలుస్తోంది. జాతీయ అవార్డు గ్రహీత సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చాడు.

## నచ్చితేనే సినిమా.. లేదంటే నో!



బాలీవుడ్ కథానాయిక యామీ గౌతమ్ తాజాగా మాతృత్వ దశ తన జీవితాన్ని మార్చివేసిందంటూ చెప్పుకొచ్చింది. 'ఆర్టికల్ 370', 'హక్'లాంటి శక్తిమంత మైన కథలతో ప్రేక్షకుల ముందుకొచ్చిన యామీ.. ఇటీవలే 'ధురంధర్–2'లో అతిథి పాత్రలో మెరిసింది. ప్రస్తుతం 'నయీ నవేలి' సినిమాతో బిజీగా ఉంది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో యామి మాట్లాడుతూ... 'ఇటీవలే నేను బాబుకి జన్మనిచ్చాను. నేను తల్లి కావడం నా జీవితంలో గొప్ప మలుపు. అయితే, నా వృత్తిపరమైన ఎంపికలను నా మాతృత్వ దశ ఏ మాత్రం ప్రభావితం చేయలేదు' అని యామీ చెప్పుకొచ్చింది. యామీ గౌతమ్ ఇంకా మాట్లాడుతూ.. 'నిజానికి మాతృత్వం అనేది గొప్ప భావోద్వేగం. ఇక సినీరంగంలో నా దశాబ్దాల కెరీర్‌ను వెనక్కి తిరిగి చూసుకుంటే.. నా ఎదుగుదలకు.. మనసుకు హత్తుకునే కథలే ముఖ్య కారణం. నా కెరీర్‌లో అలాంటి కథలకే నేను ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాను. ఈ క్రమంలో ఎంతో సహనం అవసరం. ప్రధానంగా 'నో' చెప్పడం నేర్చుకోవాలి. నా పాత్రలు నన్ను ఆకట్టుకుంటేనే వాటిని అంగీకరిస్తాను. లేదంటే నో చెప్పేస్తాను' అంటూ యామీ తెలిపింది.

## చిరు ప్రాజెక్టులో నారా రోహిత్

బాబీ కొల్లి దర్శకత్వంలో చిరంజీవి 158వ చిత్రంగా తెరకెక్కనున్న ప్రాజెక్టుపై క్రేజీ అప్‌డేట్ వినిపిస్తోంది. ఈ సినిమా క్లైమాక్స్‌లో గెస్ట్ రోల్ ఉందని.. ఆ రోల్లో మరో హీరో కనిపించబోతున్నాడని.. ఆ హీరో నారా రోహిత్ అని టాక్ నడుస్తోంది. ఇక ఈ సినిమా సెకండ్ హాఫ్‌లో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ కోసం మెగాస్టార్ సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నాడు. పైగా ఈ సినిమాలో చిరు పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయట. అలాగే, ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా ఉంటాయని తెలుస్తోంది. స్టోరీ కూడా ప్రత్యేకంగా ఉంటుందట. చిరును కొత్తగా చూపించాలనే ఉద్దేశ్యంతో ఈ కథ రాసుకున్నారట బాబీ. కాగా ఈ సినిమాని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాతలు వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. కాగా గతంలో చిరు, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన వాల్తేరు వీరయ్య మంచి విజయం సాధించింది.



## శింబు తెలుగు సినిమా ఎంట్రీ!

కోలీవుడ్ స్టార్ హీరో శింబు త్వరలో తెలుగు సినిమాలో నటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు డబ్బింగ్ చిత్రాల ద్వారా మాత్రమే తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన శింబు, నేరుగా టాలీవుడ్‌లో అడుగుపెట్టే దిశగా చర్చలు జరుగుతున్నాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. 'డ్యూడ్' చిత్రంతో గుర్తింపు పొందిన యువ దర్శకుడు కీర్తిశ్వరన్ చెప్పిన కథ శింబును ఆకట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించే అవకాశాలు అధికంగా ఉన్నాయని సమాచారం. ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలోనే అధికారిక ప్రకటన రానుందని వార్తలు వస్తున్నాయి. 2002లో హీరోగా ఎంట్రీ ఇచ్చిన శింబు, వరుస విజయాలతో తమిళంలో స్టార్ హీరోగా స్థిరపడ్డారు. కెరీర్‌లో ఒడిదొడుకులు ఎదుర్కొన్నా బలంగా కమ్‌బ్యాక్ ఇచ్చిన ఆయన, ఇప్పుడు తెలుగు మార్కెట్‌పై దృష్టి పెట్టడం విశేషం. పలువురు తమిళ హీరోలు నేరుగా తెలుగు సినిమాలు చేసి విజయాలు సాధిస్తున్న నేపథ్యంలో శింబు కూడా అదే బాటలో నడవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.



## లోకేష్ సినిమాటిక్ యూనివర్స్‌లోకి మరో హీరో

'లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా కొత్త సినిమా 'బెంజ్' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో మరో హీరో రవిమోహన్ (జయం రవి) జాయిన్ అయినట్టు డైరెక్టర్ లోకేశ్ ప్రకటించారు. షూటింగుకు సంబంధించిన ఫొటోలను పంచుకున్నారు. రాఘవ లారెన్స్ హీరోగా దర్శకుడు బక్కియరాజ్ కన్నన్ తెరకెక్కిస్తున్న చిత్రమే 'బెంజ్. ఇందులో ఇప్పటికే మలయాళ నటుడు నివిన్ పౌలీ విలన్‌గా నటిస్తున్నారు. రవిమోహన్ ఎలాంటి పాత్ర పోషిస్తున్నారో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే. ఒక సినిమాలోని పాత్రలను మరో సినిమాలోని పాత్రలకు లింక్‌చేసి సినిమాటిక్ యూనివర్స్‌తో కొత్త ట్రెండ్ సెట్ చేశారు లోకేశ్ కనగరాజ్. కార్తి 'ఖైదీ', కమల్ హాసన్ 'విక్రమ్', విజయ్ 'లియో'చిత్రాలు ఇందులో భాగమే.'బెంజ్' కూడా లోకేశ్ రాసిన కథతోనే తెరకెక్కుతుండటం విశేషం. గతేడాది విడుదలైన 'కూలీ'తర్వాత..లోకేశ్ డైరెక్షన్‌లో 'ఖైదీ–2' తెరకెక్కే అవకాశాలున్నాయని అభిమానులంతా అనుకున్నారు. కానీ, ఆయన అల్లు అర్జున్‌తో మూవీని ప్రకటించి సర్‌ప్రైజ్ చేశారు. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. మరోవైపు, 'డీసీ' సినిమాతో ఆయన హీరోగా పరిచయం కాబోతున్న సంగతి తెలిసిందే.

